
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 333

గురువారం 15-8-2024

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



26 మందికి శౌర్య, సేవా పతకాలు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 26 మంది శౌర్య, సేవా పతకాలకు ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రం మొత్తం 1,037 మందికి పతకాలను ప్రకటించింది.

వివరాలు 2లో ▸



రెండు రోజుల పాటు వర్షాలు

తెలుగు రాష్ట్రాల్లో రానున్న 48 గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.


వివరాలు 5లో ▸

మన 'బాబే' కదా.. కేసులు ఎత్తేద్దాం!

సీఎం చంద్రబాబుపై అవినీతి కేసుల ఎత్తివేతకు సర్కారు కుట్ర

- ముందుగా దర్యాప్తును నీరుగార్చే ఎత్తుగడ
- అనంతరం కేసుల విచారణ ఉపసంహరణకు స్కెచ్
- మంత్రివర్గం ద్వారా 'మమ' అనిపించే ప్రణాళిక
- దర్యాప్తు అధికారులకు రోజూ 'ప్రత్యేక క్లాసులు'
- డీజీపీ, సీఐడీ చీఫ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ
- సాక్ష్యాలు తారుమారు చేయాలంటూ ఒత్తిడి
- డిఫెన్స్ న్యాయవాదులకు సహకరించాలని ఆదేశం
- 2 నెలల్లోగా పని పూర్తి కావాలని నిర్దేశం
- అధికారంలోకి రాగానే ప్రారంభమైన ఆపరేషన్
- పలువురిపై లుక్ అవుట్ నోటీసుల ఉపసంహరణ
- ఆ కేసులను సీబీఐకి అప్పగించాలంటున్న నిపుణులు

3లో



సామాన్యుడు కోర్టుకు రాకూడదా?

సీబీఐ దర్యాప్తు కోరకూడదా?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సీఎం చంద్రబాబు తదితరులపై కేసులు సీబీఐకి బదలాయింపుపై కౌంటర్‌కు ఆదేశం.. విచారణ సెప్టెంబర్ 11కి వాయిదా

3లో

ఐటీ షేర్ల అండతో స్వల్ప లాభాలు

- రెండురోజుల నష్టాలకు చెక్
- 150 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

13లో

వైద్యురాలి గ్యాంగ్‌రేప్!

- మృతురాలి జననాంగాల్లో భారీ మొత్తంలో వీర్యం
- కాలిని కటిభాగం వద్ద విరిచేశారన్న పోస్టుమార్టమ్ నివేదిక
- కోల్‌కతా వైద్యురాలి హత్యోదంతంలో వెలుగులోకి విస్మయకర విషయాలు

6లో

థాయిలాండ్ ప్రధానికి ఉద్వాసన

నైతిక ఉల్లంఘన అభియోగాలపై థావీసిన్‌ను తొలగించిన కోర్టు

6లో

వెజ్ ట్రబుల్స్!

ఆరు నెలలుగా దిగిరాని ధరలు.. ఏ కూరగాయైనా రూ.60కి పైనే

దిగుబడిపై ప్రకృతి వైపరీత్యాల దెబ్బ.. మరో ఆరు నెలల పాటు ఇదే స్థితి!

ఆపైనా అనుమానమే అంటున్న వ్యాపారులు



అలమూరు: సగటు జీవి జేబు బరువుగా ఉంటే కానీ కనీస కూరగాయలు కొనే పరిస్థితి కనిపించడం లేదు. ఆరు నెలలుగా అవే ధరలతో ఏమాత్రం తగ్గకుండా కొండెక్కి కూర్చున్నాయి కూరగాయలు. మార్కెట్‌కు ఎప్పుడు వెళ్లినా కూరగాయల ధరలు కేజీ రూ.60 పైనే పలుకుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారుల పర్యవేక్షణ కొరవడి కృత్రిమ కొరత సృష్టించడం వల్ల ఉల్లి, అల్లం, బంగాళదుంపల ధరలు ఆకాశం నుంచి దిగిరావడం లేదు. ఈ ఏడాది వరుసగా ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో కూరగాయల సాగు తీవ్రంగా దెబ్బతింటూ వస్తుండడంతో ఆ మేరకు దిగుబడి తగ్గిపోయి ధరల పెరుగుదలకు కారణమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ ఏడాది సుమారు 35 వేల ఎకరాల్లో కూరగాయల సాగు చేపట్టారు. ఎండల తీవ్రత, వర్షాలు, వరదల వల్ల ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు నెల వరకూ కొరత కొనసాగుతూనే ఉంది. వేసవి, వర్షాల తీవ్రత వల్ల మెట్ట ప్రాంతాల్లోను, వరదల వల్ల గోదావరి తీర ప్రాంతాల్లోను పంట తీవ్రంగా దెబ్బతింది. ఈ ఏడాది మార్చి నెలలోనే ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో ఆ ప్రభావం కూరగాయల మీద పడి అప్పట్లో ధరల పెరుగుదలకు కారణమైంది. అలాగే ఈ ఏడాది వేసవి తీవ్రత జూన్ వరకూ కొనసాగినా మళ్లీ జూలై నెలలో గోదావరికి వరదలు సంభవించాయి. అప్పటి నుంచి ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఇతరత్రా కారణాల వల్ల గత ఆరు నెలల నుంచి కూరగాయలు కేజీ రూ.60 పైనే పలుకుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల రోజు రోజు పెరుగుతూ వస్తున్న కూరగాయల ధరలు మరో మూడు నెలల వరకూ తగ్గే అవకాశం కనిపించడం లేదు.

ధరలు తగ్గే అవకాశం లేదు

ఎండలు, వర్షాలు, వరదల ప్రభావం వల్ల తీవ్రంగా దెబ్బతిన్న కూరగాయల సాగు మళ్లీ చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలంటే మరో మూడు నెలల సమయం పడుతుంది. దీంతో ఈ ఏడాది నవంబరు మొదటి సగ భాగంలో కాని కొత్తపంట అందుబాటులోకి వచ్చే అవకాశం కన్పించడం లేదు. అయినా కూరగాయల పంట మార్కెట్‌కు అందుబాటులోకి వచ్చే సమయానికి కార్తీకమాసం ప్రవేశించడంతో పాటు అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో మాలధారణ చేపట్టే అవకాశం ఉంటుంది. దీంతో కూరగాయ ధరలు ఇంచుమించు ఇదే విధంగా ఉండే అవకాశముందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో నెలల తరబడి పెరుగుతూ వస్తున్న కూరగాయల ధరలు సామాన్యుడికి పెను భారంగా మారాయి.

ఇసుక బుకింగ్‌కు ఆన్‌లైన్ అప్లికేషన్

సీఎం చంద్రబాబు సమీక్షలో మార్గదర్శకాలు జారీ

14లో

ఒక్కటిగా నిలబడ్డాం.. అందుకే బాబు తలవంచారు



- ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్
- ఎమ్మెల్సీ ఎన్నికలో టీడీపీకి బలం లేకపోయినా పోటీకి యత్నం
- దొడ్డి దారిన ప్రలోభపెట్టి గెలవాలని కుతంత్రం
- ఈ అన్యాయం తీరుపై మనమంతా యుద్ధం చేశాం
- మన క్యాడర్ బలంగా నిలబడటంతో బాబులో వణుకు
- అందుకే పోటీ నుంచి విరమించుకున్నట్లు ప్రకటన
- గత ఎన్నికల్లోనూ చంద్రబాబు అబద్ధపు హామీలు

2లో

అంబేడ్కర్ విగ్రహంపై దాడా?

- త్వరలోనే ఏపీకి బృందాన్ని పంపిస్తాం
- దుండగుల్ని శిక్షించేలా చర్యలు తీసుకుంటాం.. వైఎస్సార్‌సీపీ నేతలకు ఎన్‌సీఎస్సీ చైర్మన్ కిశోర్ మక్వానా హామీ
- విగ్రహానికి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలి.. పోలీసుల నిర్లక్ష్యంపై విచారణ జరిపించాలి
- వినతిపత్రం అందించిన వైఎస్సార్‌సీపీ బృందం

14లో

ప్రాణవాయువా.. ప్రణామం..!

ఆ చిత్తూరులో ఏముంది..? చుట్టూ నాలుగు కొండలు తప్ప. ఇక్కడ ఓ కేంద్ర విశ్వవిద్యాలయం లేదు. ప్రభుత్వ వైద్య కళాశాల లేదు. అంటూ నిట్టూర్చేవారికి చిత్తూరు వాసులు గర్వంగా సమాధానం చెప్పేరోజు రానే వచ్చింది. చిత్తూరు నగరంలో ఉంటున్న గాలిలో ప్రాణవాయువు (ఆక్సిజన్) శాతం మెండుగా ఉందని తలెత్తుకునేలా చెప్పొచ్చు. గాలి కాలుష్యం తక్కువగా ఉండే నగరాల జాబితాలో చిత్తూరుకు స్థానం లభించింది. గతంలో పోలిస్తే గాలిలోపీఎం-10 స్థాయి చిత్తూరులో 59 ఉండటం కాలుష్యం తగ్గినట్లుగా కేంద్రం భావిస్తోంది. కాలుష్య కారకాలు అత్యధికంగా వెలువడే నగరాల్లో విశాఖ 30వ స్థానంలో ఉంటే చిత్తూరు 116వ స్థానంలో ఉండటం కాస్త ఉపశమనం కలిగించే విషయమే.

- చిత్తూరులో పెరుగుతున్న స్వచ్ఛ గాలి పరిమాణం
- ఎన్-క్యాప్ ర్యాంకుల్లో తగ్గిన వాయు కాలుష్య ఉద్గారాలు
- గాల్లో పెరుగుతున్న ఆక్సిజన్ శాతం
- చుట్టూ ఉన్న వృక్ష సంపదే 'అదృష్ట' కారణం



చిత్తూరు నగరం చుట్టూ ఉన్న పచ్చదనం (ఏరియల్ వ్యూ)

చిత్తూరు అర్బన్: భూతాపం (కాలుష్యం కారణంగా భూమి వేడెక్కడం)నేపథ్యంలో ప్రపంచంలో ప్రాణులకు స్వచ్ఛమైన ఆక్సిజన్ దొరకడం కష్టంగా మారిపోయింది. పంచభూతాలుగా పిలవబడే నింగి, నేల, నీరు, గాలి, నిప్పు..ఇలా అన్నీ కలుషితమైపోతున్నాయి. అయితే వీటిల్లో అన్నింటికంటే ప్రాణులకు ఆక్సిజన్ ప్రధానం. ఇటీవల పెరుగుతున్న పట్టణీకరణ, ట్రాఫిక్ సమస్య వల్ల వాహనాలు ఓచోట ఆగినపుడు ఇంజిన్ ఆఫ్ చేయకపోవడం వల్ల కార్బన్ మోనాక్సైడ్ ఎక్కువగా విడుదల కావడం, అడవులు తగలబడిపోవడం జరుగుతోంది. వీటి నుంచి వెలువడే పొగ, పరిశ్రమల్లో బొగ్గు కాల్చడం ద్వారా విడుదలయ్యే ఉద్గారాల వల్ల మనం పీలుస్తున్న గాలిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతోంది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న పట్టణాలు, నగరాల్లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్-కాప్) కింద దేశంలోని 131 పట్టణాల్లో గాలిలో వాయు కాలుష్య ఉద్గారాలు తగ్గించాలని నిర్ణయించింది. ఇందులో చిత్తూరును గుర్తించి, ప్రత్యామ్నాయ చర్యలకు ఎన్-కాప్ రంగంలోకి దిగింది.

సత్ఫలితాలు

2025-26 నాటికి చిత్తూరులో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని ఎన్-కాప్ లక్ష్యంగా పెట్టుకుంది. 2022లో నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అభ్యర్థన మేరకు మునిసిపల్ కార్పొరేషన్‌కు రూ.6 కోట్ల వరకు కేంద్రం నిధులు కేటాయించింది. ఎన్-కాప్ కింద చిత్తూరుకు దాదాపు రూ.6 కోట్ల నిధులు విడుదల చేసింది. నగర ప్రధాన కూడళ్లల్లో పచ్చదనం పెంపునకు దృష్టి సారించి, ఆక్సిజన్ స్థాయి పెంచడానికి ఏం చేయాలో మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా ఆ నిధులను ఖర్చు చేయించింది. చిత్తూరు నడిబొడ్డున ఉన్న గాంధీ విగ్రహం వద్ద పచ్చని మొక్కలతో ఓ ఉద్యానవనాన్ని నిర్మించారు. అలాగే ఎంఎస్ఆర్ కూడలి, గంగినేనిచెరువు ప్రాంతాల్లో మొక్కలు నాటడం ద్వారా వాహనాల ద్వారా వెలువడే కాలుష్యాన్ని కొంత శుద్ధి చేసినట్లయ్యింది. అలాగే షర్మన్ పాఠశాల నుంచి కలెక్టర్ బంగ్లా వరకు రోడ్డు విస్తరణ, మురుగానిపల్లె వద్ద కొత్త రోడ్డు నిర్మాణం ద్వారా ట్రాఫిక్ మళ్లించడం లాంటి పనులకు ఈ నిధులు ఖర్చు చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి. తాజాగా ఎన్-కాప్ విడుదల చేసిన 2023-24లో నమోదైన వాతావరణ కాలుష్యం డేటా ప్రకారం చిత్తూరు నగరానికి దేశ స్థాయిలో 116వ ర్యాంకు లభించింది. అంటే కాలుష్యం పెరుగుదలలో పీఎం 10 (వాతావరణంలో పీల్చుకునే స్థాయిలో ఉండే 10 మైక్రోమీటర్ల వ్యాసం కలిగిన ముతక కణాలు) స్థాయి 62 నుంచి 59 పాయింట్లకు తగ్గినట్లు ప్రకటించారు.

చిత్తూరంతా పచ్చదనమే



దీనికితోడు చిత్తూరు నగరం చుట్టూ ఉన్న పచ్చదనం కూడా స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. అడవుల మధ్య ఓ నగర ఉన్నట్లు తలపించే చిత్తూరులో రిజర్వు ఫారెస్టులో 151 హెక్టార్ల విస్తీర్ణం ఎర్రచందనం చెట్లు ఉండటం వల్ల ఇది భూతాపాన్ని తగ్గించడంతో ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఎర్రచందనంలో ఉన్న 'టీరోకార్పస్ సాంటాలినస్' అనే ఔషధం ఉండటం, ఇది గాల్లో కలవడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ లభించే పరిమాణాన్ని పెంచుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గతంలోనూ గుర్తింపు

2018లో అమెరికాలోని చికాగో యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ బిహేవల్ సైన్స్ విభాగంలో అధ్యాపకులుగా ఉన్న డాక్టర్ థామస్ తల్‌హెల్మ్ అనే శాస్త్రవేత్త ఓ సర్వే నిర్వహించారు. డబ్ల్యూహెచ్‌ఓ (ప్రపంచ ఆరోగ్య సంస్థ) సూచీ ఆధారంగా థామస్ తన వద్ద ఉన్న పరికరాలు, తనకు తెలిసిన వ్యక్తుల సాయంతో 'స్మార్ట్ ఎయిర్' అనే సంస్థ ద్వారా ప్రపంచం వ్యాప్తంగా ప్రాణవాయువు ఎక్కువ కలు షితం కాకుండా ఉంటుందో తెలుసుకునేందుకు సర్వే చేశారు. భారత్‌లో స్వచ్ఛమైన వాయువు దొరికే నగరాల్లో చిత్తూరుకు నాలుగో స్థానం దక్కినట్లు ప్రకటించారు.



చిత్తూరు-వేలూరు మార్గంలో గాలి స్వచ్ఛత లభిస్తున్న తీరును తెలిపే డిజిటల్ బోర్డు

క్లుప్తంగా...

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి

- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం


కాన్వాస్‌పై సంతకం చేస్తున్న సీఎస్

సాక్షి, అమరావతి: స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు అయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంపై బుధవారం సీఎస్ తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగురవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఊరూ వాడా హర్ ఘర్ తిరంగా ర్యాలీలను నిర్వహించడంలో జిల్లా కలెక్టర్లు కీలక భూమిక పోషించాలని ఆదేశించారు. స్వాతంత్య్ర దిన వేడుకల్లో సమరయోధులను సత్కరించాలని చెప్పారు. జాతీయ జెండాతో ఉన్న సెల్ఫీ ఫొటోలను, వీడియోలను గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా https://hargar-tiranga.comలో అప్ లోడ్ చేయాలని సీఎస్ ఆదేశించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కాన్వాస్‌పై ఆయన సంతకం చేశారు.

జీఏడీలో రిపోర్ట్ చేయండి

- అనంతపురం జేసీకి సీఎస్ ఆదేశం

సాక్షి, అమరావతి: అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా డి.హరితను నియమిస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసింది. అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పదవి నుంచి హరితను తప్పిస్తూ తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

20 నుంచి ఓటర్ల జాబితా సవరణ




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ–2025ను ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం 20వ తేదీ నుంచి ఇంటింటి సర్వేతో మొదలవుతుందని, వచ్చే 2025 జనవరి 6న తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. '2025 జనవరి ఒకటో తేదీకి 18 ఏళ్లు నిండే వాళ్లందరూ ఫారం–6ను దాఖలు చేసి కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అదేవిధంగా 2025 జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1వ తేదీకి 18 ఏళ్లు నిండేవారు కూడా ముందస్తుగానే ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల భారత సంఘం కల్పిస్తోంది. కొత్త ఓటర్ల నమోదుతోపాటు పాత ఓటర్లలో మరణాలు, సవరణలు ఉంటే వాటిని కూడా ఇంటింటి సర్వే ద్వారా మార్పులు, చేర్పులు చేస్తాం. ఈ మార్పులపై అభ్యంతరాలు, సూచనలను అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు స్వీకరిస్తాం. కొత్తగా ఓటరుగా ఆన్‌లైన్ లేదా మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోచ్చు. ఇందుకోసం https://voters.eci.gov.in లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చు' అని వివేక్ యాదవ్ వివరించారు.

ఢిల్లీకి వెళ్లే ఉత్తమ సేవకుల ఎంపిక

సాక్షి, అమరావతి: ఉత్తమ పనితీరు కనబరచిన నలుగురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒక సిస్టం అడ్మినిస్ట్రేటర్ (వన్‌స్టాప్ సెంటర్)ను ఢిల్లీలో జరిగే స్వాతంత్య్ర దిన వేడుకలకు రాష్ట్రం నుంచి ప్రత్యేక అతిథులుగా ఎంపిక చేసినట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ డైరెక్టర్ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. అనకాపల్లి జిల్లా మల్లెనాయుడుపాలెం–3 అంగన్‌వాడీ వర్కర్ ఆర్.రమణమ్మ, అనంతపురం అర్బన్ నేతాజీ కాలనీ సెక్టార్–4 అంగన్‌వాడీ వర్కర్ నిర్మలమ్మ, అన్నమయ్య జిల్లా మదనపల్లె ఇందిరానగర్ అంగన్‌వాడీ వర్కర్ జయలక్ష్మి, బాపట్ల జిల్లా కె.మల్లాయపాలెం అంగన్‌వాడీ వర్కర్ నాగమణి, ఏలూరు పీడీ కార్యాలయంలోని సెంటర్ అడ్మినిస్ట్రేటర్ నిర్మల ఎంపికైన వారిలో ఉన్నట్లు వెల్లడించారు.

డ్రోన్ టెక్నాలజీపై సీఎం దృష్టికి తీసుకెళ్తా

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ప్రభుత్వ శాఖల్లో డ్రోన్ టెక్నాలజీ వినియోగం అవకాశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని రోడ్లు, భవనాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం సచివాలయంలో డ్రోన్ తయారీ కంపెనీలు వింగ్స్ అండ్ ప్రాప్స్, సిడాక్ ప్రతినిధులు మంత్రిని కలిశారు. అదేవిధంగా ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన దినేష్‌కుమార్ మంత్రి జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.


సమావేశానికి హాజరైన యలమంచిలి నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు


ప్రసంగిస్తున్న వైఎస్ జగన్


సమావేశానికి హాజరైన భీమిలి నియోజకవర్గ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

ఒక్కటిగా నిలబడ్డాం — అందుకే బాబు తలవంచారు

ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్

- ఎమ్మెల్సీ ఎన్నికలో టీడీపీకి బలం లేకపోయినా పోటీకి యత్నం
- మన పార్టీ క్యాడర్ బలంగా నిలబడటంతో చంద్రబాబు వెన్నులో వణుకు
- అందుకే తల వంచి పోటీ నుంచి విరమించుకున్నట్లు ప్రకటన
- గత ఎన్నికల్లోనూ చంద్రబాబు అబద్ధపు హామీలు
- ఇప్పుడు మళ్లీ అందరూ మోసపోయే పరిస్థితి
- రెండున్నర నెలల్లోనే అన్ని వ్యవస్థల పతనం
- మేనిఫెస్టోలోని పథకాలు అమలు చేయలేక సాకులు
- ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ వద్ద కుర్చీలు తీసేస్తున్నారు
- సర్కారు తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా మారాయి
- నాడు మనం ఏ సాకు చెప్పకుండా ప్రతి హామీ నిలబెట్టుకున్నాం
- ఐదేళ్ల తర్వాత మళ్లీ మన విజయం తథ్యం

> నిజానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా చంద్రబాబు అందరికీ కాల్స్ చేసి.. అది ఇస్తా, ఇది ఇస్తా అని ఆశ చూపే ఉంటాడు. కానీ ధర్మం, న్యాయం గెలిచింది. మీరు ఒక్కటిగా నిలబడ్డారు కాబట్టి ఆయన ఆటలు సాగలేదు. సంఖ్యా బలం లేనప్పుడు పోటీ పెడతాననడమే తప్పు. అలా చేయడం ఆయన నైజం. ఆ మనిషి అలా చేసినా కూడా వైఎస్సార్‌సీపీ నాయకులు అందరూ ఒకే తాటిమీద విలువలు, విశ్వసనీయతతో నిలబడటం వల్లే ఆ మనిషి తల వంచారు.
> - వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో మనమంతా ఏకమై ఎప్పుడైతే యుద్ధం చేయడం ప్రారంభించామో.. ఎప్పుడైతే వైఎస్సార్‌సీపీ కేడర్ బలంగా కనిపించిందో అప్పుడు చంద్రబాబు వెన్నులో భయం ప్రారంభమైందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అందుకే ఎన్నికలో పోటీ నుంచి విరమించుకున్నట్టు ప్రకటన చేశారని చెప్పారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో బుధవారం ఆయన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో యలమంచిలి, భీమిలి నియోజకవర్గాల పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్‌లతో సమావేశమయ్యారు. 'గత ఎన్నికలు ఎలా జరిగాయో ప్రజా ప్రతినిధులుగా మీరంతా చూసే ఉంటారు. ఎన్నికల్లో ఈ మాదిరి ఫలితాలు రావడానికి కారణం పది శాతం ఓటర్లు చంద్రబాబు చెబుతున్న అబద్ధాల వైపు మొగ్గు చూపారు. ఎన్నికల ప్రచారంలో అబద్ధపు హామీలతో మోసపూరితమైన ప్రచారం చేశారు. తీరా ఇప్పుడు అంతా మోసపోయిన పరిస్థితుల్లో ఉన్నారు' అని చెప్పారు. ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ జగన్ ఉండి ఉంటే.. అన్న విషయంపై చర్చ జరుగుతోందన్నారు. 'జగన్ పలావు పెట్టాడు.. చంద్రబాబు బిర్యానీ పెడతానని ఆశ చూపాడని అంటున్నారు. చివరకు పలావు పోయింది. బిర్యానీ పోయిందనే చర్చ ఇప్పుడు ప్రతి ఇంట్లో జరుగుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక పథకాలు రాకపోగా, వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో ఓపీ దగ్గర కుర్చీలు కూడా తీసేస్తున్న పరిస్థితి ఉంది' అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మనం ఏ సాకూ చూపలేదు

- ఇవాళ ఏ సమస్య లేకపోయినా చంద్రబాబు ఎన్నో సమస్యలున్నట్టు చిత్రీకరిస్తున్నాడు. నిజానికి ఆనాడు మనం అధికారంలోకి వచ్చినప్పుడు ఎన్నో సమస్యలు. ఒకవైపు చంద్రబాబు చేసిన అప్పులు.. ఆ అప్పుల మీద వడ్డీలు.. వాటికి తోడు కోవిడ్ మహమ్మారి.. ఇలా మన పరిపాలన కాలంలో సమస్యలు తాండవించాయి. ఆ సమయంలో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు తగ్గినా, రాష్ట్రంలో పెట్టే ఖర్చు అనూహ్యంగా పెరిగినా మనం ఎలాంటి సాకులు చూపలేదు. ఎటువంటి కారణాలు చెప్పలేదు. శ్వేతపత్రాలు అని చెప్పడమో.. గత ప్రభుత్వాల మీద నిందలు మోపడమో చేసి.. ప్రజలకు చేయాల్సింది చేయకుండా పోయే కారణాలు ఎప్పుడూ చూపించలేదు.
- ఎన్ని కష్టాలున్నా చిక్కటి చిరునవ్వుతో ప్రతి ఇంటికి మంచి చేస్తూ.. ఈ నెలలో ఈ కార్యక్రమం చేస్తామని.. గతంలో ఎప్పుడూ జరగని విధంగా బడ్జెట్లో ఒక కేలండర్ విడుదల చేసి.. బటన్ నొక్కి, ప్రతి ఇంటికీ నేరుగా డోర్ డెలివరీ చేసిన చరిత్ర మన ప్రభుత్వానిది. దేవుని దయతో ఇవన్నీ చేయగలిగాం. అందుకే ఈ రోజు ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి సగర్వంగా తలెత్తుకుని పోగలుగుతాడు. అక్కా, అన్నా మా ప్రభుత్వంలో ఇది చెప్పాం.. చెప్పింది తూ.చా. తప్పకుండా ప్రతి ఒక్కటీ అమలు చేశామని చెప్పగలుగుతారు.

ఇప్పటికే ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత

- రెండున్నర నెలల చంద్రబాబు పాలన చూశాం. ఇంతలోనే చంద్రబాబు ప్రభుత్వం మీద వ్యతిరేకత ఇంత వేగంగా పుట్టడం మొట్ట మొదటిసారి చూస్తున్నాం. ఇవాళ జగనే ఉండి ఉంటే.. అన్న చర్చ ప్రతి ఇంట్లో జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ఉండి ఉంటే.. ప్రతి తల్లికి అమ్మఒడి వచ్చేది. ప్రతి రైతన్నకు రైతుభరోసా సొమ్ము వచ్చి ఉండేది. 2023–24 ఖరీఫ్‌కు సంబంధించి ఇన్సూరెన్స్ సొమ్ము కూడా వచ్చి ఉండేది.
- విద్యార్థులకు ప్రతి మూడు నెలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు పడేవి. ప్రతి త్రైమాసికం అయిపోయిన తర్వాత ఇచ్చే పరిస్థితులు గతంలో ఉంటే.. ఇప్పుడు రెండు త్రైమాసికాలు అయిపోయినా డబ్బులు ఇవ్వలేదు. వసతి దీవెన కూడా ఇవ్వలేదు. పొదుపు సంఘంలోని ప్రతి అక్కచెల్లెమ్మకు మామూలుగా ఏప్రిల్లో సున్నా వడ్డీ డబ్బులు జమ అయ్యేవి. అవి కూడా పడలేదు.
- నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా లేదు. వాహన మిత్ర కూడా లేదు. ఎక్కడా ఎవరూ అడగాల్సిన అవసరం లేకుండా సాఫీగా అన్నీ జమ అయ్యే పరిస్థితి నుంచి ఇవాళ ఒక్కరికీ ఒక మేలు జరగకపోగా.. అన్నీ దారుణాలే జరుగుతున్నాయి.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

- రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తి అధ్వానంగా మారింది. రెడ్‌బుక్ పాలన సాగుతోంది. గ్రామ స్థాయిలో కక్షలను ప్రోత్సహించకూడదన్నది పక్కన పెట్టి.. గ్రామ స్థాయిలోనే వాటిని ప్రోత్సహిస్తూ మీరు చేసుకోండి.. పోలీసులను మేం చూసుకుంటాం.. అని రెడ్ బుక్ పాలన సాగిస్తున్నారు. దిశ యాప్ ఏమైందో కూడా అర్థం కావడం లేదు. ఇవన్నీ కేవలం రెండున్నర నెలల్లోనే మన కళ్లెదుటే కనిపిస్తున్న మార్పులు.
- ఎక్కడా అబద్ధాలు, మోసాలు లేకుండా ప్రజలకు మనం మంచి చేశాం. చంద్రబాబు బిర్యానీ పెడతానని మోసం చేస్తున్నాడు. ఇచ్చిన ఏ మాట నెరవేర్చనప్పుడు ప్రజలు తాము మోసపోయామన్న భావన నుంచి కోపం పుడుతుంది. అప్పుడు చంద్రబాబు పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి.

మన వ్యక్తిత్వమే మనకు రక్ష

- ఈ ఐదేళ్లలో కష్టాలు ఉంటాయి. కష్టాలు లేకుండా సృష్టే ఉండదు. చీకటి వచ్చిన తర్వాత మళ్లీ పగలు రాక తప్పదు. కష్టాలు ఎంత తీవ్రంగా ఉంటాయంటే.. 16 నెలలు నన్నే జైల్లో పెట్టారు. కష్టాలు వచ్చినప్పుడు మన వ్యక్తిత్వమే మనకు శ్రీరామరక్షగా నిలబడుతుంది. మీ అందరికీ ఒక్కటే చెబుతున్నా. మనం చేసిన మంచి ఎక్కడికీ పోలేదు. రానున్న రోజుల్లో ఏ తెలుగుదేశం పార్టీ కార్యకర్త కూడా ప్రజల్లోకి వెళ్లి మేం ఫలానా మంచి చేశామని చెప్పుకునే పరిస్థితి ఉండదు.
- ఎందుకంటే వాళ్లు చెప్పినవన్నీ మోసాలు, అబద్ధాలు కాబట్టి ప్రజలు వాళ్లను నిలదీసే కార్యక్రమం జరుగుతుంది. అదే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్తే చెప్పిందే చేశారని దండలు వేసే పరిస్థితి వస్తుంది. ఐదేళ్ల తర్వాత మళ్లీ మీకు, నాకు ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుంది.

అంతా అస్తవ్యస్తం

- విద్యా రంగంలో టోఫెల్ అనే సబ్జెక్టు పీరియడ్‌గా ఉండేది. దాన్ని ఎత్తేశారు. ఇంగ్లిష్ మీడియం, రోజుకొక మెనూతో గోరుముద్ద.. పాఠశాల పిల్లలకు పెట్టే భోజనం ప్రశ్నార్థకం అయింది. డిసెంబర్‌లో పిల్లలకిచ్చే ట్యాబుల పరిస్థితి ప్రశ్నార్థకం అయింది.
- ఆరోగ్య రంగానికి సంబంధించి ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.1,800 కోట్లు దాటాయి. మార్చిలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆరోగ్యశ్రీకి సంబంధించి జనవరి నుంచి ఉన్న రూ.1,800 కోట్ల బకాయిలు ఆపేశారు. ఇవాల్టికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. గతంలో జీరో వేకెన్సీ పాలసీ తీసుకొచ్చి ఏ ఆసుపత్రిలోనూ డాక్టర్ల కొరత ఉండకూడదన్న పరిస్థితి నుంచి, ఈ రోజు ఆసుపత్రుల్లో డాక్టర్లు ఎక్కడ ఉన్నారు? అన్న పరిస్థితికి ప్రభుత్వ ఆస్పత్రులు వెళ్లిపోయాయి. ఆరోగ్య ఆసరా కనిపించడం లేదు. 108, 104 బిల్లులు లేవు. ఆసుపత్రుల్లో డాక్టర్లు లేరు, మందులు లేవు, పరిశుభ్రత అన్నది లేనే లేని పరిస్థితి.
- రైతులు విత్తనాల కోసం మళ్లీ క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఫ్రీ ఇన్సూరెన్స్ పోయింది. ఈ–క్రాప్ పోయింది. ఉచిత పంటల బీమాను కూడా పక్కన పెట్టేశారు. గతంలో మన ప్రభుత్వం ఉన్నప్పుడు అవ్వాతాతల పెన్షన్ నుంచి, బియ్యం వరకు ప్రతి పథకం డోర్ డెలివరీ జరిగేది. ఇప్పుడు అంతా పోయింది. తెలుగుదేశం పార్టీ నాయకుల చుట్టూ.. జన్మభూమి కమిటీలంటూ నాయకులు ఎక్కడున్నారని వాళ్ల దగ్గరకు ప్రజలు వెళ్లాల్సిన దుస్థితిలో ఇవాళ పాలన సాగుతోంది.

ఎమ్మెల్సీగా బొత్స

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ.. 16న అధికారికంగా ప్రకటన



మహారాణిపేట (విశాఖ దక్షిణ): స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎన్నిక దాదాపు ఖరారైంది. స్వతంత్ర అభ్యర్థి షఫీ ఉల్లా తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంది. ఆ రోజు బొత్స సత్యనారాయణ ఎన్నికను అధికారికంగా ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు.

పూర్తయిన నామినేషన్ల పరిశీలన

బుధవారం ఉదయం నామినేషన్ల పరిశీలన జరిగింది. జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కె.మయూర్ అశోక్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఇతర రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో బొత్స సత్యనారాయణ ఎన్నికల ఏజెంట్ మణికంఠ నాయుడు, స్వతంత్ర అభ్యర్థి షఫీ ఉల్లా సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. అభ్యర్థికి ప్రతిపాదన చేసిన ఓటర్లు, ఇతర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కొద్దిసేపటి తర్వాత 2 నామినేషన్లు సక్రమంగానే ఉన్నట్టు ఆర్వో మయూర్ అశోక్ ప్రకటించారు. ఆ తర్వాత షఫీ ఉల్లా తన నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు ఆర్వో మయూర్ అశోక్‌కు లేఖ అందజేశారు.

పోటీకి భయపడ్డ కూటమి

ఓటమి భయంతో కూటమి పోటీ నుంచి తప్పుకుంది. బలం లేకపోయినా పోటీ చేయడానికి చివరి వరకు టీడీపీ ప్రయత్నం చేసింది. పోటీ చేస్తే చిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఆ పార్టీ పెద్దలు గ్రహించారు. దీంతో పోటీకి వెనకడుగు వేశారు.

26 మందికి శౌర్య, సేవా పతకాలు

ఐజీ రవిప్రకాష్, ఇన్‌స్పెక్టర్ దండు గంగరాజుకు రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకాలు

- స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పతకాలు ప్రకటించిన కేంద్రం


రవిప్రకాష్, ఐజీ


గంగరాజు, ఇన్‌స్పెక్టర్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 26 మంది శౌర్య, సేవా పతకాలకు ఎంపికయ్యారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పోలీస్, అగ్నిమాపక, హోంగార్డు, సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీసెస్‌కు చెందిన మొత్తం 1,037 మంది అధికారులకు శౌర్య, సేవా పోలీస్ పతకాలను ప్రకటించింది. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నలుగురికి పోలీస్ శౌర్య పతకాలు, ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకాలు, 19 మందికి ప్రతిభాపూర్వక పోలీస్ పతకాలు లభించాయి. అగ్నిమాపక సర్వీస్‌కు చెందిన ఒకరికి ప్రతిభాపూర్వక పోలీస్ పతకం వరించింది. ప్రాణాలు, ఆస్తులను కాపాడటం, నేరాలను నిరోధించడంలో లేదా నేరస్తులను అరెస్ట్ చేయడానికి విధి నిర్వహణలో ప్రదర్శించిన శౌర్యం, తెగువ ఆధారంగా రాష్ట్రపతి శౌర్య పతకం (పీఎంజీ), శౌర్య పతకం (జీఎం) కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. విధి నిర్వహణలో అందించిన విశిష్ట సేవకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం (పీఎస్ఎం), విలువైన సేవకు ప్రతిభాపూర్వక సేవా పతకం (ఎంఎస్ఎం) ఇస్తున్నారు. రాష్ట్రం నుంచి పతకాలకు ఎంపికైన వారి వివరాలివీ.

ప్రతిభాపూర్వక సేవా పతకాలు

విష్ణు నర్దిద (అడిషనల్ ఎస్పీ), లక్ష్మీ ఎస్ఎస్‌జే (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్), గోపాలకృష్ణ సోమసాని (డీఎస్పీ), మురళీకృష్ణ తక్కెలపాటి (డీఎస్పీ), రామచంద్రమూర్తి కొండుమహంతి (అడిషనల్ ఎస్పీ), ఉదయభాస్కర్ దేశబత్తిన (గ్రూప్ కమాండర్), శ్రీనివాసులు పేదరాశి (డీఎస్పీ), కృష్ణమూర్తిరాజు కనుమూరి (ఇన్‌స్పెక్టర్), లక్ష్మీ నరసింహారావు సిరికి (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్), రమేష్‌బాబు కాట్రగడ్డ (కానిస్టేబుల్), శ్రీనివాసరావు గద్దం (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్), వీరవెంకట సత్యసాంబశివరావు తోటకూర (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్), వెంకట సుబ్బారాయుడు జింకా (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్), రామచంద్ర శేఖరరావు మంద (హెడ్ కానిస్టేబుల్), జయచంద్రరెడ్డి వద్దిరెడ్డి హెడ్ కానిస్టేబుల్), డి.భక్తవత్సలరాజు (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్), చిన్న సైదా షేక్ (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్), కె.గోవిందరాజులు (అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్), షరీఫ్ మహబూబ్ (సబ్ ఇన్‌స్పెక్టర్), చిన్నం మార్టిన్ లూథర్‌కింగ్ (అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్)

రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు

- ఎం.రవిప్రకాష్ (ఐజీ)
- డి.డి.గంగరాజు (ఇన్‌స్పెక్టర్)

శౌర్య పతకాలు

- షేక్ సర్దార్ ఘనీ (ఇన్‌స్పెక్టర్)
- సవ్వన అరుణ్‌కుమార్ (సబ్ ఇన్‌స్పెక్టర్)
- మైలపల్లి వెంకట రామ పరదేశీనాయుడు (రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్)
- రాజన గౌరీశంకర్ (హెడ్ కానిస్టేబుల్)

సర్దుబాటు బదిలీలకు త్వరలో కొత్త మార్గదర్శకాలు

- అప్పటివరకు బదిలీలు నిలిపివేత
- ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్య డైరెక్టర్ సమావేశం
- హామీలు నెరవేర్చాకే సర్దుబాటు చేయాలని పట్టుబట్టిన టీచర్లు
- 117 జీవో రద్దు, జీవో నం.53 ప్రకారం బదిలీలకు డిమాండ్
- కొన్ని డిమాండ్లకు అంగీకారం

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల డిమాండ్లను పక్కనబెట్టి తమ వారిని కోరుకున్న స్థానాలకు బదిలీ చేయాలనుకున్న కూటమి నేతల ఎత్తులు పారలేదు. పని సర్దుబాటు బదిలీలను నిలిపివేస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే పని సర్దుబాటు చేపట్టాలన్న డిమాండ్‌కు కట్టుబడ్డ టీచర్లు ఇటీవల పాఠశాల విద్యా శాఖ చేపట్టిన పని సర్దుబాటు బదిలీలను బహిష్కరించారు. దీంతో ఉపాధ్యాయ సంఘాల నేతలతో పాఠశాల విద్య డైరెక్టర్ విజయ రామరాజు బుధవారం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కొన్ని డిమాండ్లకు విద్యా శాఖ అంగీకరించగా, మరికొన్నింటిని ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలపై సమీక్షించి త్వరలో కొత్త మార్గదర్శకాలు విడుదల చేస్తామని, అంతవరకు ఈ బదిలీలను నిలిపివేస్తున్నట్టు విద్యా శాఖ తెలిపింది.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవో నం.117ను రద్దు చేయాలని, పని సర్దుబాటు బదిలీలు జీవో నం.53 ప్రకారమే చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. 117 జీవోను రద్దు చేస్తామని సీఎం, విద్యా శాఖ మంత్రి తెలిపారని, ఇందుకు కొంత సమయం పడుతుందని డైరెక్టర్ చెప్పారు. ఆలోగా బోధనకు ఇబ్బంది రాకుండా సర్దుబాటు పూర్తి చేయాలన్నారు. సర్దుబాటు ప్రక్రియను తొలుత యాజమాన్యాల పరిధిలో చేస్తామని, ఆ తర్వాతే ఇతర యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లోకి సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ పాఠశాలల్లో సర్దుబాటు అనంతరం పదోన్నతులు, బదిలీలు, అప్‌గ్రేడేషన్ చేపట్టాలని ఎస్టీయూ, రికగ్నైజ్డ్ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్)తో పాటు అన్ని గుర్తింపు ఉపాధ్యాయ సంఘాల నేతలు అధికారులను కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 ఆధారంగా సర్దుబాటు చేయాలని, ఈ సంవత్సరంలో ప్లస్ 2 ఉన్న తరగతులు ప్రారంభమైన పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

కీలక అంశాలపై హామీలు ఇవీ..

- అవసరాన్ని బట్టి మాత్రమే మిగులును నిర్ణయించి సర్దుబాటు చేయాలన్న డిమాండ్‌పై సానుకూల స్పందన సర్దుబాటు బదిలీల్లో సీనియర్లకు విల్లింగ్ అవకాశం.
- ప్రత్యేక అవసరాలు గల ఉపాధ్యాయులు, 2025 మే 31లోపు పదవీ విరమణ చేసే టీచర్లకు సర్దుబాటు నుంచి మినహాయింపు.
- ప్రాథమిక స్కూల్ హెచ్ఎం పోస్టులను విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కొనసాగించే అంశం పరిశీలన.
- 6 నుంచి 10 తరగతులు 8 సెక్షన్లు దాటితే రెండో హిందీ, పీఎస్ పోస్టుల కేటాయింపు పరిశీలన. యూపీ పాఠశాలల్లో జీవో నం.60 ప్రకారం పోస్టుల కేటాయింపు.
- 98 మందికి పైగా విద్యార్థులున్న స్కూళ్లకు స్టాఫ్ ప్యాటర్న్ మేరకు పని సర్దుబాటు, 98 మంది లోపు విద్యార్థులు ఉన్న స్కూళ్లకు 5 లేదా 6 పోస్టుల కేటాయింపునకు ప్రయత్నం
- సెప్టెంబర్ లోపు రిటైరయ్యే టీచర్లున్న స్కూళ్లకు సర్దుబాటు నుంచి మినహాయింపు.
- దీర్ఘకాలిక సెలవులో ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో వేరే వారితో సర్దుబాటు. సమాంతర మాధ్యమం ఉన్న పాఠశాలల్లో తెలుగు, ఉర్దూ, సంస్కృతం తదితర భాషా పండితుల పోస్టుల కొనసాగింపు.
- ప్లస్–2, సీబీఎస్ఈ స్కూల్లో పని సర్దుబాటు నిలిపివేత. మొదట మండల స్థాయిలో, తర్వాత డివిజనల్ స్థాయిలో పని సర్దుబాటు. జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయాల్సి వస్తే ఉపాధ్యాయుల విల్లింగ్‌తోనే బదిలీ.

స్టార్టప్ హబ్‌గా ఏపీ

- ఆ దిశగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని స్టార్టప్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సీఎం నారా చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రాన్ని ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఐటీ కంపెనీలు ద్వితీయశ్రేణి నగరాలకు విస్తరించేందుకు ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేయాలన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ విభాగాలపై బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. సీఎం మాట్లాడుతూ విశాఖపట్నం ఐఐఎం, తిరుపతి ఐఐటీ, ఇతర ఎడ్యుకేషన్ సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా ఉత్తమ విధానాలను అనుసరిస్తున్న స్టార్టప్‌లను గుర్తించి వాటిని రాష్ట్రానికి తీసుకొచ్చే ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీ, టెస్టింగ్ పార్కు ఏర్పాటుకు అనువైన ప్రాంతాన్ని గుర్తించాలన్నారు. ఎస్ఆర్ఎం సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విశ్వవిద్యాలయం, రిలయెన్స్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నాయని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీకి సంబంధించి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీ రంగాన్ని అన్ని విధాలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

16న ఢిల్లీకి సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు ఈ నెల 16న ఢిల్లీ వెళతారని అధికారవర్గాలు తెలిపాయి. ఈనెల 17న ఆయన ప్రధాని మోదీని కలవనున్నారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం వంటి అంశాలపై చర్చించడానికి ఢిల్లీ వెళుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అందువల్ల టీడీపీ ఆఫీసులో ప్రజాదర్బార్‌ను ఈ నెల 17కు బదులుగా 16న నిర్వహించి, అనంతరం ఢిల్లీ వెళతారు.

నేడు గుడివాడకు చంద్రబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): సీఎం చంద్రబాబు గురువారం కృష్ణాజిల్లా గుడివాడకు రానున్నారు. అక్కడ అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభిస్తారు.



మదినిండా 'జెండా'

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ వన్‌టౌన్‌లో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు భారీ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. 3,300 మీటర్ల పొడవుగల జెండాతో ప్రజల్లో దేశభక్తిని రగిలించారు.



అంబేడ్కర్‌కు అలంకరణ కరువు

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విజయవాడను రాష్ట్రప్రభుత్వం రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించింది. అయితే స్వరాజ్యమైదానంలోని అంబేడ్కర్ స్మృతివనానికి మాత్రం మరిచింది. మాజీ సీఎం వైఎస్ జగన్ ఈ అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రారంభించారనే ప్రభుత్వం వివక్ష చూపిందని పలువురు బాహాటంగా విమర్శించారు.


మన 'బాబే' కదా.. కేసులు ఎత్తేద్దాం!

సీఎం చంద్రబాబుపై అవినీతి కేసుల ఎత్తివేతకు సర్కారు కుట్ర

సాక్షి, అమరావతి: ఓ ఘరానా దొంగ భారీ దోపిడీకి పాల్పడ్డాడు. దానిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తదనంతర పరిణామాల్లో ఆ దొంగే.. పోలీసుగా ఉద్యోగంలోకి వచ్చాడు! మరి దోపిడీపై అప్పటికే నమోదైన కేసు విచారణ ఏమవుతుంది? సహజంగానే కేసును ఆ పోలీసు మూసివేస్తాడు! సక్రమంగా దర్యాప్తు జరిగితే తానే దొంగ అన్నది రుజువై శిక్ష పడుతుంది కాబట్టి! ఈ ఉదాహరణ ఊహాజనితమే కావచ్చు. కానీ రాష్ట్రంలో అదే వాస్తవ రూపం దాల్చి కళ్ల ముందు ఆవిష్కృతమవుతోంది. 2014–19 మధ్య ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన అవినీతి దందాపై సీఐడీ ఇప్పటికే కేసులు నమోదు చేయగా.. ప్రస్తుతం సీఎంగా ఉన్న అదే చంద్రబాబు ఆ కేసులను నీరుగార్చే కుతంత్రానికి తెర తీశారు!

పక్కా ఆధారాలతోనే కేసులు నమోదు..

నాటి టీడీపీ ప్రభుత్వంలో అవినీతి దందాపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు విభాగం (సిట్) చంద్రబాబుపై పలు కేసులు నమోదు చేసింది. రూ.241 కోట్లు కొల్లగొట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆయన్ను అరెస్టు చేయడంతో 52 రోజుల పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇక అమరావతిలో దాదాపు రూ.5 వేల కోట్ల అసైన్డ్, ప్రభుత్వ భూముల దోపిడీ.. రూ.2 వేల కోట్ల మేర ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాలు.. రూ.333 కోట్లు కొల్లగొట్టిన ఫైబర్‌నెట్ స్కామ్‌పై సిట్ పూర్తి ఆధారాలతో కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ దిశగా చర్యలు చేపట్టింది. 2015లో ప్రవేశపెట్టిన మద్యం విధానం ద్వారా టీడీపీ లిక్కర్ సిండికేట్ ఏటా రూ.2.50 లక్షల కోట్లు చొప్పున కొల్లగొట్టడంతోపాటు ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.1,300 కోట్ల పన్ను రాబడికి గండి కొట్టింది. ఇక ఉచిత ఇసుక ముసుగులో రూ.10 వేల కోట్ల దోపిడీ వెలుగులోకి వచ్చింది. ఈ కేసుల్లో సీఐడీ గతంలోనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఆయా కేసుల్లో ప్రధాన నిందితులుగా చంద్రబాబు, లోకేశ్‌తోపాటు పి.నారాయణ, దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, చింతమనేని ప్రభాకర్, పీతల సుజాత, లింగమనేని రమేష్ కుటుంబ సభ్యులు, చంద్రబాబు బినామీలు, సన్నిహితులను నిందితులుగా చేర్చి సీఐడీ కేసులు నమోదు చేసింది.



అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తనపై గతంలో సీఐడీ నమోదు చేసిన కేసుల దర్యాప్తును తొలుత నీరుగార్చి అనంతరం విచారణను ఉపసంహరిస్తూ మంత్రి మండలి ద్వారా నిర్ణయం తీసుకోవాలనే పన్నాగాన్ని చంద్రబాబు అమలు చేస్తున్నారు. అందుకోసం ఏకంగా పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూ డీజీపీ, సీఐడీ చీఫ్‌ల ద్వారా కుట్ర కథను నడిపిస్తున్నారు.

అటకెక్కిన దర్యాప్తు

జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడగానే చంద్రబాబు తనపై ఉన్న సీఐడీ కేసులను నీరు గార్చే కుట్రకు తెర తీశారు. ముఖ్యమంత్రిగా ఆయన జూన్ 12న ప్రమాణ స్వీకారం చేయగా ఫలితాలు వెలువడిన రోజు నుంచే సీఐడీ కేసులను తొక్కిపెట్టే ఆపరేషన్ చేపట్టారు. చంద్రబాబుపై అవినీతి కేసులను విచారిస్తున్న సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కార్యాలయాన్ని పోలీసులు జప్తు చేశారు. తద్వారా ఆ కేసుల దర్యాప్తును అటకెక్కిస్తున్నట్లు స్పష్టమైన సంకేతాలిచ్చారు.

నిందితులపై లుక్ అవుట్ నోటీసుల ఉపసంహరణ!

2014–19 మధ్య చంద్రబాబు అవినీతి కార్యకలాపాల్లో పలువురు షెల్ కంపెనీల ప్రతినిధులు, ప్రైవేటు వ్యక్తులు కీలక పాత్రధారులుగా వ్యవహరించారు. సీమెన్స్‌కు తెలియకుండా ఆ కంపెనీ పేరుతో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ముసుగులో నిధులు కొల్లగొట్టడం.. అసైన్డ్ భూములను కాజేసేందుకు షెల్ కంపెనీల ద్వారా నిధుల తరలింపు.. ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాల్లో షెల్ కంపెనీల ప్రతినిధుల పాత్ర... ఫైబర్‌నెట్ స్కామ్ ద్వారా నిధుల అక్రమ తరలింపులో చంద్రబాబు సన్నిహితులు, బినామీల బాగోతం.. ఇలా ఈ కుంభకోణాల్లో కీలకంగా వ్యవహరించిన వారిని సీఐడీ అధికారులు గతంలోనే గుర్తించారు. నిందితులు విదేశాలకు పరారు కాకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ కేసులను నీరుగార్చేందుకు ముందుగా లుక్ అవుట్ నోటీసులను లక్ష్యంగా చేసుకున్నారు. చంద్రబాబుపై నమోదైన కేసులను విచారిస్తున్న దర్యాప్తు అధికారులను డీజీపీ, సీఐడీ అదనపు డీజీ తమ కార్యాలయానికి పిలిపించారు. ఆ కేసుల్లో జారీ చేసిన లుక్ అవుట్ నోటీసులను ఉపసంహరించాలని దర్యాప్తు అధికారులను ఆదేశించారు. అంటే ఆ కేసుల దర్యాప్తును ఇక పట్టించుకోవద్దని స్పష్టం చేశారు. అందులో మొదటి అడుగుగా ఆ కేసుల్లో కొందరు నిందితులపై జారీ చేసిన లుక్ అవుట్ నోటీసులను ఉపసంహరింపజేశారు.

నీరుగార్చుదాం... ఉపసంహరిద్దాం
ఇదీ చంద్రబాబు పన్నాగం

చంద్రబాబుపై అవినీతి కేసుల్లో విచారణ ప్రక్రియను పూర్తిగా ఉపసంహరించే దిశగా కూటమి ప్రభుత్వం పథకం ప్రకారం వ్యవహరిస్తోంది. ఆ కేసుల్లో సిట్ అధికారులు ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోపాటు న్యాయస్థానాల్లో చార్జిషీట్లను కూడా దాఖలు చేశారు. దీంతో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా చంద్రబాబు పూర్తిస్థాయిలో కుతంత్రానికి తెరతీశారు. ముందుగా ఆ కేసుల్లో సీఐడీ వాదన వీగిపోవాలి..! విచారణ ప్రక్రియ సందర్భంగా సీఐడీ న్యాయవాదులు చేతులెత్తేయాలి...! న్యాయస్థానం లేవనెత్తే ప్రశ్నలకు దర్యాప్తు అధికారులు ఉద్దేశపూర్వకంగా సమాధానం చెప్పకుండా ఉండిపోవాలి...! అవసరమైతే న్యాయస్థానం ఆగ్రహానికి కూడా గురి కావాలి...! కేసుల విచారణలో డిఫెన్స్ న్యాయవాదుల వాదనకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఏమాత్రం ఎదురు చెప్పకూడదు...! కేసుల విచారణ ప్రక్రియ సందర్భంగా అన్ని పరిణామాలు సీఐడీకి వ్యతిరేకంగా సాగాలనే లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. ఇది మొదటి వ్యూహం కాగా అదే అదనుగా చంద్రబాబుపై నమోదైన కేసులను ఉపసంహరిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నది చంద్రబాబు రెండో వ్యూహం. సీఐడీ అభియోగాలకు తగిన ఆధారాలు లేవని, ఆ కేసులను ఉపసంహరించుకోవడమే సరైన చర్యని న్యాయ శాఖ అభిప్రాయపడినట్టుగా ఓ నోట్ తయారు చేయించి అనంతరం ఈమేరకు రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర వేయించుకోవాలన్నది చంద్రబాబు అంతిమ లక్ష్యం. ఆ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసి కేసులను పూర్తిగా మూసివేయడం ద్వారా తన అవినీతి దందాకు ప్రభుత్వ పరంగా రక్షణ కల్పించాలని చంద్రబాబు పకడ్బందీగా కుట్రను వేగంగా అమలు చేస్తున్నారు.

కేసులు వీగిపోవాలి.. డిఫెన్స్ న్యాయవాదులకు సహకరించండి
దర్యాప్తు అధికారులకు నిర్దేశం

లుక్ అవుట్ నోటీసుల ఉపసంహరణ తరువాత చంద్రబాబు తనపై ఉన్న సీఐడీ కేసులను పూర్తిగా నీరుగార్చే పనిలో నిమగ్నమయ్యారు. ఆయన ఆదేశాలతో డీజీపీ, సీఐడీ చీఫ్ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగారు. చంద్రబాబుపై కేసుల్లో దర్యాప్తు అధికారులను రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి దాదాపు రోజూ పిలిపిస్తున్నారు. 'ఆ కేసులను నమోదు చేసింది మీరే.. పూర్తి సాక్ష్యాలు, ఆధారాలు సేకరించి పకడ్బందీగా కేసు నమోదు చేశారు. ఆ కేసుల గురించి పూర్తి అవగాహన ఉంది కాబట్టి మీరే ఆ కేసులను నీరుగార్చాలి. మీరు సేకరించిన సాక్ష్యాలు, ఆధారాలను మీరే నీరుగార్చాలి. ఆ సాక్ష్యాలు, ఆధారాలు సరైనవి కావని నిరూపించే బాధ్యత మీరే తీసుకోవాలి. నిబంధనలను పట్టించుకోవద్దు. ఏమైనా చేయండి. కానీ కేసు నిలవకూడదు. రెండు నెలల్లోగా పని పూర్తి కావాలి' అని విస్పష్టంగా ఆదేశించారు. దర్యాప్తు అధికారులు తాము చేపట్టిన కేసులు గెలిచేలా, నిందితులకు శిక్ష పడేలా వ్యవహరించాలి. ఈమేరకు సీఐడీ కేసులను వాదించే పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ప్రభుత్వ న్యాయవాది)కు సహకరించాలి. అయితే చంద్రబాబుపై కేసుల దర్యాప్తు అధికారులు ఆ విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించేందుకు వీల్లేదని పోలీస్ బాస్‌లు ఆదేశించారు. పైగా ఆ కేసుల్లో డిఫెన్స్ న్యాయవాదులకు (చంద్రబాబు వ్యక్తిగత న్యాయవాదులు) సహకరించాలని హుకుం జారీ చేయడం విభ్రాంతి కలిగిస్తోంది. దర్యాప్తు అధికారులు ఆ కేసులను నీరుగార్చేందుకు ఏమేం చేస్తున్నారో ప్రతి రోజూ తమకు నివేదించాలని డీజీపీ, సీఐడీ చీఫ్ విస్పష్టంగా ఆదేశించినట్లు సమాచారం. అంటే ఆ కేసులు వీగిపోయేలా చేసేందుకు నిత్యం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

సిట్ కేసులు క్లోజ్ చేయాలనే షరతులతో...
డీజీపీ, సీఐడీ చీఫ్‌లకు పోస్టింగ్‌లు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తనపై సిట్ కేసులను పక్కదారి పట్టించడమే లక్ష్యంగా పావులు కదిపారు. అందుకోసం పోలీసు వ్యవస్థను పూర్తి స్థాయిలో దుర్వినియోగం చేసేందుకు తెగించారు. ప్రధానంగా డీజీపీ, సీఐడీ చీఫ్‌ల నియామకాన్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారు. తనపై 'సిట్' గతంలో నమోదు చేసిన స్కిల్ స్కామ్, అసైన్డ్ భూముల కుంభకోణం, ఇన్నర్‌రింగ్ రోడ్ కుంభకోణం, ఫైబర్ నెట్ కేసులను నీరు గార్చేసి అనంతరం విచారణను పూర్తిగా నిలిపివేయాలని షరతు విధించారు. దీనికి లోబడే డీజీపీ, సీఐడీ అదనపు డీజీలకు పోస్టింగ్‌లు ఇచ్చినట్లు పోలీసువర్గాలు అప్పట్లోనే వ్యాఖ్యానించాయి. తదనంతర పరిణామాలు అదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.

వినకుంటే మీ సంగతి తేలుస్తాం
దర్యాప్తు అధికారులకు హెచ్చరిక

చంద్రబాబుపై నమోదైన అవినీతి కేసులను దర్యాప్తు చేస్తున్న అధికారులను ప్రభుత్వ పెద్దలు, పోలీస్ బాస్‌లు తీవ్రంగా బెదిరిస్తున్నారు. తాము చెప్పినట్లు ఆ కేసులను నీరుగార్చకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పలువురు ఐపీఎస్‌లు, ఇతర పోలీసు అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా వేధిస్తున్న వైనాన్ని గుర్తు చేస్తూ మీకూ అదే గతి పడుతుందని బెదిరింపులకు గురి చేస్తున్నారు. తేడా వస్తే దర్యాప్తు అధికారులపైనే వివిధ అక్రమ కేసులు నమోదు చేసి సస్పెండ్ చేస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరిస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

అందుకే సీబీఐకి అప్పగించాలి

చంద్రబాబు అవినీతి కేసుల విచారణ ప్రక్రియను కూటమి ప్రభుత్వం అడ్డుకుంటుందని పలువురు రాజకీయ పరిశీలకులు, న్యాయ నిపుణులు ఇప్పటికే గుర్తించారు. అందుకే చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అప్పగించాలని ఓ సామాజిక కార్యకర్త హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

సామాన్యుడు కోర్టుకు రాకూడదా?

సీబీఐ దర్యాప్తు కోరకూడదా?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు.. సీఎం చంద్రబాబు తదితరులపై కేసులు సీబీఐకి బదలాయింపుపై కౌంటర్‌కు ఆదేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, పొంగూరు నారాయణ, కింజారపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, వ్యాపారవేత్తలు లింగమనేని రమేష్, వేమూరు హరికృష్ణ ప్రసాద్ తదితరులతో పాటు పలు కంపెనీలపై గతంలో నమోదైన కేసులన్నింటినీ సీబీఐ, ఈడీలకు అప్పగించేలా ఆదేశించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను సెప్టెంబర్ 11కి వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నిష్పాక్షిక దర్యాప్తునకు ఆస్కారం లేదు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, మద్యం కుంభకోణం, ఏపీ ఫైబర్ నెట్ కుంభకోణం, అసైన్డ్ భూముల కుంభకోణం, ఇసుక కుంభకోణం, ఇన్నర్ రింగ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు తదితరాలకు సంబంధించి చంద్రబాబు, ఇతరులపై నమోదైన కేసుల్లో పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు చేసే పరిస్థితులు ప్రస్తుతం లేనందున ఈ బాధ్యతను సీబీఐ, ఈడీలకు అప్పగించాలంటూ సీనియర్ పాత్రికేయుడు, స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కొట్టి బాలగంగాధర తిలక్ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా విచారణ సందర్భంగా పిటిషనర్ సీనియర్ న్యాయవాది శ్రీపాద ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ పరిస్థితుల్లో ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు తెలిపారు. చంద్రబాబు తదితరులపై నమోదైన 7 కేసుల్లో దర్యాప్తును సీబీఐకి బదలాయించాలని కోరుతున్నామన్నారు. ఈ కేసుల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిందితుడిగా ఉన్నందున రాష్ట్ర దర్యాప్తు సంస్థలు, పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు పరిస్థితి లేదన్నారు. ఈ కేసుల్లో ఐపీఎస్ అధికారులు సంజయ్, కొల్లి రఘురామిరెడ్డి దర్యాప్తు చేసి ఇప్పటికే కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం మారగానే ఈ ఇద్దరు అధికారులను దర్యాప్తు బాధ్యతల నుంచి తప్పించారని నివేదించారు.

కేసులపై నిందితుడి స్వీయ సమీక్ష

గత ప్రభుత్వ హయాంలో సీఐడీ నమోదు చేసిన కేసులన్నింటినీ సమీక్షిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత మీడియాతో పేర్కొన్నారని శ్రీపాద కోర్టు దృష్టికి తెచ్చారు. ఆ క్లిప్పింగ్‌లను ఆయన ధర్మాసనం ముందుంచారు. హోంమంత్రిని పక్కన పెడితే ముఖ్యమంత్రి స్వయంగా సీఐడీ కేసులను సమీక్షిస్తామని చెప్పడం ఆందోళన కలిగించే అంశమన్నారు. తను నిందితుడిగా ఉన్న కేసులను తానే సమీక్షిస్తానని ముఖ్యమంత్రి చెప్పడం తదుపరి పరిణామాలను తెలియచేస్తోందన్నారు. ఓ నిందితుడు తన కేసులను తానే సమీక్షిస్తాననడం ఇంతవరకు ఎక్కడా లేదన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ కేసుల ఉపసంహరణ విషయంలో అంతిమంగా సంబంధిత పబ్లిక్ ప్రాసిక్యూటరే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందిగా? అని వ్యాఖ్యానించింది. ఆ పరిస్థితి ఇంకా రాలేదుగా? అని ప్రశ్నించింది. నిందితుడిగా ఉన్న వ్యక్తి తన కేసులను తానే సమీక్షిస్తానని చెప్పడాన్ని కోర్టు పరిగణలోకి తీసుకోవాలని శ్రీపాద కోరారు. స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఐదుగురు ముఖ్యమంత్రులు ప్రాసిక్యూషన్ ఎదుర్కొన్నారని, అందులో పలువురిని సీబీఐ ప్రాసిక్యూట్ చేసిందన్నారు. ఆ కేసుల్లో స్థానిక పోలీసుల దర్యాప్తు చేయలేదన్నారు. ఇప్పుడు నిందితుడిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమోదైన కేసుల తాలుకూ కీలక దాక్యుమెంట్లను పరిశీలించి వాటిని తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉందన్నారు. రహస్య, అంతర్గత దాక్యుమెంట్లను సైతం చంద్రబాబు పరిశీలించే ఆస్కారం ఉందన్నారు. తద్వారా ఆయా కేసుల్లో తనకు ప్రయోజనం చేకూరేలా డిఫెన్స్‌ను సిద్ధం చేసుకుంటారని శ్రీపాద నివేదించారు.

రాజకీయ కేసులు కాదు.. అవినీతి కేసులు

ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. అలా చేయకుండా ప్రభుత్వాన్ని తాము నియంత్రించగలమా? అని ప్రశ్నించింది. కీలక, రహస్య డాక్యుమెంట్లను చంద్రబాబుకు అందుబాటులో ఉంచకూడదనే తాము కోరుతున్నామని శ్రీపాద చెప్పారు. దానివల్ల కేసులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. చంద్రబాబు తదితరులపై నమోదైనవి రాజకీయ కేసులు కాదని, రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే కేసులు నమోదయ్యాయని నివేదించారు. ఈ కేసులన్నీ పూర్తిగా అవినీతికి సంబంధించినవన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ అసలు ఇది ప్రజా ప్రయోజన వ్యాజ్యం నిర్వచన పరిధిలోకి రాదన్నారు. పిటిషనర్ విశ్వసనీయతపై సందేహాలున్నాయన్నారు. పత్రిక నడుపుతున్నట్లు చెబుతున్న పిటిషనర్ తన వ్యాజ్యంలో పత్రిక సర్క్యులేషన్ వివరాలను పొందుపరచలేదన్నారు. ఈ వ్యాజ్యంలో మొత్తం 114 మందిని ప్రతివాదులుగా చేర్చారన్నారు.

గొప్పగా దర్యాప్తు చేశారు.. అందుకే బదిలీ

ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ఆ 7 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు ఎప్పుడు నమోదయ్యాయి? చార్జిషీట్లు ఎప్పుడు దాఖలు చేశారు? అనే వివరాలను ఆరా తీసి నమోదు చేసుకుంది. కేసుల విషయంలో సంజయ్, రఘురామిరెడ్డి ఎంతో గొప్పగా తమ బాధ్యతలను నిర్వర్తించారని శ్రీపాద తెలిపారు. ప్రభుత్వం మారగానే కక్ష సాధింపులు మొదలయ్యాయని, అందుకు వీరిద్దరూ బలైపోయారన్నారు. మద్యం కుంభకోణానికి సంబంధించి చంద్రబాబుపై ఫిర్యాదు చేసిన అప్పటి బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ వాసుదేవరెడ్డిపై కూడా కక్ష సాధింపులు మొదలయ్యాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

సీబీఐకి బదలాయించాలని కోరకూడదా..?

ఈ సమయంలో ధర్మాసనం మరోసారి జోక్యం చేసుకుంటూ.. పత్రిక నడుపుతున్న విషయాన్ని పక్కన పెట్టండి. సామాన్యుడు కోర్టును ఆశ్రయించకూడదా? కేసులను సీబీఐకి బదలాయించాలని కోరకూడదా? అని ప్రశ్నించింది. ఈ కేసులో పిటిషనర్ పూర్వాపరాలు ముఖ్యం కాదని వ్యాఖ్యానించింది. దీంతో ఈ వ్యాజ్యాన్ని మొత్తం పత్రికా కథనాల ఆధారంగా దాఖలు చేశారని రోహత్గీ పేర్కొన్నారు. ఇద్దరు అధికారులను బదిలీ చేశారని చెబుతున్నారని, వాస్తవానికి బదిలీపై వారికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు కాబట్టి సీబీఐతో దర్యాప్తు నిర్వహించాలనడం సరికాదన్నారు. ఇప్పటికే ఐదు కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారని, రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అనంతరం ధర్మాసనం జోక్యం చేసుకుంటూ విచారణార్హతపై అభ్యంతరాలుంటే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందుకు మూడు వారాల సమయం ఇస్తామని పేర్కొంది. ముందు విచారణార్హతపై కౌంటర్ దాఖలు చేస్తామని, దానిని తేల్చిన తరువాత మిగిలిన విషయాల్లోకి వెళ్లవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తరఫునే హాజరవుతున్న అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతిపాదించగా ధర్మాసనం తోసిపుచ్చింది. ముక్కలు ముక్కలుగా విచారణ చేయబోమన్న ధర్మాసనం.. విచారణార్హతతో పాటు పిటిషనర్ లేవనెత్తిన అన్ని అంశాలతో కౌంటర్ దాఖలు చేయాల్సిందేనని తేల్చి చెబుతూ విచారణను వాయిదా వేసింది.

క్లుప్తంగా...

కమిటీ చైర్మన్లతోనే జెండా వందనం

సాక్షి, అమరావతి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం అన్ని పాఠశాలల్లోను జెండా వందన కార్యక్రమం నిర్వహించాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయ రామరాజు ఆర్జేడీలు, డీఈవోలకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. స్కూళ్లలో ఇటీవల ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల (ఎస్ఎంసీ) చైర్మన్లతోనే జెండా ఆవిష్కరించాలని పేర్కొన్నారు. కమిటీ చైర్మన్ లేని పక్షంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెండా ఎగురవేయాలని సూచించారు.

నేడు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవం

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న వైఎస్ జగన్



ముస్తాబైన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం

సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొంటారు.

'ఏయూ డిస్టెన్స్ పరీక్షలు నిర్వహించాలి'

సాక్షి, అమరావతి: ఆంధ్ర వర్సిటీ డిస్టెన్స్, ఆన్‌లైన్ విద్య అకడమిక్ క్యాలెండర్ పరీక్షలను సెలవుల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. యూజీసీ ఒకేసారి రెండు డిగ్రీలు చేసుకునే వెసులు బాటు (డిస్టెన్స్, రెగ్యులర్‌లో)ఇవ్వడంతో ఎందరో విద్యార్థులు డిస్టెన్స్, ఆన్‌లైన్‌లో చదువుకుంటున్నారన్నారు. అయితే ఇతర కళాశాలల్లో జరిగే రెగ్యులర్ పరీక్షల సమయంలోనే ఆంధ్ర వర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షలు నిర్వహించడంతో పరీక్షలకు గైర్హాజర వ్వాల్సిన పరిస్థితి వస్తోందని వివరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మార్చి– ఏప్రిల్‌లోనే డిస్టెన్స్ పరీక్షలు చేపట్టి విద్యార్థులు, ఉద్యోగార్థులకు న్యాయం చేయాలన్నారు.

ఏపీ నిట్‌లో 453 మందికి ప్రవేశాలు



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లో ఇప్పటివరకు 453 మంది విద్యార్థులు బీటెక్ ప్రథమ సంవత్సరంలో చేరినట్టు రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి బుధవారం తెలిపారు. నిట్‌లోని బీటెక్‌లో ఉన్న ఎనిమిది కోర్సుల్లో 480 సీట్లకుగాను ఇటీవల జోసా నిర్వహించిన మొదటి రౌండ్‌లోనే అన్ని సీట్లకు అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లను నిట్‌కు వచ్చి పరిశీలన చేయించుకున్న అనంతరం చేరారు. సీటు నిర్ధారించుకుని ఫీజులు చెల్లిస్తున్నారు. ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని జోసా, సి శాబ్ మరో రెండు రోజులు పొడిగించడంతో మిగిలిన విద్యార్థులు వచ్చి చేరనున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నిట్‌లో ఏర్పాట్లు చేశారు. రిజిస్ట్రార్ పి.దినేష్ శంకరరెడ్డి, సెంటర్ ఇన్‌చార్జి టి.కురుమయ్య, అధికారులు తపస్ పరమానిక్, రాముడు మాచవరపు, కిరణ్ తీపర్తి, వి.సందీప్, సుదర్శన్ ధ్రువ, సురేంద్ర, అమరేంద్రరెడ్డి, శరద్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలతో ఎలా గెలిచారో అందరికీ తెలుసు

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలు పూర్తిగా ఈవీఎం ఎన్నికలని, అవి ఎలా జరిగాయో.. ఈవీఎంల ద్వారా ఎలా గెలిచారో దేశ ప్రజలందరికీ తెలుసునని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని చెబుతున్నారని, ఎన్నికల ముందు హామీలిచ్చిన ఆయనకు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఎలాంటి షరతులు పెట్టకుండా చంద్రబాబు ఎన్డీఏకు మద్దతిచ్చారని, అందుకే ఈ రోజు అడుక్కోవాల్సిన దుస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించలేదని, కేవలం రూ.15 వేల కోట్లు అప్పుగా మాత్రమే ఇచ్చారని దుయ్యబట్టారు. అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ జరుగుతోందని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమ్మిట్‌కు హాజరుకావాలని కోరారు. రాజకీయాలు పక్కన పెట్టి సమ్మిట్‌లో పాల్గొంటే రాష్ట్రానికి పెట్టుబడులొస్తాయన్నారు.



ఎంత ధర కలిగినదైనప్పటికీ స్వాతంత్ర్యం అనేది ఎప్పటికీ ఖరీదైనది కాదు. అది మనిషి బతకడానికి అవసరమైన శ్వాస. దానికోసం ఎవరైనా సరే ఎంత మూల్యమైనా చెల్లిస్తారు.

– మహాత్మా గాంధీ

సాక్షి

గురువారం, 15 ఆగస్టు 2024

మీడియా స్వేచ్ఛకు కళ్లెమా!

వక్ఫ్ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేయకతప్పని పక్షం రోజుల్లోనే ప్రస్తుతం భిన్నవర్గాల పరిశీలనలో ఉన్నదని చెబుతున్న బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ రెగ్యులేషన్ బిల్లు ముసాయిదాను కేంద్రంలోని ఎన్డీయే సర్కారు వెనక్కి తీసుకుంది. కారణమేదైనా ఇది ఆహ్వానించ దగ్గ పరిణామం. ఈ బిల్లు తొలి ముసాయిదా నిరుడు నవంబర్‌లో విడుదల చేయగా దానిపై వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామని చెబుతూ గత నెల రెండో ముసాయిదా తీసుకొచ్చారు. తాజాగా దాన్ని కూడా వెనక్కి తీసుకున్నారు. వచ్చే అక్టోబర్ 15 వరకూ ముసాయిదా బిల్లుపై సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతుందని ప్రభుత్వం చెబుతోంది. బహుశా శీతాకాల సమావేశాలనాటికి దీనికి తుదిరూపం ఇవ్వాలన్నది పాలకుల ఉద్దేశం కావొచ్చు. డిజిటల్ మీడియా ప్రస్తుతం ఊహకందని రీతిలో విస్తరించింది. 1959లో ప్రయోగాత్మకంగా ఢిల్లీలో ప్రారంభించిన టెలివిజన్ ప్రసారసేవలు 80వ దశకం చివరినాటికి కొత్త పుంతలు తొక్కాయి. స్టార్ టీవీ, ఎంటీవీ, బీబీసీ, సీఎన్ఎన్ వగైరాలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ప్రస్తుతం యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విటర్‌వంటి సామాజిక మాధ్యమాలతోపాటు ఓటీటీలు వచ్చాయి. వాట్సాప్, టెలిగ్రామ్ వంటివి సరేసరి. అన్నింటా మంచీ చెడూ ఉన్నట్టే వీటివల్ల కూడా సమస్యలు ఎదురవుతూ ఉండొచ్చు. అవి దుష్పరిణామాలకు దారితీయటం నిజమే కావొచ్చు. అందుకు తగిన చట్టాలు తీసుకురావటం కూడా తప్పేమీ కాదు. కానీ ఈ మాధ్యమాలను నియంత్రించే పేరిట భావప్రకటనా స్వేచ్ఛకు కళ్లెం వేయాలనుకోవటం, అసమ్మతిని అణిచేయాలనుకోవటం ప్రజాస్వామ్యంలో మంచిది కాదు. బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ రెగ్యులేషన్ ముసాయిదా బిల్లు చేస్తున్నది అదే.

గతంలో కేబుల్ రంగం హవా నడిచినప్పుడు వీక్షకులకు ఇష్టం ఉన్నా లేకున్నా అనేక చానెళ్లు వచ్చిపడేవి. వర్తమానంలో అలా కాదు. ఏం చూడాలో, వద్దో నిర్ణయించుకునే స్వేచ్ఛ వీక్షకులకు ఉంటుంది. పార్టీలకు అమ్ముడుపోయిన చానెళ్లు వాస్తవాలను వక్రీకరిస్తున్నారని అర్థమయ్యాక జనం వాటిని చూడటం మానుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ప్రత్యామ్నాయాలను వెదుక్కుంటున్నారు. తమకు నచ్చిన, తాము తెలుసుకోవాలనుకుంటున్న విషయం ఉన్నదనుకుంటేనే ఆన్‌లైన్‌లో లభ్యమయ్యే వీడియోలను వీక్షిస్తారు. వార్తా విశ్లేషణలను చదువుతారు. ఒక అంశంపై ఎవరెవరి అభిప్రాయాలు ఎలావున్నాయో తెలుసుకుంటారు. ఈ క్రమంలో సహజంగానే ప్రజలను పక్కదోవపట్టించేవాళ్లు ఉంటారు. అశ్లీలతనూ, దుర్భాషలనూ గుప్పించేవారుంటారు. తప్పుడు కథనాలను ప్రసారం చేసేవారూ ఉంటారు. అలాంటివారిపై తగిన చర్యలు తీసుకోవటాన్ని ఎవరూ కాదనరు. కానీ నిజాయితీగా అభిప్రాయాలు వ్యక్తీకరించేవారిని కూడా వారితో సమంచేసి శిక్షించే ధోరణి ఎంతవరకూ సబబు? అత్యధిక వీక్షకుల్ని రాబట్టుకుంటున్న ఆన్‌లైన్ మాధ్యమాలకు సైతం ముసాయిదాలో ఏముందో అధికారికంగా తెలియదు. అనేకానేక ఆన్‌లైన్ చానెళ్లు, ఇతర ప్రచురణ మాధ్యమాలూ సభ్యులుగా ఉన్న డిజిపబ్ వంటి స్వయంనియంత్రణ సంస్థలకే ఈ ముసాయిదాపై ప్రభుత్వం నుంచి ఎలాంటి వర్తమానమూ లేదు. మరి కేంద్రం ఇంతవరకూ సాగించామంటున్న సంప్రదింపులు ఎవరితో జరిగినట్టు? రెండు మూడు ఓటీటీ యాజమాన్యాలనో, కార్పొరేట్ రంగ ఆధిపత్యంలో సాగుతున్న ఇతర మాధ్యమాలనో, తాము నిపుణులుగా భావించేవారినో సంప్రదిస్తే సరిపోతుందా? సాగు చట్టాల విషయంలోనూ లక్షలాదిమంది రైతులతో, వేలాది సంఘాలతో చర్చించామని అప్పట్లో ప్రభుత్వం చెప్పింది. చివరకు ఏమైంది? రైతులు పట్టుదలగా పోరాడాక వెనక్కు తీసుకోకతప్పలేదు. సమస్యేమంటే...ట్విటర్‌లో లక్షల్లో అనుయాయులున్న రాజకీయ నాయకులు మొదలుకొని ధ్రువ్‌రాఠీవంటి పాపులర్ యూట్యూబర్‌ల వరకూ... ఎంతో నిబద్ధతతో సీనియర్ జర్నలిస్టులు నడిపే మాధ్యమాలవరకూ అందరినీ ముసాయిదా బిల్లు ఒకే గాటన కడుతోంది. ఆఖరికి పత్రికలూ, చానెళ్లూ అనుబంధంగా నడుపుతున్న డిజిటల్ మాధ్యమాలు సైతం ఈ పరిధిలోకొస్తాయి. పైగా ఈ కార్యకలాపాలు క్రిమినల్ చట్టాల పరిధిలోకి కూడా వెళ్లి అనేక కేసులు దాఖలవుతాయి. అరెస్టయితే బెయిల్ దుర్లభమవుతుంది. తటస్థంగా విశ్లేషణలందిస్తూ వేలల్లోనో, లక్షల్లోనో వీక్షకుల్ని సంపాదించుకుంటున్న వ్యక్తులు కూడా ఈ బిల్లు చట్టమైతే అనేకానేక పత్రాలు దాఖలుచేయాల్సివస్తుంది. అంతేకాదు...ఒక గ్రీవెన్స్ అధికారిని నియమించుకోవటం, స్వీయ మదింపు కమిటీని ఏర్పాటుచేసుకోవటం తప్పనిసరవుతుంది. ఈ వ్యయాన్నంతా వీక్షకులనుంచి వసూలు చేయటం సాధ్యమేనా? అసలు వచ్చే ఆదాయం ఎంత? పైగా తప్పుడు కథనాలు ప్రసారం చేశారనుకుంటే వారెంట్ లేకుండా దాడులు చేసి పరికరాలను స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వాలకు వస్తుందంటున్నారు.

ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించి విపక్షాలను జైళ్లలో కుక్కి అసమ్మతిని అణిచేశారని బీజేపీ తరచు చెబుతుంటుంది. రాజ్యాంగాన్ని హత్య చేసిన రోజుగా ప్రతియేటా జూన్ 25ను పాటించాలని కూడా పిలుపునిచ్చింది. అలాంటి పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ముసాయిదాను తీసుకురావటం, దాన్ని బహిరంగపరచకపోవటం వింత కాదా? మన పొరుగునున్న బంగ్లాదేశ్‌లో హసీనా హయాంలో ఇలాంటి చట్టాన్నే తీసుకొచ్చారు. కానీ అక్కడ నిరసన వెల్లువ ఆగిందా? తమ నిర్ణయాలపై సామాన్యులు ఏమనుకుంటున్నారో, వారిలోవున్న అసంతృప్తి ఏమిటో తెలుసుకోవటానికి డిజిటల్ మీడియా తోడ్పడుతుంది. అది పాలకులకే మంచిది. మీడియా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టయిన ఇలాంటి ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవటం ఉత్తమం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.దశమి ఉ.6.01 వరకు, తదుపరి ఏకాదశి తె.5.50 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** జ్యేష్ఠ ఉ.9.54 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** సా.6.04 నుండి 7.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.59 నుండి 10.47 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.52 వరకు, **అమృతఘడియలు:** రా.3.50 నుండి 5.27 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

మూలవాసుల అభివృద్ధా? మూలాల విధ్వంసమా?

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా దేశ అభివృద్ధి నమూనా మారడం లేదు. అభివృద్ధి ఫలాలు కొందరి దగ్గరే పోగుబడడం అంతకంతకూ పెరిగిపోతోంది. సాంస్కృతిక హననంతోపాటు మూలవాసుల పేదరికమూ హెచ్చవుతోంది.

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

భారతదేశం ప్రపంచ దేశాల ముందు తలయెత్తుకొని నిలబడగలిగిన ప్రాకృతిక సంపదను కలిగి ఉంది. దాన్ని పరిరక్షించుకుంటూ, దేశ అభివృద్ధిని నిరంతరం పెంచి పోషించుకునే సూత్రాలు, అధికరణాలు రాజ్యాంగంలో ఎల్లెడలా పరచుకొని ఉన్నాయి. ముఖ్యంగా భారత రాజ్యాంగం మానవ హక్కుల పరిరక్షణలో బలమైన సూత్రాలను మనకు అందించింది. అధికరణం 46లో 'బలహీన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. బలహీన వర్గాలకు చెందిన ప్రజల (ప్రత్యేకించి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన ప్రజలు) ఆర్థికాభివృద్ధికి, వారిలో విద్యావకాశాల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలి. ఏ విధంగానూ దోపిడీకి గురి కాకుండా వారిని కాపాడాలి. వారికి సామాజికంగా అన్యాయం జరగకుండా చూడాల'ని ఉంది.

కానీ, ఇవాళ ఆర్థికాభివృద్ధి పేరుతో సహజవనరులు, సాంస్కృతిక సంపద హననానికి గురవుతోందనేది వాస్తవం. దక్షిణ భారత దేశం పారిశ్రామికంగా మిగతా ప్రాంతాల కన్నా వేగంగా అభివృద్ధి చెందుతోంది. అయితే ఈ అభివృద్ధి క్రమంలో... వేల ఏళ్ల పాటు తరతరాలు వారసత్వంగా మనకు అందించిన సాంస్కృతిక సంపద ధ్వంసమవుతోంది. దక్షిణ భారతదేశ నవీన రాతియుగ సంస్కృతి మూలాలు అంతరించే పరిస్థితులు వచ్చాయని చరిత్రకారులు, పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

సమాజ పరిణామక్రమంలో కొంత కాలానికి ప్రభుత్వాలేర్పడ్డాయి. చాలాకాలం వరకు అప్పటి ప్రభుత్వాలు భూమి పైన శిస్తు వసూలుకే పరిమితమయ్యాయి. కాని, భూమిపై హక్కును ఏర్పరచుకొనలేదు. కాలక్రమంలో భారతదేశాన్ని అనేక స్వదేశీ, విదేశీ తెగలు పరిపాలించాయి. మొగలాయీ చక్రవర్తుల కాలంలో భూమిశిస్తు వసూలు బాధ్యత ప్రభుత్వ అధికారుల నుండి ప్రైవేటు వ్యక్తులకు బదిలీ అయింది. వారే జమీందారులయ్యారు. బ్రిటీష్ వారి పాలనలో జమీందారులకు వారి అజమాయిషీలోని ఎస్టేటులపై 1793లో లార్డ్ కారన్‌వాలిస్ ఆస్తి హక్కునిచ్చారు. భూమి కాస్తా అమ్మకపు సరుకైంది. కరవు కాటకాల సమయాల్లో నిర్బంధపు శిస్తులు కట్టలేక భూమిని అమ్ముకున్న రైతులు భూమిలేని పేదలయ్యారు. హెచ్చుగా భూములను కొన్నవారేమో... వడ్డీ వ్యాపారులు, భూస్వాములయ్యారు. భూమిని పోగొట్టుకున్న వారిలో చాలామంది కౌలుదారులయ్యారు. క్రమంగా భూస్వాముల నిర్బంధపు కౌలు వసూలును కౌలుదార్లు భరించలేని స్థితికి చేరారు. ఆ క్రమంలో వారు భూమిలేని గ్రామీణ పేదలయ్యారు. తిరిగి భూమిని పేదలకు పంచాలనే ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. 1947 తర్వాత స్వతంత్ర భారతంలో ఈ ఉద్యమాలు ఊపందుకున్నాయి.



1948లో జమీందారీ వ్యవస్థ రద్దు కాక పూర్వం మామూలు భూస్వాములకు సగటున 100 ఎకరాలుండేది. 1938లో వచ్చిన ప్రకాశం కమిటీ రిపోర్టు ఆధారంగా తయారుచేసిన 'మద్రాసు ఎస్టేట్ రద్దు – రైత్వారీకి మార్పు బిల్లు' 1949 ఏప్రిల్ 19న శాసనసభ ఆమోదం పొంది, 1950లో రాష్ట్రపతి ఆమోదముద్ర పడి చట్టమైంది. ఈ చట్టం ప్రకారం పర్మనెంట్ సెటిల్మెంట్ ఎస్టేటు భూములు, అడవులు, గనులు, ఖనిజాలు గల భూములన్నీ రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోకి వచ్చాయి. జమీందారులకు పెద్ద ఎత్తున నష్టపరిహారం చెల్లిస్తూ, వారి సొంత సేద్యానికి సారవంతమైన వేలాది ఎకరాలు వదిలి వేయబడ్డాయి. దీనితో జమీందారులు బడా భూస్వాములయ్యారు.

ప్రధానమైన వనరులన్నీ కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్ళాక... దేశంలో కరవు, అవిద్య, అనారోగ్యం, దురాక్రమణలతో కూడిన పాలనా విధానాలు పెరుగుతున్నాయి. డా॥ బీఆర్ అంబేడ్కర్ ఆనాడే దక్షిణ భారత అస్తిత్వాన్ని గురించీ, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల అస్తిత్వాల గురించి అనేక సూత్రాలు మనకు అందించారు. ముఖ్యంగా దక్షిణ భారత భూభాగంలో... స్థానిక భాషలు, సంస్కృతి, చరిత్ర, పురాతత్వ భావనలను పెంపొందించాలన్నారు. అంతేకాని వాటిని ఇతరులకు తాకట్టు పెట్టే విధానాలను అవలంబించరాదనీ, అందువల్ల భారతదేశం అంతర్గతంగా తాకట్టులోకి వెళ్ళే ప్రమాదం ఉందనీ చెప్పారు. నిజానికి ప్రస్తుత పాలకవర్గ నిష్క్రియాపర్వాన్ని అలా ఉంచితే... కాంగ్రెస్ నాయకత్వంలో ఉన్న 'ఇండియా' కూటమి కూడా దేశాన్ని తాకట్టు నుంచి విముక్తి చేసే విధంగా పార్లమెంటులో వాదించలేకపోతోంది. ఆ మాట ఒప్పుకోవాల్సిందే! కొన్ని కార్పొరేట్ శక్తులు వీరి వెనక కూడా ఉండడమే ఇందుకు ఒక కారణం కావచ్చు. ఇదే సమయంలో రాజ్యాంగ హక్కుల్ని కాపాడుకునే విషయంలో పార్లమెంటులోని దళిత బహుజన ఎం.పీలు నోరు మెదపకపోవడం వారి బానిసత్వాన్ని గుర్తు చేస్తోంది.

నిజానికి ఈ దేశం ఇలా కార్పొరేట్ శక్తుల, అగ్రవర్ణ భూస్వామ్య శక్తుల చేతుల్లోకి వెళ్ళడానికి ప్రధాన కారణం పూనా ప్యాక్ట్ ద్వారా ఉమ్మడి నియోజక వర్గాల్లో గెలిచిన దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలని చెప్పక తప్పదు. ఇప్పటికీ ఈ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు దళిత హక్కుల కోసం ఎలుగెత్తి మాట్లాడలేకపోతున్నారు అనేది స్పష్టమైన అంశం. అలాగే వామపక్షాలు కూడా అనేక సందర్భాల్లో దళిత బహుజనుల భూమి హక్కు మీద, కౌలుదార్ల హక్కుల మీద మాట్లాడటం తగ్గించారు.

మరోపక్క సెంటు భూమి కూడా లేని వారు భారతదేశంలో 80 కోట్ల మంది ఉన్నారు. బ్యాంకులలో అప్పుల్లో ఉన్నవారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. ప్రభుత్వాలు ప్రజలకు ఉత్పత్తి క్రమాన్ని నేర్పటం లేదు. ప్రజల్లో జీవశక్తినీ, ఆత్మ విశ్వాసాన్నీ, ఆత్మ గౌరవ స్ఫూర్తినీ, స్వీయ జీవన ప్రమాణాన్నీ పెంచినప్పుడే దేశం ఇతర దేశాలకు అప్పులు ఇవ్వగలిగిన స్థాయికి ఎదుగుతుంది. ఈనాడు దేశీయ భావన, జాతీయ భావన, రాజ్యాంగ స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో పెంచాల్సిన బాధ్యత లౌకికవాద ప్రజాస్వామ్య శక్తుల చేతుల్లో ఉంది. రాజకీయ పార్టీల కన్నా ... ఎప్పుడూ ప్రజా ఉద్యమాలే దేశాన్ని మేల్కొలుపుతాయి. నిద్రావస్థలో మునిగిన సమాజాన్ని చైతన్యవంతం చేసి, అంబేడ్కర్ మార్గంలో ఈ దేశ సాంస్కృతిక వికాసానికి అందరం పాటుపడుదాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

జాతీయవాదమా? జాతీయోన్మాదమా?

ఇవాళ వ్యక్తులుగా పౌరులూ, సమాఖ్యలో భాగంగా ఉన్న రాష్ట్రాలూ తమ హక్కులను కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. జాతీయవాదం పేరుతో జాతీయోన్మాదాన్ని పాలకులు ప్రేరేపిస్తున్నారు. భిన్నాభిప్రాయాలను దేశ వ్యతిరేకమైనవిగా ముద్ర వేస్తున్నారు.

అభిప్రాయం



ప్రొ॥ కె నాగేశ్వర్

రాజకీయ వ్యతిరేకతను, పౌర సమాజంలో భిన్నాభిప్రాయాలను కలిగివుండి, పాలనను విమర్శించే ప్రతి ఒక్కరినీ ప్రస్తుత భారత పాలక వ్యవస్థ తరచుగా దేశ వ్యతిరేకులుగా చిత్రీకరించింది. ఈ ద్వేషభావం... అసలు జాతీయవాదం అంటే ఏమిటి, నిజమైన జాతీయవాది ఎవరు అనే మౌలిక ప్రశ్నలను లేవనెత్తింది. జాతీయవాదం అనే పదం విభిన్న రాజకీయ తత్త్వశాస్త్రాల ద్వారా ప్రత్యేకంగా గుర్తించబడింది.

జాతీయవాదంపై వలసవాద వ్యతిరేక దృక్పథం... కుల, మత, వర్గ, ప్రాంతీయ అనుబంధాలతో సంబంధం లేకుండా నిర్దిష్ట రాజకీయ భౌగోళిక ప్రాంతంలో నివసించే ప్రజలందరినీ తప్పనిసరిగా కలుపుతుంది. శక్తిమంతమైన వలస పాలకుల నుండి భారతదేశం విముక్తి పొందేందుకు అటువంటి జాతీయవాద దృక్పథం చాలా అవసరం. ఆ విధంగా, స్వాతంత్ర్య పోరాటంలో అందరినీ కలుపుకొని పోవడం వల్ల జాతీయవాదపు రాజ్యాంగ దార్శనికత అభివృద్ధి చెందింది. ఇతర సంకుచిత గుర్తింపుల కన్నా మిన్నగా అది పౌరుల ప్రాధాన్యాన్ని గుర్తిస్తుంది.

మతం లేదా జాతి వంటి వివాదాస్పద పరిగణనలపై ఆధారపడిన జాతీయవాద విభజన దృక్పథం తన లోపలే ఒక శత్రువును కనుగొంటుంది. విభజించి పాలించే వలస రాజ్యాల ప్రాజెక్టును లక్ష్యంగా చేసుకున్న బ్రిటిష్ వలసవాద వారసత్వపు కమ్యూనల్ అవార్డు చరిత్ర దృష్ట్యా, భారతదేశంలోని మతపరమైన మెజారిటీ శక్తులు ఇప్పుడు ముస్లింలను లోపలి శత్రువుగా ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ముస్లిం, ముజ్రా, మంగళసూత్ర, మందిర్ వంటివి సార్వత్రిక ఎన్నికలలో అధికార పార్టీ విభజిత ఎన్నికల చర్చలో ఆధిపత్యం చలాయించాయి. కానీ, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఇతర జీవనోపాధి సమస్యలు దాని పాలనను సవాలు చేశాయి.

జాతీయవాదపు వలసవాద వ్యతిరేక దృక్పథంలోని మరొక కోణం ఏమిటంటే... వైవిధ్యాన్ని వేడుకగా జరుపుకోవడమే! నిజానికి, భారత రాజ్యాంగం, దానిలోని అనేక నిబంధనలు, దేశ న్యాయశాస్త్రం అనేవి భిన్నత్వంలో ఏకత్వాన్ని ఎల్లప్పుడూ ఆధునిక భారత జాతీయవాదపు కొనసాగుతున్న ఇతివృత్తంగా సమర్థించాయి. దేశం దైవపరిపాలనచే నడుస్తోందనే దృష్టి కోణం ఉద్దేశపూర్వకంగా దేశం, దాని ప్రజల సజాతీయ దృక్పథాన్ని ప్రోత్సహించడం ద్వారా వైవిధ్యాన్ని అణిచివేస్తుంది. జాతీయతలోని అనేక ఉపజాతి విధేయతలు తప్పనిసరిగా పరస్పర విరుద్ధమైనవి కానప్పటికీ, వాస్తవానికి అవి పరిపూర్ణమైనవి అనే వాస్తవాన్ని గుర్తించడానికి ఇది నిరాకరిస్తుంది. ఉదాహరణకు, భాషాపరమైన గుర్తింపులు జాతీయ గుర్తింపుతో విభేదించాల్సిన అవసరం లేదు. స్వాతంత్ర్య పోరాటం భాషాప్రయుక్త రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ పోరాటాన్ని హృదయపూర్వకంగా స్వీకరించింది, దాని చట్టబద్ధమైన ప్రజాస్వామ్య స్వభావాన్ని గుర్తించింది. కానీ, భిన్నత్వానికి విరుద్ధమైన వారు విస్తృతమైన జాతీయ గుర్తింపు పేరుతో సమాజంపై ఏకరూప దృక్పథాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తారు. ఒక దేశం – ఒకే మార్కెట్, ఒక దేశం – ఒకటే భాష, ఒక దేశం – ఒకేసారి ఎన్నికలు, ఒక దేశం – ఒకటే పన్ను అలాంటి అసహన ప్రయత్నాలకు ఉదాహరణలు.

ప్రస్తుత పాలక జాతీయవాద కథనం ప్రజల సామాజిక, ఆర్థిక శ్రేయస్సుతో కూడిన చిహ్నాలతో దేశం గురించిన నైరూప్య ఆలోచనను స్పృహతో ప్రోత్సహిస్తుంది. సాంఘిక, ఆర్థిక అసమానతలను సాధారణ మనిషికి హాని కలిగించేలా చేస్తుంది. కార్పొరేట్ సంపదలో పెరుగుదలను అసహజమైన అసమానతలపై జాతీయ గర్వకారణంగా చూపుతుంది. ఈ దృక్పథం అంతిమంగా కులం, వర్గం, అటువంటి ఆధిపత్య ధోరణులన్నింటినీ శాశ్వతంగా కొనసాగించే లక్ష్యానికే ఉపయోగపడుతుంది.

జాతీయవాదానికి సంబంధించి పైన పేర్కొన్న వక్రీకృత దృక్పథం స్వభావం ఏమిటంటే, ప్రక్రియ దిద్దుబాటును ప్రభావితం చేసే లక్ష్యంతో వాస్తవికతపై విమర్శనాత్మక ప్రశంసలను నిరోధిస్తూనే, గతం లేదా వర్తమానాన్ని విమర్శారహితంగా కీర్తించడం! అటువంటి విమర్శనాత్మక దృక్పథాన్ని వృత్తిపరమైన నిరాశావాదంగా కొట్టివేయడం జరుగుతుంది. కానీ, ఇది యథాతథ స్థితిని మాత్రమే ప్రోత్సహిస్తుంది. దేశ పురోగతిని అడ్డుకుంటుంది. నిరంకుశ జాతీయవాద ఉద్దేశ్యం స్వార్థ ప్రయోజనాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఉంది. అందువల్ల, భారతదేశ నాగరికత వారసత్వంగా ఉన్న వాదనా విధానం అణచివేయబడింది. దేశద్రోహం వంటి ప్రాచీన చట్టాల బలిపీఠం వద్ద వాక్ స్వాతంత్ర్యాన్ని త్యాగం చేశారు. భిన్నాభిప్రాయాలను దేశ వ్యతిరేకమైనవిగా ముద్ర వేస్తారు. పౌర హక్కులు, స్వేచ్ఛ వంటివి జాతీయవాద ప్రాజెక్టుకు సహించరానివిగా చిత్రీకరించబడ్డాయి.

నిజమైన జాతీయవాదం దాని సొంత గుర్తింపును మాత్రమే ప్రోత్సహిస్తుంది, ఆత్మగౌరవాన్ని వేడుక చేసుకుంటుంది. కానీ, జాతీయోన్మాదం బలవంతంగా, అసంకల్పితంగా అటువంటి స్వీయ అహంకారాన్ని దాని పౌరులపై మోపుతుంది. అటువంటి జాతీయోన్మాదాన్ని ప్రశ్నించే ఎవరైనా దేశం పట్ల అసంతృప్తిని ప్రదర్శించే వ్యక్తిగా పరిగణించబడతారు. నిజానికి అసమ్మతి అనేది ప్రజాస్వామ్యంలో ఓ అంతర్భాగం. కానీ, మెజారిటీ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించే సామాజిక, రాజకీయ శక్తులు చట్టబద్ధమైన జాతీయ గర్వాన్ని తగినంతగా ప్రకటించనప్పుడు జాతీయోన్మాదం విశ్వసనీయతను పొందుతుంది. ఆధునిక భారతీయ జాతీయవాదాన్ని ప్రజాస్వామ్యం, భాష, మతపరమైన బహుళత్వం, వైవిధ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదం, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం మొదలైన రాజ్యాంగ విలువలపై తిరుగులేని నిబద్ధతతో నిర్వచించాలి. అందువల్ల రాజ్యాంగ జాతీయవాదం ఆధునిక ప్రజాస్వామ్యాలలో అభివృద్ధి చెందిన పౌరసత్వ భావనపై కేంద్రీకృతమై ఉంది. దీనికి విరుద్ధంగా, విభజన గుర్తింపులపై ఆధారపడిన జాతీయవాదం... రాజ్యాంగవాదానికి వ్యతిరేక సిద్ధాంతం. అందువల్ల, మెజారిటీ గుర్తింపుపై ఆధారపడిన జాతీయవాద కథానాయకుడు రాజ్యాంగపు ప్రాథమిక నిర్మాణాన్ని ద్వేషిస్తాడు. అటువంటి మెజారిటీ జాతీయ వాదం అసంపూర్తిగా ఉన్న ప్రజాస్వామిక ప్రాజెక్టులో కొనసాగుతున్న సామాజిక దోష రేఖలను ఉపయోగించు కోవడం ద్వారా అభివృద్ధి చెందుతుంది.

అంబేడ్కర్ 'రాజ్యాంగ నైతికత అనేది సహజమైన భావన కాదు, ఎవరికి వారు పెంపొందించుకోవాల్సినది' అని గమనించారు. అందువల్ల, మెజారిటీ జాతీయవాదానికి వ్యతిరేకంగా పోరాటం కేవలం నైతిక లేదా నైతిక విమర్శ కాదు. రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో నేటికీ కొనసాగుతున్న సామాజిక లోపాలను సరిదిద్దడానికి కఠిన ప్రయత్నం అవసరం. కొందరిని అతి శక్తిమంతుల్ని చేసే ఘనత వహించిన జాతీయవాదంపై తద్వారానే పోరాడవచ్చు. కానీ జాతీయవాదపు లౌకిక, ఉదారవాద విమర్శ మెజారిటీ జాతీయవాద సాంస్కృతిక అంశాలపై దృష్టి పెడుతోంది. అసలు జాడ్యాన్ని విడిచిపెట్టి, దాని లక్షణాలపై మాత్రం ఇలాంటి పోరాటం చేస్తే, అది స్వీయ ఓటమినే మిగులుస్తుంది. దానికి బదులు అటువంటి వక్రీకృత జాతీయవాద ప్రపంచ దృక్పథానికి జవజీవాలను అందించే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక దోష రేఖలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం సాగించడమే మార్గం.

వ్యాసకర్త ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు

మనం సాధించిందీ తక్కువేమీ కాదు!

సందర్భం



డా॥ పి ఎస్. చారి

భారతదేశం తన 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటోంది. వికసిత్ భారత్–2047 అనేది స్వాతంత్ర్యం వచ్చి 100వ సంవత్సరమైన 2047 నాటికి సాకారం చేయాలని ప్రభుత్వ లక్ష్యం. భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే దృక్పథం ఉండటమే కాదు, దాన్ని తు.చ. అనుసరించడం అవసరం. వికసిత్ భారత్ అనేది ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, సుపరిపాలన వంటి వివిధ అంశాల ఆధారంగా ఉంటుంది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నెరవేర్చేందుకు ఎంతవరకు కృషి చేస్తున్నామో మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. స్వాతంత్ర్య సమరయోధుల స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ కలలను మనం ఎంతవరకు సాధించాము? భారతదేశం తన జీవన ప్రమాణాలను మెరుగుపరిచిందా? ఇవన్నీ ఈ సందర్భంగా చర్చనీయాంశాలే.

మన దేశం 3.937 ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తితో ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ప్రస్తుతం 2023–24లో తలసరి ఆదాయం రూ. 2.12 లక్షలు. కానీ ఇప్పటికీ మనం 5 శాతం పేదరికంతో బాధపడుతున్నాము. 2023 ప్రపంచ ఆకలి సూచిక ప్రకారం, 125 దేశాలలో భారతదేశం 111వ స్థానంలో ఉంది. భారత ఆర్థిక వ్యవస్థను పర్యవేక్షించే కేంద్రం (సీఎంఐఈ) ప్రకారం, భారతదేశంలో నిరుద్యోగం రేటు 2024 మేలో 7 శాతం ఉంటే ఆ మరుసటి నెల (జూన్)లో 9.2 శాతానికి పెరిగింది. ఒక శాతం జనాభా



సంపద వాటా 2022–23లో 40.1 శాతంగా ఉంది. 2023–24లో దేశంలోని పాదుపులో 92 శాతం సంపన్నులైన 20 శాతం మంది కలిగి ఉన్నారు.

వీటితో పాటు 2023లో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ యొక్క 'కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్' ప్రకారం 100కి 40 శాతం అవినీతి భారంతో భారతదేశం ఉంది. భారతదేశం 2023 నాటికి తన స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 3–4 శాతం విద్యపై ఖర్చు చేస్తోంది. ఆరోగ్య సంరక్షణపై 1.2–1.5 శాతం ఖర్చు చేస్తోంది. మానవాభివృద్ధి–సంబంధిత అంశాలపై మొత్తం వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 6–8 శాతంగా అంచనా వేయబడింది. అయితే ఇది వార్షిక బడ్జెట్ కేటాయింపులు, విధాన మార్పుల ఆధారంగా మారవచ్చు. సరళీకరణ ఆర్థిక వ్యవస్థలో 'రెడ్ టేపిజం' ఇప్పటికీ తన ప్రభావాన్ని చూపుతోంది. బంధుప్రీతి దాదాపు అన్ని రంగాలలో కనిపిస్తుంది. అయితే ఇది వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు, వినోద రంగాలలో ఎక్కువగా కనిపిస్తుంది. దురదృష్టవశాత్తు ఇప్పటికీ మనం వరకట్నం, ఆడ శిశుహత్య, లింగ అసమానత్వం, గృహహింస, అంటరానితనం వంటి సాంఘిక దురాచారాలతో కునారిల్లుతున్నాం.

మన దేశం ఎన్ని ఆటంకాలు ఎదురైనా విభిన్న రంగాలలో చాలా అభివృద్ధిని సాధించింది. మానవ వనరులలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది, ఉక్కు, బొగ్గు ఉత్పత్తిలో; మొబైల్ వినియోగంలో, వ్యవసాయ ఉత్పత్తిలో ప్రపంచంలో 2వ ర్యాంక్ కలిగి ఉంది. బిలియనీర్ల సంఖ్యలో 3వ ర్యాంక్, గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ అవుట్‌పుట్ మరియు స్పేస్‌లో 5వ స్థానంలో ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను స్వీకరించడంలో 8వ స్థానంలో ఉంది, 14వ అతిపెద్ద ఎగుమతిదారు మన దేశం. సాంస్కృతిక వైవిధ్యంలో 17వ ర్యాంక్, ఐటీ పరిశ్రమ పోటీతత్వంలో18వ ర్యాంక్, హ్యాపీ ప్లానెట్ ఇండెక్స్‌లో 30వ ర్యాంక్, గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 40వ స్థానాన్ని భారత్ నిలుపుకుంది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఫిన్‌టెక్, పునరుత్పాదక శక్తి, బయోటెక్నాలజీ, డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి.

సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ యుగంలో నిరంతర ఆర్థికాభివృద్ధి మరియు విభిన్న సంక్షేమ కార్యక్రమాలతో స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని మనం కొనసాగించాలి. దేశంలోని పౌరులు తమ హక్కులను పరిరక్షించడానికి మానవ హక్కుల సంఘాలు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, ఫోర్త్ ఎస్టేట్, సమాచార హక్కు చట్టం మొదలైన ప్లాట్‌ఫారమ్‌లు, చట్టాల గురించి తెలుసుకోవాలి.

పౌరుల ఆర్థిక పరిస్థితులు మెరుగు పడినప్పుడే సమానత్వం, సౌభ్రాతృత్వం లభిస్తాయి. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలపై అవగాహన ఉన్న పౌరుల భాగస్వామ్యంతోనే స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తిని సాధించగలుగుతాం.

వ్యాసకర్త మేనేజ్మెంట్ స్టడీస్‌లో ఆచార్యులు
మొబైల్ : 83090 82823

కలాలు ఎక్కుపెట్టిన వీరులు

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా, భారతీయులందరినీ ఒక్కటి చేసేందుకు ఎందరో తమ కలాలను ఎక్కుపెట్టారు. రవీంద్రనాథ్ టాగూర్ కవిత్వం, కథలు, నాటకాలు, వ్యాసాలు వంటి అన్ని ప్రక్రియల్లోనూ దేశభక్తిని పెంపొందించే రచనలు చేశారు. దేశానికి జాతీయ గీతాన్ని అందించింది ఆయనే. తన కలం శక్తితో బ్రిటిష్ వారికి ముచ్చెమటలు పట్టించిన మరో రచయిత బంకించంద్ర ఛటర్జీ. 1874లో రాసిన 'వందేమాతర గీతం' స్వాతంత్ర్యోద్యమాన్ని మలుపు తిప్పింది, ఆంగ్లేయులపై పోరాటానికి ఇదే నినాదంగా మారింది. ఈ గేయం మన దేశ జాతీయ గేయంగా నిలిచిపోయింది.

స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఎందరో స్త్రీమూర్తులలో సుభద్ర కుమారి చౌహాన్ ఒకరు. బ్రిటిష్‌వాళ్లకు వ్యతిరేకంగా అనేక ఘాటైన వ్యాసాలు రాశారు, ఝాన్సీ రాణి లక్ష్మీబాయిపై రాసిన కవిత్వం అప్పట్లో సంచలనం కలిగించింది. బ్రిటిష్ ఖజానా ధనాన్ని తీసుకువెళుతున్న రైలును కకోరీ వద్ద దోపిడీ చేసి వారికి సవాల్ విసిరిన విప్లవ వీరకిశోరాల్లో రామ్ ప్రసాద్ బిస్మిల్ ఒకరు. 'సర్ఫరోష్ కీ తమన్నా అబ్ హమారే దిల్మే హై' అని ఆయన రాసిన గీతం అప్పట్లో ఓ సంచలనం. జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త అయిన శ్యామలాల్ గుప్తా 'విజయ్ విశ్వ తిరంగ ప్యారా' గీతం ప్రతి స్వాతంత్ర్య ఉద్యమకారుడిని ధైర్యంగా ముందుకు నడిపించింది. అలాగే 'సారే జహాసే అచ్ఛా, హిందుస్థాన్ హమారా' అంటూ అద్భుత గీతాన్ని రాసి, స్వరపరిచారు మహమ్మద్ ఇక్బాల్.

స్వేచ్ఛా భారతదేశం కోసం 1908లో సంచలనాత్మక 'సుదేశ గీతాలు' ద్వారా దేశభక్తి, ఆధ్యాత్మిక ఇతివృత్తాలతో తమిళ కవి, జాతీయవాది సుబ్రహ్మణ్య భారతి ప్రజలను జాగృత పరిచారు.

స్వాతంత్ర్యోద్యమంలో తన గీతాల ద్వారా ప్రజలను ఉగ్రూతలూగించిన తెలుగువారు గరిమెళ్ళ సత్యనారాయణ. ఆయన రాసిన 'మా కొద్దీ తెల్ల దొరతనం...' పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువనూ, ఉత్తేజాన్ని కలిగించింది. దేశభక్తి కవితలు రాసి జైలుశిక్ష అనుభవించిన కవులలో ప్రథముడు గరిమెళ్ళ. మరో తెలుగు కవి రాయప్రోలు సుబ్బారావు 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా– ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన' వంటి గీతం, 'అవమానమేలరా! అనుమానమేలరా! భారతీయుడనంచు భక్తితో పాడ,' 'లేరురా మన వంటి వీరులింకెందు' అని రాసిన గీతాలు గొప్ప ప్రేరణ ఇచ్చాయి.

గురజాడ అప్పారావు 'దేశమంటే మట్టి కాదోయ్ – దేశమంటే మనుషులోయ్' అంటూ రాసిన గీతం కాని, చిలకమర్తి లక్ష్మీనరసింహం రాసిన 'భరతఖండంబు చక్కని పాడియావు'అనే పద్యం కానీ, త్రిపురనేని రామస్వామి 'వీర గంధము తెచ్చినారము వీరుడెవ్వడు దెల్పుడి' అనే గేయం, అలాగే మైథిలీ శరణ్ గుప్తా, భరతేందు హరిశ్చంద్ర, మున్షీ ప్రేమ్‌చంద్... ఇతరులు అనేక మంది రాసిన సాహిత్యం కానీ దేశ స్వాతంత్ర్యాన్ని సాధించడంలో తమ వంతు పాత్ర పోషించాయనడం అతిశయోక్తి కాదు.

– డా॥ బాలాజీ దీక్షితులు పి.వి
మొబైల్: 88853 91722

సెలవులొచ్చాయ్.. ఛలో ఊరికి..

గురువారం నుంచి సోమవారం వరకు వరుస సెలవులు

- రైళ్లు ఫుల్... బస్సులు కిటకిట
- ప్రజల వినతి మేరకు అదనపు రైళ్లు వేసిన రైల్వే శాఖ
- అదనపు ప్రత్యేక రైళ్లలో బెడ్ రోల్స్ కొరత
- వారం రోజుల వరకు బస్సుల్లో నో టికెట్లు
- చార్జీలు పెంచేసిన ప్రైవేటు ట్రావెల్స్



ఇవీ సెలవులు

- 15వ తేదీ గురువారం – స్వాతంత్య్ర దినోత్సవం సెలవు
- 16వ తేదీ శుక్రవారం – వరలక్ష్మీ వ్రతం ఐచ్ఛిక సెలవు
- 17వ తేదీ శనివారం – సాధారణ సెలవు
- 18వ తేదీ ఆదివారం – సాధారణ సెలవు
- 19వ తేదీ సోమవారం – రాఖీ పౌర్ణమి సెలవు

సాక్షి, అమరావతి : గురువారం నుంచి సోమవారం వరకు వరుస సెలవులు రావడంతో ప్రజలంతా ప్రయాణాలు కట్టారు. సొంత ఊళ్లకు, బంధువుల ఇళ్లకు, విహార యాత్రలకు వెళ్తున్నారు. దీంతో రైళ్లు, బస్సులు రద్దీతో కిక్కిరిసిపోతున్నాయి. వరుస సెలవులు రావడంతో ప్రత్యేక రైళ్లు నడపాలని ప్రయాణికులతోపాటు పలువురు ఎంపీలు దక్షిణ మధ్య రైల్వేను కోరారు. దాంతో రైల్వే శాఖ ఇప్పటికే ఉన్న ప్రత్యేక రైళ్లకు అదనంగా మరికొన్నింటిని ప్రకటించింది. 18న నర్సాపూర్– సికింద్రాబాద్, 19న సికింద్రాబాద్– నర్సాపూర్, 15, 17, 19 తేదీల్లో కాకినాడ–సికింద్రాబాద్, 16, 18, 20 తేదీల్లో సికింద్రాబాద్–కాకినాడ, 14, 15 తేదీల్లో తిరుపతి–నాగర్‌సోల్, కాచిగూడ– తిరుపతి మధ్య ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతామని తెలిపింది. వాటన్నింటిలోనూ ఏసీ కోచ్‌లున్నాయి. కానీ, వీటిలో ప్రయాణికులకు ఇచ్చేందుకు బెడ్ రోల్స్ లేవు. దక్షిణ మధ్య రైల్వే రోజూ నిత్యం 210 రెగ్యులర్ రైళ్లను నిర్వహిస్తోంది. ఇక ఏడాదిలో వివిధ సందర్భాలను పరిగణలోకి తీసుకుని 200 ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. నిర్దీత తేదీల్లో వీటిని నడుపుతుంటుంది. రెగ్యులర్, ప్రత్యేక రైళ్లలోని ఏసీ కోచ్‌లలో ప్రయాణికులకు సరిపడా దుప్పట్లు (బెడ్‌రోల్స్) ఇస్తుంది. విజయవాడ, తిరుపతి, గుంతకల్, కాచిగూడల్లో ఉన్న రైల్వే మెకనైజ్డ్ లాండ్రీల్లో వాటిని శుభ్రపరిచి, తిరిగి సరఫరా చేస్తుంటుంది. కానీ ఇప్పుడు అదనంగా ప్రకటించిన ప్రత్యేక రైళ్లలోని ఏసీ కోచ్‌ల ప్రయాణికులకు సరిపడా దుప్పట్లు లేవు. దాంతో ఈ రైళ్లలో బెడ్ రోల్స్ అందించలేమని, ప్రయాణికులు దుప్పట్లను వారే తెచ్చుకోవాలని దక్షిణ మధ్య రైల్వే సూచించింది.

బస్సుల్లో సీట్లన్నీ రిజర్వ్

ఆర్టీసీ రాష్ట్రంలో రోజుకు 11 వేల బస్సు సర్వీసులు నిర్వహిస్తోంది. వరుస సెలవుల కారణంగా బస్సుల్లో టికెట్లు దొరకడంలేదు. రానున్న వారం రోజులకు సీట్లన్నీ రిజర్వ్ అయిపోయాయి. దాంతో ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఆధారపడుతున్నారు. ఇదే అవకాశంగా ప్రైవేటు ట్రావెల్స్ చార్జీలను అమాంతంగా పెంచేశారు. విజయవాడ నుంచి విశాఖపట్నంకు ప్రైవేటు ట్రావెల్స్ ఏసీ బస్సు చార్జీ రూ.1,200 ఉండగా ఇప్పుడు రూ.2 వేలకు పెంచేశారు. స్లీపర్ ఏసీ బస్సుల్లో రూ.3 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లోనూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఊళ్లకు వెళ్తుండటంతో టోల్ గేట్ల వద్ద రద్దీ భారీగా పెరిగింది. పలు చోట్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్నందున డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పింఛన్లు తొలగించి మా పొట్ట కొట్టొద్దు

- వైఎస్సార్ సీపీ సానుభూతి పరులకు నోటీసులు!
- కనగానపల్లి ఎంపీడీఓ కార్యాలయం ముందు బాధితుల ధర్నా




ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

కనగానపల్లి: టీడీపీ నాయకులు చేస్తున్న ఒత్తిడితో తమ పింఛన్లు తొలగించి పొట్ట కొట్టవద్దని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అధికారులను వేడుకున్నారు. రాజకీయ దురుద్దేశంతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పింఛన్లు తొలగించేందుకు అధికార టీడీపీ నాయకులు శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక అధికారుల ద్వారా నోటీసులు ఇప్పించారు. మండల వ్యాప్తంగా సుమారు 730 మందికి నోటీసులిచ్చారు. మూడు రోజుల్లోపు సరైన ఆధారాలు చూపకపోతే పింఛన్ల జాబితా నుంచి మీ పేర్లు శాశ్వతంగా తీసివేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో మండలంలోని వేపకుంట గ్రామానికి చెందిన పలువురు పింఛన్‌దారులు బుధవారం కనగానపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎంపీడీఓ అలివేలమ్మకు వినతిపత్రం అందజేసి..తమ గోడు వెలిబుచ్చారు. అనంతరం పింఛన్‌దారులు తిమ్మారెడ్డి, తిప్పన్న, రుక్మిణమ్మ, రామలింగ, ఫక్రూబీ తదితరులు విలేకర్లతో మాట్లాడారు. తామంతా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమన్న ఉద్దేశంతో గ్రామంలోని 62 మందికి అధికారులు నోటీసులు ఇచ్చి.. పింఛన్లు తొలగిస్తామని చెబుతున్నారన్నారు. ఈ నోటీసులను 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, కన్నులు, కాళ్లు లేని వికలాంగులతో పాటు వితంతువులకు కూడా ఇచ్చారని వాపోయారు. పింఛన్ తీసుకోవటానికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకే నోటీసులు అందజేశారన్నారు. వీరితో పాటు నోటీసులు అందుకున్న వేపకుంట, భానుకోట గ్రామాలకు చెందిన పలువురు పింఛన్‌దారులు స్థానిక సచివాలయంలో అధికారులకు అర్హత పత్రాలను అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

శ్రీశైలానికి స్థిరంగా వరద

సాగర్ నీటిమట్టం 590 అడుగులకు చేరిక

రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



జాతీయ జెండా రంగులతో విడుదలవుతున్న నీరు

విజయపురి సౌత్/శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకు చేరడంతో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువ కృష్ణా నదిలోకి 16,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్ జలాశయంలోకి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 68,453 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి 6 గంటలకు 46,679 క్యూసెక్కులు వస్తుండగా.. సాగర్ నుంచి 62,879 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కుడి కాలువ ద్వారా 7,528, ఎడమ కాలువ ద్వారా 7,601, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా నదిలోకి 29,150, ఏఎమ్మార్పీకి 1,800 , వరద కాల్వకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రేడియల్ క్రస్ట్‌గేట్ల వద్ద జాతీయ జెండా రంగులతో కూడిన లైట్లు వేయటంతో ఆ దృశ్యం పలువురిని ఆకట్టుకుంది. కాగా.. శ్రీశైలం జలాశయంలో 192.53 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 880.80 అడుగులకు చేరింది.

తెలుగు రాష్ట్రాల్లో రెండు రోజుల పాటు వర్షాలు

కొన్ని చోట్ల పెరగనున్న ఎండల తీవ్రత



మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఆగ్నేయ అరేబియా సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వల్ల తెలుగు రాష్ట్రాల్లో రానున్న 48 గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నిన్నటి నుంచి ఉన్న ద్రోణి ఇప్పుడు దక్షిణ తెలంగాణ నుంచి ఆగ్నేయ అరేబియా సముద్రంను ఆనుకుని ఉన్న కేరళ తీరం మీదుగా వ్యాపించి ఉంది. ఇది సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దక్షిణ కోస్తాలో రానున్న 24 గంటల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఎండల తీవ్రత పెరుగుదల..

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత కూడా పెరుగుతోంది. పగటి పూట ఎండలు, వేడి గాలులు వీస్తున్నాయి. రానున్న 24 గంటల్లో ఎండల తీవ్రత కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

యాంత్రీకరణ దిశగా విశాఖ పోర్టు

పీపీపీ పద్ధతిలో ‘ఎవర్‌సన్’తో విశాఖ పోర్టు ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న పోర్టు చైర్మన్ అంగముత్తు, ఎవర్‌సన్ సంస్థ ప్రతినిధులు

విశాఖ సిటీ: కార్గో హ్యాండ్లింగ్‌ను మరింత సులభతరం చేసేందుకు విశాఖ పోర్టు యాంత్రీకరణ దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం అత్యధికంగా రోయల్టీ కోట్ చేసిన ఎవర్‌సన్ మెరైన్ పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో విశాఖ పోర్ట్ అథారిటీ బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో అన్ని రకాల డ్రై బల్క్ కార్గోను డీబీఎఫ్ఓటీ ప్రాతిపదికన హ్యాండిల్ చేయడం కోసం విశాఖ పోర్టు ఇన్నర్ హార్బర్‌లో ఇప్పటికే ఉన్న ఈస్ట్ క్వే–6 (ఈక్యూ–6) బెర్త్ అభివృద్ధి, యాంత్రీకరణ కోసం రాయితీ ఒప్పందంపై సంతకం చేసింది. ఈ యాంత్రీకరణలో భాగంగా రూ.66.12 కోట్ల విలువైన 120 టన్నుల బరువు ఎత్తగలిగే సామర్థ్యమున్న 1,500 టీపీహెచ్ హార్బర్ మొబైల్ క్రేన్, ఒక మొబైల్ హాపర్స్‌తో పాటు ఇతర హ్యాండ్లింగ్ పరికరాలు క్రేన్‌లు, లోడర్‌లు, ట్రక్కులు, ఫోర్క్ లిఫ్టులు తదితర సౌకర్యాలను ఒప్పంద సంస్థ కల్పించనుంది. ఒప్పందంలో భాగంగా ప్రాజెక్టు పనులు 15 నెలల్లో పూర్తి చేసి బెర్త్‌ను వినియోగంలోకి తీసుకురావాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. 30 ఏళ్ల పాటు ఒప్పందంపై ఇరు సంస్థలు సంతకాలు చేశాయి. బెర్త్ అభివృద్ధి ద్వారా 40 వేల నుంచి 50 వేల డీడబ్ల్యూటీ మధ్య ఉన్న నౌకలను నిర్వహించే వీలు కలుగుతుంది. ఈ ప్రక్రియ ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా 50 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని పోర్టు అధికారులు చెబుతున్నారు.

వైద్యులపై దాడులను అరికట్టాలి

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలెక్ట్ డాక్టర్ నందకిషోర్



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ వైద్యులు

గుంటూరు మెడికల్: వైద్యులపై నిరంతరం జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమలు చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎలెక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని జీఎంఏ హాల్లో ఐఎంఏ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో కోల్‌కతాలో హత్యాచారానికి గురైన వైద్యురాలి సంతాప సభ, క్యాండిల్ ర్యాలీ జరిగింది . సభకు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వైద్యులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు . వైద్యులపై హత్యలకు తెగబడటం దారుణమైన విషయమన్నారు.ప్రభుత్వాలు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని నందకిషోర్ విజ్ఞప్తి చేశారు. డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ భూసిరెడ్డి నరేందర్ రెడ్డి , ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ వెలగా మహేష్ ,సంయుక్త కార్యదర్శి డాక్టర్ బాలినేని సాయికృష్ణ పాల్గొన్నారు .

సీనియర్ వైద్యుల మృతికి సంతాపం: ఇటీవల మరణించిన ఐఎంఏ సభ్యులు సీనియర్ వైద్యులైన డాక్టర్ అంబటి కోటేశ్వరరావు, డాక్టర్ ఎడ్ల శ్రీరామమూర్తి లకు ఐఎంఏ గుంటూరు శాఖ సంతాపం వ్యక్తం చేసింది.


వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- ఏపీ వలంటీర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్
- మధురవాడలో వలంటీర్ల నిరసన



మధురవాడ(విశాఖ): ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏపీ రాష్ట్ర వలంటీర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.జగదీష్ కోరారు. బుధవారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ‘వలంటీర్ల వేదనను ప్రభుత్వ పెద్దలకు తెలుపుదాం’ అంటూ వలంటీర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో వలంటీర్‌కు రూ.10 వేలు జీతం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నేతలు చెప్పారని, తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్ల సమస్యలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి తదితర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–2 ఇన్‌చార్జ్ డి.కస్తూరి, భీమిలి ఇన్‌చార్జ్ సీహెచ్ సంతోషి, 5వ వార్డు ఇన్‌చార్జ్ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి చెక్కిన ప్రేమ చిహ్నం



అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వింతలు, విశేషాలకు కొదవలేదు. తరచి చూస్తే ఎన్నో ప్రకృతి విశేషాలను తిలకించవచ్చు. అందులో ఒకటి ఈ ప్రకృతి చెక్కిన ప్రేమ చిహ్నం(హృదయం ఆకారం). కొండపై గాలిబండ పక్కనున్న రైల్వే రిపీటర్ కేంద్రం వెనుకవైపు మార్గంలో ఇది కనిపిస్తుంది. బండరాయిపై బండ, దానిపై మరో బండరాయి పెట్టినట్టు సహజసిద్ధంగా ఏర్పడింది. దీన్ని సాధారణంగా చూస్తే బండ మీద బండ అన్నట్టుగానే ఉంటుంది. ఈ బండ ఫొటోను కుడివైపు తిరగేసి చూసినా, లేదా బండకు ఎడమవైపు వంగి చూస్తే ప్రేమ చిహ్నం(హృదయం) కనిపిస్తుంది.

–బి.కొత్తకోట

అప్పన్న అన్నదానానికి డిజిటల్ చెల్లింపులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి విరాళాలు అందించే భక్తుల సౌకర్యార్థం సింహగిరిపై ఉన్న అన్నదాన భవనం వద్ద విరాళాల స్వీకరణ కౌంటర్లలో డిజిటల్ చెల్లింపులు విధానాన్ని ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. నిత్యాన్నదాన పథకం ప్రారంభించి బుధవారం నాటికి 35 ఏళ్లు పూర్తవడంతో అన్నప్రసాద భవనంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడారు. ఈ విషయంపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో సంప్రదింపులు జరిపామన్నారు. అన్నదాన భవనం వద్ద విరాళాల స్వీకరణ కౌంటర్లలో స్వైపింగ్ మెషిన్లు, స్కానర్లు ఏర్పాటు చేసి డిజిటల్ పేమెంట్లు జరిపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తక్షణమే డైట్ చార్జీలను పెంచాలి

బీసీ హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రీ మెట్రిక్ విద్యార్థులకు రూ.400, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు రూ.600 చొప్పున డైట్ చార్జీలు పెంచాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ నేతలు ఆ శాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. పెరిగిన నిత్యావసరాల ధరల దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న డైట్ చార్జీలు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రతి నియోజకవర్గంలో గ్రేడ్2, వసతి గృహ సంక్షేమ శాఖాధికారులుగా నియమితులైన వారిని తక్షణమే సీనియార్టీ లిస్టులో చేర్చి, వారికి ప్రమోషన్ చానల్ కల్పిస్తూ వారికి రావాల్సిన గ్రేడ్1లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 599 ప్రకారం గ్రేడ్1 నిష్పత్తిని 5ః1కు పెంపుదల చేయాలని కోరారు. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాలకు తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు.

‘ధర్మ’ చక్రం



ధర్మంపై అధర్మం పైచేయి సాధిస్తున్న ప్రస్తుత తరుణంలో ధర్మచక్రం విలువ తెలియజేస్తూ అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట ప్రభుత్వ ఆదర్శ విద్యాలయం విద్యార్థులు ధర్మచక్రం ఆకారంలో కూర్చుని బుధవారం ఆకట్టుకున్నారు. దేశ ఐక్యత, సమైక్యత ఆర్థికాభివృద్ధికి మూలమని చాటిచెప్పారు. – బి.కొత్తకోట

ఓడీఎల్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలకు కొత్త విధానం

సాక్షి, అమరావతి: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) 2024–25 విద్యా సంవత్సరానికి ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్), ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాల కోసం కొత్త విధానాన్ని తీసుకొస్తున్నట్లు యూజీసీ చైర్మన్ మామిడాల జగదీష్ కుమార్ బుధవారం తెలిపారు. సమర్థవంతంగా ఓడీఎల్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్‌లు అందించడంతో పాటు ప్రవేశాల్లో పారదర్శకతను పెంపొందించడానికి సెప్టెంబర్ నుంచి కొత్త ప్రవేశాల విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. యూజీసీ ఆమోదించిన ఉన్నత విద్యా సంస్థల్లో మాత్రమే విద్యార్థులు ప్రవేశాలు పొందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇకపై విద్యా సంస్థలు యూజీసీ దూరవిద్య బ్యూరో వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవడంతో పాటు వారి అకడమిక్ క్రెడిట్ బ్యాంక్–ఐడీని ఉపయోగించి ప్రత్యేకంగా డీఈబీ–ఐడీని రూపొందించడం ద్వారా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందని వివరించారు.

ఎన్టీపీసీలో సమ్మెలు నిషేధం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్టీపీసీ) లిమిటెడ్‌లోని అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు సమ్మె చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అత్యవసర సేవల కేటగిరి కింద, సంబంధిత సెక్షన్ల ప్రకారం సెప్టెంబర్ 1 నుంచి ఆరు నెలల పాటు ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని తెలిపింది. ఈ మేరకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మురిసిన ‘మువ్వన్నెల’



దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ)/చంద్రగిరి/గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు మువ్వన్నెల జెండాతో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజల్లో దేశ భక్తిని నింపారు. జాతీయ భావాన్ని పెంపొందించారు. విశాఖపట్టణంలో స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకంతో, తిరుపతి జిల్లా చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థులు సుమారు 1200 అడుగుల భారీ జాతీయ జెండాతో, గుంటూరు నగరంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో వెయ్యి అడుగుల మువ్వన్నెల జెండాతో ప్రదర్శనలు నిర్వహించారు.

ఈఏపీసెట్ తుది కౌన్సెలింగ్‌కు అనుమతులు



సాక్షి, అమరావతి: విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈఏపీసెట్–2024 మూడో, తుది దశ వెబ్‌కౌన్సెలింగ్‌కు అనుమతులిస్తూ ఉన్నత విద్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఆ మేరకు శుక్రవారం నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీల్లో ప్రాసెసింగ్ ఆన్‌లైన్ పేమెంట్‌కు అవకాశం కల్పించనున్నారు. అదే విధంగా 19 నుంచి 22 మధ్య సర్టిఫికేషన్ వెరిఫికేషన్, 20 నుంచి 22 మధ్య ఆప్షన్ల నమోదు, 23వ తేదీ ఆప్షన్ల సవరణ, 26వ తేదీన సీట్ల కేటాయింపు చేయనున్నారు. 26 నుంచి 30వ తేదీల్లో సీట్లు పొందిన కళాశాలల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చురుగ్గా తుంగభద్ర గేటు పునరుద్ధరణ పనులు



క్రస్ట్‌గేటు పీసుల తయారీలో నిమగ్నమైన కార్మికులు

సాక్షి బళ్లారి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జీవనాడిగా పేరొందిన తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేటు పునరుద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నీటి పారుదల రంగ నిపుణుడు కన్నయ్యనాయుడు, ఇతర నిపుణుల ఆధ్వర్యంలో గేటు పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేటు వద్ద మూడు పెద్ద క్రేన్లు, రెండు హిటాచీలు, జేసీబీ తదితర యంత్రాలతో పాటు 50 మంది కార్మికులు ప్రత్యేక పనుల్లో నిమగ్నమయ్యారు. జిందాల్ సంస్థ ఒక్కొక్క పీసు 15 టన్నుల బరువుతో మూడు పీసులను తయారు చేస్తుండగా, హిందుస్థాన్, నారాయణ చెరో రెండు పీసులను తయారు చేస్తున్నారు.

70 టన్నుల క్రస్ట్‌గేటు: 70 టన్నుల బరువుతో క్రస్ట్‌గేటు తయారు చేస్తున్నట్టు బోర్డు అధికారులు తెలిపారు. వాస్తవంగా ఐదు పీసులు మాత్రమే అవసరం ఉండగా.. క్రస్ట్ గేటును దింపే సమయంలో ఏవైనా అవాంతరాలు చోటుచేసుకుని ఒకటి లేదా రెండు పీసులు డ్యాంలో నది ద్వారా కొట్టుకుపోతే వెంటనే అమర్చేందుకు అదనంగా రెండు పీసులు 30 టన్నుల బరువుతో సిద్ధంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. డ్యాంలో ప్రస్తుతం 70 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నాలుగు రోజుల నుంచి డ్యాంలో నీటిమట్టం ప్రతి రోజు లక్ష క్యూసెక్కులకు పైగా వదులుతుండటంతో 30 టీఎంసీల నీరు తగ్గిపోయింది. మరో 20 లేదా 30 టీఎంసీలు నీరు తగ్గిన తర్వాత రెండు రోజుల్లో క్రస్ట్ గేటును అమరుస్తామని అధికారులు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,246 మంది స్వామిని దర్శించుకున్నారు. 28,133 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే క్యూలైన్లలోకి అనుమతించరని పేర్కొంది.

శ్రీవారి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ





తిరుమల: శ్రీవారి ఆలయంలో ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణం జరిగింది. ముందుగా సాయంత్రం సేనాధిపతి విష్వక్సేనుల వారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగింపుగా వసంతమండపానికి వేంచేపు చేశారు. అనంతరం మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించారు. ఆ తరువాత ఆలయంలోని పవిత్ర మండపంలో అంకురార్పణ వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. అంకురార్పణ కారణంగా బుధవారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది.

ఒకరోజు ముందే ఎందుకంటే..!

పాకిస్తాన్‌కు కూడా ఆగస్టు 15నే స్వాతంత్య్రం ● దేశ విభజన చట్టంలోనూ స్పష్టంగా ఉంది ● కానీ ఏటా ఆగస్టు 14నే స్వాతంత్య్ర వేడుకలు

1947 ది అదర్ సైడ్

బ్రిటిష్ పాలన నుంచి 1947లో ఇండియాకు విముక్తి లభించినా ఆంగ్లేయుల కుట్ర దేశాన్ని రెండు ముక్కలు చేసింది. ఫలితంగా భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించాయి. ఆగస్టు 15న ఒకే రోజు అధికారికంగా ఉనికిలోకి వచ్చాయి. కనుక రెండింటికీ అదే స్వాతంత్య్ర దినం. కానీ పాక్ మాత్రం ఆగస్టు 14నే తమ స్వాతంత్య్ర దినంగా జరుపుకుంటుంది. ఎందుకో తెలుసా? ఏటా భారత్ కంటే ముందే వేడుకలు చేసుకోవాలని నాటి పాక్ పెద్దలు చేసిన ఆలోచన వల్ల! లేదంటే చరిత్రను చూసినా, ఇంకే కోణంలో ఆలోచించినా అంతకుమించి దీని వెనక మరో కారణమేదీ ఏమీ కన్పించదు. స్వాతంత్య్ర ప్రకటన మొదలుకుని రెండు దేశాలకు అధికారాన్ని బ్రిటన్ బదలాయించడం దాకా ఏం జరిగిందన్నది నిజంగా ఆసక్తికరం...

భారత స్వాతంత్య్ర చట్టాన్ని 1947 జూలై 18న ప్రకటించారు. '1947 ఆగస్టు 15న భారత్, పాకిస్తాన్ పేరిట బ్రిటిషిండియా రెండు స్వతంత్ర దేశాలుగా ఏర్పడనుంది' అని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. పాక్ జాతి పిత, తొలి గవర్నర్ జనరల్ మహ్మదాలీ జిన్నా కూడా జాతినుద్దేశించి ప్రసంగించింది కూడా ఆగస్టు 15వ తేదీనే. ఆగస్టు 15ను స్వతంత్ర, సార్వభౌమ పాకిస్తాన్' పుట్టినరోజుగా ఆ ప్రసంగంలో ఆయన అభివర్ణించారు. ఇలాంటి వాస్తవాలు, రికార్డులతో పాటు లాజిక్ ప్రకారం చూసినా పాక్‌కు కూడా ఆగస్టు 15 మాత్రమే స్వాతంత్య్ర దినమని ఆ దేశానికి చెందిన సీనియర్ జర్నలిస్టు షాహిదా కాజీ అభిప్రాయపడ్డారు. జిన్నా, పాక్ తొలి మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసింది కూడా 1947 ఆగస్టు 15వ తేదీనే అని ఆయన గుర్తు చేశారు. 1948 జూలైలో పాక్ విడుదల చేసిన తొలి స్మారక పోస్టల్ స్టాంపుపై కూడా ఆగస్టు 15ను దేశ స్వాతంత్య్ర దినంగా స్పష్టంగా పేర్కొన్నారు. పాక్ మాజీ ప్రధాని చౌధురీ ముహమ్మద్ అలీ 1967లో రాసిన పుస్తకంలో కూడా ఈ ప్రస్తావన ఉంది. ''1947 ఆగస్టు 15 ఈదుల్ ఫిత్ర్ పర్వదినం. ముస్లింలకు అతి పవిత్రమైన ఆ రోజునే ఖౌద్-ఏ-ఆజం (జిన్నా) పాక్ తొలి గవర్నర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించారు. తొలి మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసింది. నెలవంక, నక్షత్రంతో కూడిన పాక్ పతాకం ప్రపంచ యవనికపై తొలిసారి అధికారికంగా ఎగిరింది'' అని రాసుకొచ్చారు.



దేశ విభజన చర్చల సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ, మౌంట్‌బాటెన్, మహ్మదాలీ జిన్నా

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆగస్టు 14న ఏం జరిగిందంటే...

1947 ఆగస్టు 14న నాటి బ్రిటిషిండియా వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటెన్ కరాచీలో పాక్ రాజ్యాంగ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్య్ర చట్టం ప్రకారం ఆయన ఆగస్టు 15న భారత్, పాక్ రెండింటికీ అధికారాన్ని లాంఛనంగా బదలాయించాలి. బ్రిటన్ సింహాసన ప్రతినిధిగా సంబంధిత ప్రక్రియను వ్యక్తిగతంగా దగ్గరుండి పూర్తి చేయాలి. కానీ, అందుకోసం ఒకే రోజు ఇటు ఢిల్లీలో, అటు కరాచీలో ఉండటం సాధ్యపడని పని. పోనీ ముందుగా భారత్‌కు అధికారాన్ని బదలాయించాక కరాచీ వెళ్లడమూ కుదరదు. ఎందుకంటే బ్రిటన్ రాణి నిర్ణయం మేరకు విభజన అనంతరం స్వతంత్ర భారత్‌కు ఆయన తొలి గవర్నర్ జనరల్ అవుతారు. భారత్‌కు అధికార బదలాయింపు జరిగిన క్షణమే ఆయనకు వైస్రాయ్ హోదా పోయి గవర్నర్ జనరల్ హోదా వస్తుంది. కనుక బ్రిటిషిండియా వైస్రాయ్‌గా ఉండగానే పాక్‌కు అధికార మార్పిడి ప్రక్రియ పూర్తి చేయాలి. అందుకే మౌంట్‌బాటెన్ 14వ తేదీనే కరాచీ వెళ్లి ఆ లాంఛనం పూర్తి చేసి ఢిల్లీ తిరిగొచ్చారు. పాక్‌కు స్వాతంత్య్రం మాత్రం ఆగస్టు 15నే వచ్చింది.



వాఘా బోర్డర్‌లో బీటింగ్ రిట్రీట్

ముందుకు జరుపుకోవడం వెనక...

విభజన చట్టం ప్రకారం, వాస్తవాల ప్రాతిపదికన... ఇలా ఏ లెక్కన చూసినా పాక్ కూడా భారత్‌తో పాటే ఏటా ఆగస్టు 15వ తేదీనే స్వాతంత్య్ర దినం జరుపుకోవాలి. కానీ స్వాతంత్య్రం వచ్చిన మరుసటి ఏడాది నుంచే, అంటే 1948 నుంచే ఆగస్టు 14న స్వాతంత్య్ర దినం జరుపుకుంటూ వస్తోంది. దీనికి రకరకాల కారణాలు చెబుతారు. ఎక్కువమంది చెప్పేదేమిటంటే, భారత్ కంటే ముందే స్వాతంత్య్ర వేడుకలు చేసుకోవాలని నాటి పాక్ పెద్దల మెదళ్లను ఓ పురుగు తొలిచిందట! దాంతో 1948 జూన్ చివర్లో నాటి ప్రధాని లియాకత్ అలీ ఖాన్ తన మంత్రివర్గాన్ని సమావేశపరిచి ఈ మేరకు అధికారికంగా తీర్మానించారు. ఈ నిర్ణయాన్ని ఎవరూ ప్రశ్నించొద్దంటే పాక్ జాతి పిత జిన్నా ఆమోదముద్ర ఉండాలని భావించారట. అందుకే, స్వాతంత్య్ర దినాన్ని ఒక రోజు ముందుకు జరిపేందుకు జిన్నా కూడా అనుమతించారని తీర్మానంలో స్పష్టంగా పేర్కొన్నారు. కానీ అది శుద్ధ అబద్ధమని, 1948 ఆగస్టు నాటికే జిన్నా మరణశయ్యపై ఉన్నారని ఆయన జీవిత చరిత్ర రాసిన యాసర్ లతీఫ్ హందానీ స్పష్టం చేశారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్...

కెప్టెన్ వీరమరణం



శ్రీనగర్: స్వాతంత్య్ర వేడుకల వేళ జమ్మూకశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. ఉగ్రవాదులను ఏరేసే క్రమంలో ఎదురుకాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ వీరమరణం పొందారు. ఓ ముష్కరున్ని బలగాలు మట్టుబెట్టాయి. దోడా జిల్లా అస్సార్ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఈ ఎన్‌కౌంటర్లో ఓ పౌరుడు కూడా గాయపడ్డాడు. శివగఢ్-అస్సార్ ప్రాంతంలో విదేశీ ముష్కరులు నక్కారన్న సమాచారంతో మంగళవారం నుంచే సైన్యం, పోలీసులు సంయుక్తంగా కార్డన్ సెర్చ్ చేపట్టారు. రాత్రి వేళ స్వల్ప కాల్పుల అనంతరం ఉగ్రవాదులు పారిపోయారు. బుధవారం ఉదయం బలగాలు వారి ఆచూకీని కనిపెట్టాయి. ఉగ్రవాదుల కాల్పుల్లో కెప్టెన్ దీపక్ సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన సైనిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. అనంతరం కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. అతడి నుంచి ఏకే 47 తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్ రాత్రి దాకా కొనసాగింది. మరో ముగ్గురు ఉగ్రవాదులు దాగున్నట్టు భావిస్తున్నారు.

అసమానతలను రూపుమాపాలి

- విభజన యత్నాలను తిప్పికొట్టాలి
- ఇక నవ తరం సంస్కరణలు
- పంద్రాగస్టు ప్రసంగంలో రాష్ట్రపతి



న్యూఢిల్లీ: సామాజిక అసమానతలను పెంచి పోషించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. ''వ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన విభజన ధోరణులను సమూలంగా పెకిలించాలి. అన్ని వర్గాలవారినీ కలుపుకుపోయేలా గట్టి కార్యాచరణ రూపొందించి అమలు చేసినప్పుడే అది సాధ్యం'' అని స్పష్టం చేశారు. 78వ స్వాతంత్య్ర దినం సందర్భంగా మంగళవారం ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. భారత్‌లో రాజకీయ ప్రజాస్వామ్యం స్థిరమైన ప్రగతి సాధిస్తోందన్నారు. విస్తరిస్తున్న సామాజిక ప్రజాస్వామ్యానికి అది నిదర్శనమని చెప్పారు. భిన్నత్వం, బహుళత్వమే ఆభరణాలుగా దేశమంతా ఐక్యంగా ముందుకు సాగుతోందంటూ హర్షం వెలిబుచ్చారు. సామాజిక న్యాయానికి మోదీ సర్కారు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర అణగారిన వర్గాల అభ్యున్నతికి చేపట్టిన చర్యలను వివరించారు. మహిళల అభ్యున్నతికీ పెద్దపీట వేసిందన్నారు. దేశ విభజన సందర్భంగా జరిగిన అంతులేని అకృత్యాలు, మానప్రాణ నష్టం ఎన్నటికీ మర్చిపోలేనివంటూ ఆవేదన వెలిబుచ్చారు.

స్ఫూర్తిదాయక ప్రసంగం: మోదీ

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా నవతరం ఆర్థిక సంస్కరణలకు రంగం సిద్ధమైందని రాష్ట్రపతి తెలిపారు. ఆర్థిక రంగంలో భారత్ దూసుకుపోతోందంటే దీర్ఘదృష్టితో కూడిన సారథ్యం, రైతులు, ఇతర సంపద సృష్టికర్తల నిర్విరామ శ్రమే కారణమన్నారు. అద్భుతమైన మౌలిక సదుపాయాలు, ఏఐతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పటిష్టమైన బ్యాంకింగ్ వ్యవస్థ, ఉరకలెత్తుతున్న ఆర్థిక రంగం భారత్‌ను ప్రపంచ పెట్టుబడిదారుల గమ్యస్థానంగా మారుస్తున్నాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తిదాయకంగా ఉందంటూ మోదీ ప్రశంసించారు.

మరో బంగ్లాదేశ్ చేద్దామనుకుంటున్నారు

- వైద్యురాలి హత్యపై చిల్లర రాజకీయాలు
- విపక్షాలపై మమత ధ్వజం

కోల్‌కతా: వైద్యురాలి రేప్, హత్యపై విపక్షాలు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని, విద్యార్థులను ఎగదోసి బంగ్లాదేశ్ లాంటి పరిస్థితులు సృష్టించాలని అనుకుంటున్నాయని సీపీఎం, బీజేపీలపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి అవరణలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసును కలకత్తా హైకోర్టు సీబీఐకి అప్పగించడంపై తమకేమీ అభ్యంతరం లేదని, సీబీఐకి పూర్తిగా సహకరిస్తామని, కేసు త్వరితగతిన తేలాలనేదే తమ అభిమతమని పేర్కొన్నారు. 'వైద్యురాలి కుటుంబానికి అండగా నిలువాల్సిందిపోయి సీపీఎం, బీజేపీలు చవకబారు రాజకీయాలు



చేస్తున్నాయి. బంగ్లాదేశ్ లాంటి పరిస్థితి ఇక్కడా తేగలమని వారు అనుకుంటున్నారు. నేనొకటే చెప్పదలచుకున్నాను. నాకు అధికార వ్యామోహం లేదు' అని మమత అన్నారు. హత్య గురించి తెలియగానే రాత్రంతా కేసును పర్యవేక్షించానని, పోలీసు కమిషనర్‌తో, బాధితురాలి తల్లిదండ్రులతో మాట్లాడానని వివరించారు. మేము ఏం చేయలేదో చెప్పండి? ఏం చర్యలు తీసుకోలేదో చెప్పండి? అని విపక్షాలపై మండిపడ్డారు. 'డీఎన్‌ఏ పరీక్ష, సీసీటీవీ ఫుటేజిని సేకరించడం, శాంపిల్స్‌ను పరీక్షించడం.. ఇలా ప్రతిదీ 12 గంటల్లోపే జరిగింది. నిందితుడిని కూడా 12 గంటల్లోనే అరెస్టు చేశాం' అని చెప్పుకొచ్చారు. సీబీఐ ఆదివారం లోగా కేసును చేధించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతా పోలీసులు 90 శాతం దర్యాప్తును పూర్తి చేశారన్నారు. దోషులను ఉరి తీయాలన్నారు. వైద్యురాలికి న్యాయం జరగాలనే డిమాండ్‌తో స్వయంగా తాను శుక్రవారం కోల్‌కతా వీధుల్లో నిరసన ప్రదర్శన చేయనున్నట్లు వెల్లడించారు.

నిందితుడిని రక్షించే ప్రయత్నం: రాహుల్

వైద్యురాలి రేప్, హత్య ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. బాధితురాలికి న్యాయం చేయాల్సింది పోయి నిందితుడిని



రక్షించే ప్రయత్నాలు జరగడం ఆసుపత్రిపై, అధికార యంత్రాంగంపై పలు సందేహాలకు తావిస్తోందన్నారు. డాక్టర్లలో, మహిళల్లో అభద్రతా భావం నెలకొందన్నారు. ''మెడికల్ కాలేజీలోనే డాక్టర్లకు భద్రత లేకపోతే తల్లిదండ్రులు తమ కూతుళ్లను చదువు కోసం ఎలా పంపిస్తారు? నిర్భయ వంటి కఠినచట్టాలు కూడా ఇలాంటి నేరాలను ఎందుకు ఆపలేకపోతున్నాయి?'' అని ప్రశ్నించారు.



వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా బుధవారం అర్ధరాత్రి కోల్‌కతాలో ర్యాలీ

వైద్యురాలిపై గ్యాంగ్‌రేప్!

జననాంగంలో భారీ పరిమాణంలో వీర్యం

కాళ్లు విరిచేశారన్న పోస్ట్‌మార్టం నివేదిక

కోల్‌కతా/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా ఆర్జీ కార్ ప్రభుత్వ వైద్యకళాశాల ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఉదంతంలో విస్తుగొలిపే విషయాలు వెలుగు చూస్తున్నాయి. ప్రధాన నిందితుడు పోలీస్ వాలంటీర్ సంజయ్ రాయ్‌తో పాటు మరికొందరి ప్రమేయం ఉండవచ్చన్న అనుమానాలను పోస్ట్‌మార్టం నివేదిక బలపరుస్తోంది. మృతురాలి జననాంగంలో 151 గ్రాముల వీర్యం ఉన్నట్లు పోస్ట్‌మార్టం నివేదిక వెల్లడించిందని జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. ఇది కచ్చితంగా గ్యాంగ్ రేపేనని ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సువర్ణ గోస్వామి చెప్పారు. ''మృతురాలి శరీరంలో తీవ్రమైన గాయాలున్నాయి. ఒక్క వ్యక్తి ఇన్ని గాయాలు చేయలేడు! ఎక్కువ మంది దాడి చేసినట్లు అనిపిస్తోంది'' అన్నారు.

ఒళ్లంతా గాయాలే

నాలుగు పేజీల పోస్ట్‌మార్టం నివేదికలో విస్మయకర వివరాలున్నాయి. ''రేప్ చేశాక గొంతు నులిమి చంపారు. పెనుగులాట సందర్భంగా కదలకుండా తలను గోడకు బలంగా అదమడంతో వెనక వైపు పెద్ద గాయమైంది. ముఖమంతా గీసుకుపోయింది. కేకలు వేయకుండా నోరు మూసేశారు. గొంతుపై బలంగా నొక్కడంతో థైరాయిడ్ కార్టిలేజ్ చితికిపోయింది. జననాంగాల వద్ద లోతైన గాయమైంది. లైంగికదాడే అందుకు కారణం. నడుము, పెదాలు, చేతి వేళ్లు, ఎడమ కాలిపై గాయాలున్నాయి. రెండు కళ్ల నుంచి, నోటి నుంచి రక్తస్రావమైంది. ముక్కు, నోరు గట్టిగా అదిమిపట్టి మూసేసినట్లు చర్మం కమిలింది'' అని నివేదిక పేర్కొంది. ''కాళ్లు పూర్తిగా 90 డిగ్రీల కోణంలో వంపు తిరిగాయి. కటిభాగం వద్ద 'పెల్విక్ గార్డిల్' చీలిపోయింది. అంటే కాళ్లను పూర్తిగా పక్కకు విరిచేశారు' అని వైద్యురాలి బంధువు ఒకావిడ విలపిస్తూ చెప్పారు.

మూడు గంటలు బయటే నిలబెట్టారు

మృతదేహాన్ని చూపించకుండా ఆస్పత్రి బయట మూడు గంటలు బయటే నిలబెట్టారని కుటుంబసభ్యులు ఆరోపించారు. ''తర్వాత తండ్రిని అనుమతించారు. తన ఒంటిపై బట్టల్లేవు. కాళ్లు పక్కకు విరిచేసినట్లు ఫొటోలోకనిపిస్తోంది. కళ్లద్దాల ముక్కలు కంట్లో ఉన్నాయి. ఊపిరాడకుండా చేసి చంపేశారు' అంటూ కన్నీటిపర్యంతం అయ్యారు.

కమలా హారిస్‌దే పైచేయి

ట్రంప్‌పై 4.2 శాతం ఆధిక్యం ● పోల్ ఆఫ్ ది పోల్స్ వెల్లడి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష రేసులో డెమొక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్‌దే పైచేయిగా ఉందని తాజాగా వెల్లడైంది. డెసిషన్ డెస్క్ హెచ్‌క్యూ- ది హిల్ కూర్చిన పోల్ ఆఫ్ ది పోల్స్‌లో దేశవ్యాప్తంగా డొనాల్డ్ ట్రంప్ కంటే హారిస్ 4.2 శాతం ఆధిక్యంలో ఉన్నారు. 45 పోల్స్‌ను క్రోడీకరించి ఫలితాలను వెల్లడించారు. కమలా హారిస్ ఏకంగా 4.2 శాతం ఆధిక్యంలో ఉండగా, మే తర్వాత ఆమె ఏకంగా పది శాతం పుంజుకోవడం విశేషం. హోరాహోరీ పోరు నెలకొన్న ఏడు రాష్ట్రాల్లో ఆరింటిలో ట్రంప్‌పై హారిస్ ఒకశాతం ఆధిక్యంలో ఉన్నారని బెనెన్‌సన్ స్ట్రాటజీ గ్రూపు- జీఎస్ స్ట్రాటజీ గ్రూపు సర్వే వెల్లడించింది. హోరాహోరీ రాష్ట్రాలైన జార్జియా, మిషిగాన్, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్, అరిజోనాల్లో హారిస్‌కు ఒక శాతం ఆధిక్యం ఉంది. నెవెడాలో మాత్రం ట్రంప్ ముందంజలో ఉన్నారు. నెవెడాలోనూ హారిస్ క్రమేపీ పుంజుకుంటున్నారు. మే నుంచి తీసుకుంటే ట్రంప్‌తో వ్యత్యాసాన్ని ఆరు పాయింట్ల మేరకు తగ్గించారు. ట్రంప్‌తో పోలిస్తే కమలా హారిస్ నిజాయితీ, క్రమశిక్షణ కలిగిన నాయకురాలని అమెరికన్లు భావిస్తున్నట్లు అసోసియేటెడ్ ప్రెస్- ఎన్‌ఓఆర్‌సీ సర్వే తెలిపింది. ఆర్థిక వ్యవస్థ, వలసల అంశాల్లో ట్రంప్ మెరుగని భావిస్తున్నారు. అధ్యక్ష రేసులోకి లేటుగా వచ్చినా హారిస్ దూసుకెళ్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 10న ట్రంప్‌తో ఆమె డిబేట్ పోటాపోటీగా ఉంటుందని భావిస్తున్నారు. అందరి దృష్టీ దానిపైనే నెలకొంది.

కల్నల్ మన్‌ప్రీత్‌కు కీర్తిచక్ర

న్యూఢిల్లీ: కశ్మీర్ లోయలో ఉగ్రవాదులతో పోరులో వీరమరణం పొందిన కల్నల్ మన్‌ప్రీత్‌సింగ్, జమ్మూకశ్మీర్ డీఎస్పీ హుమయూన్ ముజ్జామిల్ భట్‌కు కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డ్‌ను ప్రకటించింది. రైఫిల్‌మన్ రవికుమార్ (మరణానంతరం), మేజర్ మల్ల రామగోపాల్ నాయుడు, (మరణానంతరం)లనూ కీర్తిచక్రతో ప్రభుత్వం గౌరవించింది. శాంతిసమయంలో ప్రకటించే రెండో అత్యున్నత గ్యాలెంట్రీ అవార్డ్‌కు ఈసారి నలుగురికి ఎంపికచేశారు. అనంత్ నాగ్ అడవుల్లో ఆర్మీ బృందానికి నాయకత్వం వహిస్తూ ప్రాణాలను లెక్కచేయకుండా ఉగ్రవాదులను నేరుగా ఎదుర్కొని ఒక ఉగ్రవాదిని కల్నల్ మన్‌ప్రీత్ హతమార్చారు. తర్వాత నక్కిన ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. త్రివిధ దళాల సర్వసైన్యాధ్యక్ష హోదాలో రాష్ట్రపతి ముర్ము బుధవారం మొత్తం 103 గ్యాలంట్రీ అవార్డులను ప్రకటించారు. కీర్తిచక్రతోపాటు 18 మందికి శౌర్య చక్ర, ఒకరికి బార్ టు సేనా మెడల్, 63 మందికి సేనా మెడల్, 11 మందికి నావో సేనా మెడల్, ఆరుగురికి వాయుసేనా మెడల్ ప్రకటించారు. ఒక ప్రెసిడెంట్ తట్‌రక్షక్ మెడల్, మూడు తట్‌రక్షక్ మెడళ్లనూ తీర గస్తీ దళాలకు ప్రకటించారు.



కల్నల్ మన్‌ప్రీత్ సింగ్



హుమయూన్ భట్

ఆ బకాయిలను రాష్ట్రాలకు చెల్లించాల్సిందే

గనుల రాయల్టీ, పన్నులపై సుప్రీం

న్యూఢిల్లీ: ఖనిజ సంపన్న రాష్ట్రాలకు శుభవార్త. గనులకు సంబంధించిన రాయల్టీ, పన్నుల తాలూకు బకాయిలను కేంద్రం నుంచి వసూలు చేసుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. 2005 ఏప్రిల్ 1 నుంచీ బకాయిలను వసూలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించింది. బకాయిలను 12 ఏళ్లలోపు చెల్లించాలని కేంద్రాన్ని, వాటిపై



పెనాల్టీల వంటివేమీ విధించొద్దని రాష్ట్రాలను ఆదేశించింది. ధర్మాసనం తరఫున సీజేఐ తీర్పు రాశారు. ఖనిజాలు, నిక్షేపాలున్న భూములపై రాయల్టీ వసూలు అధికారం కేంద్రానిదేనన్న 1989 నాటి సుప్రీంకోర్టు తీర్పును పలు రాష్ట్రాలు సవాలు చేశాయి. గనులు, ఖనిజాలపై రాయల్టీ విధించే అధికారం రాష్ట్రాలకే ఉంటుందంటూ 8:1 మెజారిటీతో జూలై 25న ధర్మాసనం తీర్పు వెలువరించింది. దీన్ని 1989 నుంచీ వర్తింపయాలని పలు రాష్ట్రాలు కోరాయి. దీన్ని కేంద్రం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇందుకు ఒప్పుకుంటే సంబంధిత ప్రభుత్వ రంగ సంస్థలు రాష్ట్రాలకు రూ.70 వేల కోట్ల మేరకు చెల్లించాల్సి రావచ్చని తెలిపింది. కనుక తీర్పును జూలై 25 నుంచే వర్తింపజేయాలని అభ్యర్థించింది. దీన్ని ధర్మాసనం తాజాగా తోసిపుచ్చింది.

మోదీ 11వ సారి

నేడు ఎర్రకోట నుంచి ప్రసంగం

న్యూఢిల్లీ: 78వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా 11వ సారి ఎర్రకోట నుంచి ప్రసంగించనున్నారు. 2004-2014 కాలంలో పదిసార్లు ప్రసంగించిన మన్మోహన్‌సింగ్ రికార్డును బద్దలు కొట్టనున్నారు. అయితే నెహ్రూ 17 సార్లు, ఇందిరాగాంధీ 16 సార్లు ఎర్రకోట నుంచి ప్రసంగించారు. వేడుకల నేపథ్యంలో 10,000 మంది పోలీసులు, 3,000 మంది ట్రాఫిక్ పోలీసుల పహారాతో ఢిల్లీని శత్రు దుర్భేద్యంగా మార్చారు.

ఈడీ డైరెక్టర్‌గా రాహుల్ నవీన్




న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పూర్తికాలపు డైరెక్టర్‌గా రాహుల్ నవీన్ నియమితులయ్యారు. ఈడీ తాత్కాలిక చీఫ్‌గా వ్యవహరిస్తున్న ఆయనను బుధవారం పూర్తిస్థాయి డైరెక్టర్‌గా నియమించారు. నవీన్ ఇండియన్ రెవెన్యూ సర్వీసు (ఐఆర్ఎస్) 1993 బ్యాచ్.. ఇన్‌కంట్యాక్స్ కేడర్‌కు చెందిన అధికారి. రాహుల్ నవీన్‌ను రెండేళ్ల కాలానికి, లేదా తదుపరి ఆదేశాలు వచ్చేవరకు (ఇందులో ఏది ముందైతే అది వర్తిస్తుంది) ఈడీ డైరెక్టర్‌గా నియమిస్తున్నట్లు క్యాబినెట్ నియామకాల కమిటీ ఆదేశాలు జారీచేసింది. 57 ఏళ్ల నవీన్ 2019 నవంబరులో స్పెషల్ డైరెక్టర్‌గా ఈడీలో చేరారు. ఈడీ డైరెక్టర్‌గా సంజయ్‌కుమార్ మిశ్రా పదవీకాలం గత ఏడాది సెప్టెంబరు 15న ముగియడంతో.. నవీన్ అప్పటినుండి తాత్కాలిక డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ పన్ను వ్యవహారాల్లో నవీన్ నిపుణులు. తాత్కాలిక డైరెక్టర్‌గా నవీన్ వ్యవహరించిన కాలంలోనే మనీలాండరింగ్ కేసుల్లో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ల సంచలన అరెస్టులు జరిగాయి.

ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ఎంటెక్

రాహుల్ నవీన్ బిహార్‌కు చెందిన వారు. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి బీటెక్, ఎంటెక్ చేశారు. మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)లోని స్విన్‌బుర్నే యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎంబీఏ పూర్తిచేశారు. ఆదాయపు పన్ను శాఖలో 30 ఏళ్లు పనిచేశారు. అంతర్జాతీయ ట్యాక్సేషన్స్‌పై నవీన్ రాసిన పలు వ్యాసాలను నాగ్‌పూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్‌లో ట్రైనీ ఐఆర్ఎస్ విద్యార్థులకు పాఠాలుగా బోధిస్తున్నారు. ''ఇన్ఫర్మేషన్ ఎక్ఛేంజ్ అండ్ ట్యాక్స్ ట్రాన్స్‌పరెన్సీ: టాక్లింగ్ గ్లోబల్ ట్యాక్స్ ఎవాషన్ అండ్ అవాయిడెన్స్'' శీర్షికన నవీన్ రాసిన పుస్తకం 2017లో ప్రచురితమైంది.

ఐరాసలో భారత రాయబారిగా హరీశ్




సాక్షి, న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితికి భారత శాశ్వత ప్రతినిధిగా పర్వతనేని హరీశ్‌ను నియమిస్తూ కేంద్ర విదేశాంగ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం జర్మనీలో భారత రాయబారిగా సేవలందిస్తున్న హరీష్ త్వరలో యూఎన్ అంబాసిడర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని కేంద్రం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సెప్టెంబర్‌లో ఐరాసలో ప్రధాని మోదీ ఒక సదస్సుకు హాజరుకానున్న నేపథ్యంలో హరీశ్ నియామకం త్వరగా పూర్తయింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంభోజ్ జూన్‌లో పదవీవిరమణ చేశాక ఆ పోస్ట్ అప్పటి నుంచీ ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో తదుపరి రాయబారి నియామక ప్రక్రియను కేంద్రం వేగంగా పూర్తిచేసింది. 1990 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి అయిన హరీష్ మూడు దశాబ్దాలుగా విదేశాంగ శాఖ పరిధిలో పలు దేశాల్లో పనిచేశారు.

కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా గోవింద్ మోహన్



న్యూఢిల్లీ: సీనియర్ ఐఏఎస్ అధికారి గోవింద్ మోహన్ తదుపరి కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా ఉన్న గోవింద్ మోహన్‌ను అజయ్ కుమార్ భల్లా స్థానంలో హోంశాఖ కార్యదర్శిగా నియమిస్తూ కేబినెట్ నియామకాల కమిటీ నిర్ణయం తీసుకుందని ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. ఈనెల 22న అజయ్‌కుమార్ పదవీ విరమణ చేయనున్నారు. అదేరోజు గోవింద్ మోహన్ బాధ్యతలు చేపడతారు.

నళిన్ ప్రభాత్ పదవీకాలం కుదింపు



నేషనల్ సెక్యూరిటీ గార్డ్ డైరెక్టర్ జనరల్‌గా నళిన్ ప్రభాత్ పదవీకాలం 2028 ఆగస్టు 31 ఉండగా కేంద్రం అర్ధంతరంగా కుదించింది. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన నళిన్‌ను డిప్యుటేషన్‌పై ఏజీఎంయూటీ కేడర్‌కు మార్చింది. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ బుధవారం ఆదేశాలు జారీచేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేదాకా లేదా మూడేళ్లపాటు నళిన్ ఏజీఎంయూటీ కేడర్‌లో డిప్యుటేషన్‌పై కొనసాగుతారని వివరించింది. అరుణాచల్ ప్రదేశ్- గోవా- మిజోరం - కేంద్ర పాలిత ప్రాంతాలను కలిపి ఏజీఎంయూటీ కేడర్‌గా పిలుస్తారు. ఇది కేంద్ర హోంశాఖ నియంత్రణలో ఉంటుంది. ప్రభాత్‌కు కేంద్రం కొత్త బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

సెప్టెంబర్‌లో మళ్లీ పోటీచేయను

జపాన్ ప్రధాని పదవి నుంచి తప్పుకోనున్నట్లు పరోక్షంగా తెలిపిన కిషిద



టోక్యో: జపాన్ అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ(ఎల్‌డీపీ) అధ్యక్షుడు, ఆ దేశ ప్రధాని ఫుమియో కిషిద త్వరలో ప్రధాని పదవి నుంచి తప్పుకోనున్నారు. ఎల్‌డీపీ అధికారంలో ఉన్న నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడే దేశ ప్రధాని అవుతారు. అయితే సెప్టెంబర్‌లో జరగబోయే పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయట్లేదని కిషిద బుధవారం ప్రకటించారు. 2021లో ఎల్‌డీపీకి అధ్యక్షుడిగా ఎన్నికైన కిషిద పార్టీ అధ్యక్ష పదవీకాలం ఈ సెప్టెంబర్‌తో ముగుస్తోంది. దీంతో ఆయన మళ్లీ పార్టీ పగ్గాలు, దేశ అధికార పగ్గాలు చేపడతారన్న చర్చ నడుమ కిషిద పక్కకు తప్పుకోవడం గమనార్హం. పార్టీలో అవినీతి కుంభకోణాలుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరగడంతోపాటు ఆయనకు ప్రజల్లో మద్దతు సైతం 20 శాతానికి పడిపోయిన నేపథ్యంలో స్వచ్ఛందంగా పక్కకు జరగాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

థాయిలాండ్ ప్రధానికి ఉద్వాసన

నైతిక ఉల్లంఘన అభియోగాలపై తొలగించిన కోర్టు



బ్యాంకాక్: అవినీతి మరక అంటుకున్న వ్యక్తిని తిరిగి మంత్రివర్గంలోకి తీసుకుని నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ థాయిలాండ్ ప్రధాన మంత్రి స్రెత్తా థావీసిన్‌ను అక్కడి రాజ్యాంగ ధర్మాసనం ప్రధాని పదవి నుంచి తొలగించింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీని రద్దుచేయాలంటూ ఒక కోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడిన వారం రోజులకే ఇలా ప్రధాన మంత్రి పదవి ఊడిపోవడం గమనార్హం. '' నన్ను క్షమించండి. నన్ను కోర్టు అనైతిక ప్రధానిగా భావించిందిగానీ నేను అలాంటి వ్యక్తినికాదు. ఏదేమైనా కోర్టు తీర్పును శిరసావహిస్తా' అని తీర్పు తర్వాత ప్రధాని స్రెత్తా వ్యాఖ్యానించారు. స్రెత్తాకు వ్యతిరేకంగా 5:4 మెజారిటీతో బుధవారం కోర్టు తీర్పు వెలువరిచింది. తక్షణం తమ ఆదేశాలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఏప్రిల్‌లో కేబినెట్ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా పిచిత్ చుయెన్‌బన్‌ను మంత్రిగా ఎంపికచేశారు. అయితే 2008లో ఆయన ఒక జడ్జికి 55వేల అమెరికన్ డాలర్లు లంచం ఇవ్వజూపిన కేసులో అరెస్టయి ఆరు నెలలపాటు జైలు జీవితం గడిపి విడుదలయ్యారు. అవినీతి నేతకు మళ్లీ మంత్రి పదవి కట్టబెట్టారంటూ ప్రధానిపై విమర్శలు వెల్లువెత్తడం తెల్సిందే.

సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు చుక్కెదురు

మధ్యంతర బెయిల్‌కు కోర్టు నిరాకరణ



న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కుంభకోణానికి సంబంధించి సీబీఐ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం స్పష్టంచేసింది. దీనిపై స్పందన తెలపాలంటూ సీబీఐకి నోటీసులిచ్చింది. ఇదే మనీలాండరింగ్ కేసులో మూడుసార్లు కేజ్రీవాల్‌కు బెయిల్ ఇచ్చారని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించినా ఫలితంలేకుండా పోయింది. మే 10, జూలై 12న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వగా ట్రయల్ కోర్టు జూన్ 20న సాధారణ బెయిల్ మంజూరు చేసింది. జూన్ 20న ట్రయల్ కోర్టు నుంచి వచ్చిన బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు మౌఖిక ఆదేశాల ద్వారా స్టే విధించిందని అభిషేక్ సుప్రీంకోర్టుకు గుర్తుచేశారు. అయినాసరే మధ్యంతర బెయిల్ ఇచ్చేదిలేదని కోర్టు స్పష్టం చేస్తూ కేసు తదుపరి విచారణను 23వ తేదీకి వాయిదావేసింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
గురువారం । 15 । ఆగస్టు । 2024

దేశాన్ని చీల్చడమే ద్రావిడ సిద్ధాంతం

• గవర్నర్ ఆర్ఎస్ రవి వ్యాఖ్య



సాక్షి,చెన్నై : దేశాన్ని ముక్కలు చేయడమే ద్రావిడ సిద్ధాంతం అని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎస్‌రవి వ్యాఖ్యానించారు. చెన్నైలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ద్రావిడ సిద్ధాంతం దేశాన్ని ముక్కలు చేయడానికి పుట్టుకొచ్చినట్టు పేర్కొన్నారు. అందుకే ఈ సిద్ధాంతం రూపుదిద్దుకుందని, ఈ ప్రయత్నంలో ఉన్న వారికి ఎపపటికైనా ఓటమి తప్పదని హెచ్చరించారు. కాగా పదేపదే ద్రావిడంపై గవర్నర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుండడాన్ని తమిళ పార్టీలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

న్యూస్‌రీల్

'ప్రజలతో కమిషనర్'కు శ్రీకారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అరుణ్

సాక్షి, చెన్నై: ప్రజలకు దగ్గరయ్యే విధంగా గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రజల నుంచి స్వయంగా ప్రతి బుధవారం ఆయన విజ్ఞప్తులు, ఫిర్యాదులను స్వీకరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఉదయం నుంచి రెండు గంటల పాటు కమిషనరేట్‌లో స్వయంగా ప్రజల నుంచి విజ్ఞప్తులు ఫిర్యాదులు స్వీకరించారు. 35 మంది వినతి పత్రాలు కమిషనర్‌కు అందజేశారు.

సివిల్ సప్లయ్ సీఐడీ డీజీపీగా సీమా అగర్వాల్

సాక్షి, చెన్నై : సివిల్ సప్లయ్ సీఐడీ విభాగం డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారిని సీమా అగర్వాల్ నియమితులయ్యారు. బుధవారం హోం శాఖ కార్యదర్శి ధీరజ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తమిళనాడు యూనిఫార్మ్‌డ్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా డీజీపీ హోదాతో ఐపీఎస్ సీమా అగర్వాల్ పనిచేస్తూ వచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా సివిల్ సప్లయ్ సీఐడీ విభాగం డీజీపీ పదవిని ఏర్పాటు చేశారు. ఈ పదవికి తొలి అధికారిగా సీమా అగర్వాల్ నియమితులయ్యారు.

శ్రీవిల్లిపుత్తూరులో బాణసంచా పేలుడు

సాక్షి, చెన్నై: విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు మాయదేవన్ పట్టిలోని ప్రైవేటు బాణసంచా పరిశ్రమలో బుధవారం పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మరణించారు. నలుగురు గాయపడ్డారు. వివరాలు.. మాయదేవన్ పట్టిలోని ప్రైవేటు బాణసంచా పరిశ్రమలో ఉదయం 9.30 గంటలకు కార్మికులు విధులకు హాజరయ్యారు. ఈ సమయంలో ఓ గదిలో రసాయన మిశ్రమం కలిపే సమయంలో పేలుడు జరిగింది. దీంతో కార్మికులు భయంతో లోనికి వెళ్లలేదు. ఇతర గదులలో ఉన్నకొందరు బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడ్డ వారిని శివకాశి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో శ్రీవిల్లిపుత్తూరుకు చెందిన పుల్లకుట్టి(65), కార్తిక్ ఈశ్వరన్(35) శరీరాలు ఛిద్రమై మరణించారు. తీవ్రంగా గాయపడ్డ వారిలో బస్(35), మణికండన్(31)తో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. వీరికి తీవ్రచికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 3 లక్షలు, గాయపడ్డ వారికి రూ. 50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.ఈ ప్రమాద ఘటనకు కారకులుగా పేర్కొంటూ ఆ పరిశ్రమకు చెందిన చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

• దివ్యాంగులకు ఉచిత కుట్టు యంత్రాలు

కొరుక్కుపేట: ఉచిత మోటరైజ్డ్ కుట్టు మిషన్లు అందించే పథకానికి దివ్యాంగులు ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రశ్మీ సిద్ధార్థ్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటనలో పేర్కొంటూ దక్షిణ చెన్నై ప్రాంతంలో 18 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న కుట్టు శిక్షణ పొందిన వినికిడి లోపం ఉన్న వారికి, కాలు లోపం ఉన్నవారికి ఇంటర్వ్యూల అనంతరం మోటరైజ్డ్ కుట్టు యంత్రాలను అందిస్తామన్నారు. చెల్లుబాటు అయ్యే జాతీయ గుర్తింపు కార్డు, యూటీఐడీ గుర్తింపు కార్డు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు tn.gov.in/citizen/registration అనే లింక్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

మహిళా ఖైదీల 'పెట్రోల్ బంక్'



కారుకు డీజిల్ నింపుతున్న మంత్రులు రఘుపతి, అన్బిల్ మహేశ్

సాక్షి, చెన్నై : తిరుచ్చిలో మహిళా ఖైదీల నేతృత్వంలో పెట్రోల్ బంక్ ఏర్పాటైంది. దీనిని మంత్రులు రఘుపతి, అన్బిల్ మహేశ్ బుధవారం ప్రారంభించారు. క్షణికావేశంతో నేరాలకు పాల్పడి జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఖైదీలలో సత్ ప్రవర్తన దిశగా ఓ వైపు, విద్యాపరంగా, వృత్తి పరంగా శిక్షణలు మరోవైపు విస్తృతం చేశారు. వివిధ ఉత్పత్తులే కాదు, వ్యవసాయ ఆధారిత కార్యక్రమాలు సైతం చేపట్టి ఉన్నారు. ఈ పరిస్థితులలో తిరుచ్చి మహిళా ఖైదీల నేతృత్వంలో ఓ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. గాంధీ మార్కెట్ రోడ్డులోని మహిళా జైలుకు సమీపంలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. ఈ బంక్‌ను ప్రారంభించిన మంత్రులు ఇరువురు ఓ కారుకు స్వయంగా డీజిల్ పట్టారు. ఈ బంక్ పూర్తిగా మహిళా ఖైదీలతో నడవడం అభినందనీయమని కొనియాడారు.

శిఖర సమానులైన
దేశభక్తుల అసమాన కీర్తి..
వందల ఏళ్ల పోరాటానికి సాక్ష్యంగా
నిలిచిన స్వేచ్ఛావాయువుల ఆర్తి..
త్యాగధనులు అందించిన స్ఫూర్తి..
ప్రాతిపదికగా స్వాతంత్ర్య సంబరాలకు రాష్ట్ర ప్రజలు సిద్ధమయ్యారు. మువ్వన్నెల జెండాలు, అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఇళ్లు, కార్యాలయాలు, స్థలాల్లో జెండా వందనానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక ప్రభుత్వ సంస్థలన్నీ విద్యుత్ దీపాల వెలుగులో త్రివర్ణ శోభితమై దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. పుదుచ్చేరిలోనూ ఏర్పాట్లు పూర్తయ్యాయి





మువ్వన్నెల జెండా రంగులతో కాంతులీనుతున్న చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్

త్రివర్ణ శోభితం

'పంద్రాగస్టు'కు సన్నద్ధం

- రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు
- నేడు జార్జికోటలో జెండా ఎగుర వేయనున్న సీఎం స్టాలిన్
- రాష్ట్ర ప్రజలకు గవర్నర్, నేతల శుభాకాంక్షలు
- 23 మంది పోలీసు అధికారులకు రాష్ట్రపతి పతకాలు
- రాష్ట్రంలో భద్రత కట్టుదిట్టం

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కామరాజర్ సాలైలోని సెయింట్ జార్జి కోటలోని రాష్ట్ర సచివాలయం పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబయ్యింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం ఉదయం త్రివర్ణ పతాకాన్ని జార్జికోటలో ఎగుర వేయనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా భద్రతను పోలీసు యంత్రాంగం కట్టుదిట్టం చేసి అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. వివరాలు.. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాడవాడల్లో గురువారం ఉదయం జాతీయ జెండా ఎగుర వేయడానికి రాష్ట్ర ప్రజలు సన్నద్ధమయ్యారు. మూడు రంగుల జెండాలతో పాటు ఇతర ఉపకరణల విక్రయాలు బుధవారం దుకాణాలలో జోరుగా సాగాయి. తపాల కార్యాలయల ద్వారా లక్షలాది జెండాలను విక్రయించారు. అలాగే అనేక పాఠశాలలు, సంఘాలు, సంస్థల నేతృత్వంలో దేశ సమగ్రత, ఐక్యతను చాటేవిధంగా పలు చోట్ల బుధవారం ర్యాలీలు జరిగాయి. ఇందులో స్వాతంత్ర్య సమర యోధుల వేషాధారణలలో పిల్లలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇక గురువారం రాష్ట్ర వ్యాప్తంగా వాడవాడల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడేందుకు తగ్గట్టుగా అన్ని పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థల్లో ఏర్పాట్లు జరిగాయి. పలుచోట్ల ఇంటింటా జాతీయ జెండాలు ఎగుర వేయడానికి సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. హైకోర్టు అనుమతితో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా, నగర జిల్లా కేంద్రాలలో జాతీయ జెండాను చేత బట్టి మోటారు సైకిల్ ర్యాలీకి బీజేపీ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. స్వాతంత్ర్య వేడుకలకు ఎలాంటి ఆటంకం ఎదురు కాకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం గట్టి భద్రతా ఏర్పాట్లు చేసింది. లక్షల మందితో రాష్ట్రవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. చెన్నై, వంటి ప్రధాన నగరాలలోని రైల్వే స్టేషన్లలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను అమర్చి ప్రయాణికులను, వారి బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్నారు. ఈ కొత్త పరికరాలలో వెలిగే లైట్ల ఆధారంగా ఆయా బ్యాగ్‌లలో ఎలాంటి వస్తువులు ఉన్నాయో పసిగట్టేందుకు వీలవుతుందని అధికారులు పేర్కొన్నారు.

జార్జి కోట ముస్తాబు

స్వాతంత్ర్య దినోత్స వేడుకలకు రాష్ట్ర పరిపాలనా కేంద్రం జార్జికోట ప్రత్యేకంగా ముస్తాబు అయ్యింది. ఇక్కడి స్తూపంపై అతిపెద్ద జాతీయ పతాకాన్ని సీఎం ఎంకే స్టాలిన్ ఎగుర వేయనున్నారు. 150 అడుగుల ఈ స్తూపాన్ని గత ఏడాది ఆధునీకరించిన విషయం తెలిసిందే. ఈ వేడుకల దృష్ట్యా, సచివాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు కామరాజర్ సాలైకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాల వెలుగులో ఆ పరిసరాలతో పాటు సచివాలయం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. అలాగే చెన్నైలోని పురాతన భవనాలు, సెంట్రల్ రైల్వే స్టేషన్లు విద్యుత్ దీప కాంతులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఇప్పటికే జార్జికోట, పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. నిఘా పటిష్టం చేశారు. జార్జ్‌కోటలో ఉదయం జాతీయ పతాకాన్ని ఎగుర వేసినానంతరం సీఎం గౌరవ వందనం స్వీకరిస్తారు. తర్వాత ఓపెన్ టాప్‌వాహనంలో సచివాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు పర్యటించి, రోడ్డుకు ఇరువైపులా ఉండే ప్రజలకు అభివాదం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. అనంతరం జరిగే వేడుకలో సాహస వనితలకు, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేసిన వారికి, మహిళా సంక్షేమానికి, సాంఘిక సంక్షేమానికి కృషి చేసిన వారికి, సాహస వీరులకు అవార్డులను అందజేయనున్నారు. అలాగే తమిళర్ బిరుదు, విజ్ఞానశాస్త్రంలో ఉత్తమ సేవలకు డాక్టర్ అబ్దుల్ కలాం, వీర ధీర సేవలకు కల్పాన చావ్లా బిరుదులు ప్రదానం చేస్తారు. ఉత్తమ పంచాయతీలు, పురపాలక సంస్థలు, నగర పాలక సంస్థలకు అవార్డులను అందజేయనున్నారు. మధ్యాహ్నం దేవదాయ శాఖ పరిధిలోని ప్రధాన ఆలయాల్లో సహపంక్తి భోజనాలకు ఏర్పాట్లు చేశారు. మంత్రులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల దృష్ట్యా, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కామరాజర్ సాలైలోని సచివాలయం మార్గంలో శ్రామిక చిహ్నం నుంచి వార్ మెమోరియల్, రిజర్వు బ్యాంక్ సబ్ వే వరకు ట్రాఫిక్ మార్పులు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలను అందించిన రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధికారులు 23 మందికి రాష్ట్రపతి పతకాలను ప్రకటించారు. ఇందులో ఐపీఎస్ అధికారులు కన్నన్, అబిన్ దినేష్, వన్నియ పెరుమాల్, ఏజీ బాబు, ప్రవీణ్ కుమార్ అభినవు, ఫిరోజ్ ఖాన్ అబ్దుల్లా, టీపీ సెంథిల్‌కుమార్, ఎం. కింగ్‌షాలిన్, శ్యామలా దేవి, కె. ప్రభాకర్, ఎల్ బాలాజీ శరవణన్, కె. రాధాకృష్ణన్, ఎం స్టీఫన్‌తదితరులు ఉన్నారు. దక్షిణ రైల్వే ప్రధాన సెక్యూరిటీ కమిషనర్ ఐజీ జీఎం ఈశ్వరరావు కూడా రాష్ట్రపతి పోలీసు మెడల్‌కు ఎంపికయ్యారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులు పలువురికి సీఎం మెడల్స్ ప్రకటించారు. ఇదిలా ఉండగా కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు బీచ్ రోడ్డు సిద్ధమైంది. ఇక్కడ సీఎం రంగ స్వామి గురువారం జాతీయజెండాను ఎగుర వేయనున్నారు.



జాతీయ జెండాలతో విద్యార్థులు, మహిళల ర్యాలీ

ప్రజలకు శుభాకాంక్షలు..

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, పుదుచ్చేరి సీఎం రంగ స్వామి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి, పీఎంకే నేత రాందాసు, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్, మక్కల్ నీది మయ్యం నేత కమల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వ పెరుంతొగై తదితరులు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేళ అందరం సమష్టిగా ముందుకు సాగుదామని, దేశ సర్వతో ముఖాభివృద్ధికి పాటు పడుదామని పిలుపు నిచ్చారు. ఇదిలా ఉండగా గవర్నర్ ఆర్ఎన్ రవి గురువారం సాయంత్రం ఇవ్వనున్న తేనీటి విందును డీఎంకే కూటమి పార్టీలు బహిష్కరించాయి. అన్నాడీఎంకే తరపున మాత్రం ప్రతినిధులు హాజరు కానున్నారు.



జాతీయ జెండాలు కొనుగోలు చేస్తున్న యువత



భారతదేశ చిత్ర పటం ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు



చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీ



విద్యుత్ దీపాల వెలుగులో తమిళనాడు సచివాలయం

శివకాశి కార్మికులకు భరోసా

సాక్షి, చెన్నై : బాణసంచా తయారీలో నిమగ్నమై ఉన్న కార్మికులకు భరోసా కల్పించే విధంగా సినీ నటుడు, కేంద్ర మంత్రి సురేష్ గోపీ శివకాశిలో బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టాల్సిన భద్రతా చర్యల గురించి చర్చించారు. వివరాలు.. విరుదునగర్‌జిల్లా శివకాశి పరిసరాలు బాణసంచా తయారీలో మినీ జపాన్‌గా పేరుగడించిన విషయం తెలిసిందే. ఇక్కడ ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఏడు ప్రమాదాలు జరగ్గా, సుమారు 50 మంది వరకు మరణించారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులను పట్టించుకునేందుకు అధికారులు, పాలకులు పరుగుల తీస్తుంటారు. ఆ తదుపరి యాథారాజా తథ ప్రజా అన్నట్టే పరిస్థితి. ఈ నేపథ్యంలో తొలిసారిగా కేంద్ర మంత్రి ఒకరు తమను పరామర్శించేందుకు రావడమే కాకుండా, తమ కష్టాన్ని రోజంతా దగ్గరుండి చూడడం శివకాశిలోని బాణసంచా కార్మికులకు ఆనందాన్ని కలిగించింది. సినీ నటుడు సురేష్ గోపీ కేరళ నుంచి ఎంపీగా గెలిచి కేంద్ర పర్యాటక, పెట్రోలియం, నేచురల్ గ్యాస్ శాఖ సహాయ మంత్రి పదవి దక్కించుకున్నారు. మంత్రిగా తొలిసారిగా ఆయన శివకాశిలో మంగళవారం పర్యటించారు. తర్వాత బాణసంచా పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులతోనూ ఆయన సమావేశమయ్యారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా, కార్మికులకు భద్రత కల్పించడమే కాకుండా, బాధితులుగా ఉన్న వారికి అభయం కలిగించే విధంగా భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా సురేష్ గోపీ మాట్లాడుతూ, శివకాశి పరిసరాలలో జరిగే బాణసంచా పేలుడు ఘటనలను ఇది వరకు తాను మీడియాలో చూసి తీవ్ర ఆవేదనకు లోనయ్యేవాడినని పేర్కొన్నారు. అందుకే మంత్రిగా తన వంతు ఇక్కడి ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో, బాధితులకు భరోసా కల్పించేందుకు వచ్చానని, బాణసంచా కార్మికుల తరపున కేంద్రం వద్ద గళాన్ని వినిపిస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా సురేష్ గోపీ పర్యటన జరిగిన మరుసటి రోజే బుధవారం ఈ జిల్లా పరిధిలోని శ్రీ విల్లి పుత్తూరులోని ఓ పరిశ్రమలో పేలుడు జరగడం గమనార్హం.



విలేకరులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి సురేష్ గోపీ

పుస్తక రూపంలో మూడేళ్ల ప్రగతి రికార్డు

– ఆవిష్కరించిన సీఎం స్టాలిన్



ప్రగతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్



పార్కులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తూ..

సాక్షి, చెన్నై: డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తయిన విషయం తెలిసిందే. ఈ మూడేళ్ల కాలంలో ప్రవేశ పెట్టిన పథకాలు, విజయవంతంగా అమలు చేసిన ప్రాజెక్టుల సమగ్ర వివరాలతో ''అద్భుతమైన మూడు సంవత్సరాలు.. తమిళనాడు ప్రగతి'' పేరిట మూడేళ్ల రికార్డు పుస్తకం తీసుకొచ్చారు. బెంగాల్ మాజీ గవర్నర్ శ్రీ గోపాల కృష్ణ గాంధీ, తమిళనాడు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జె. జయరంజన్ వంటి వారి ముందు మాటతో ఈ పుస్తకం రూపుదిద్దుకుంది. దీనిని సచివాలయంలో సీఎం స్టాలిన్ బుధవారం ఆవిష్కరించారు. సీఎం చేతుల నుంచి ఈ పుస్తకాలను మంత్రి స్వామినాథన్, సీఎస్ శివదాస్ మీన, స్టేషనరీ, ప్రింటింగ్ విభాగం కమిషనర్ శోభన, సమాచార శాఖ కార్యదర్శి రాజారామన్, డైరెక్టర్ వైద్యనాథన్ అందుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎలగిరి పర్యావరణ ప్రగతి, పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకునే విధంగా, 75 ఎమరాల్డ్ గార్డెన్స్, ఫిషింగ్ నెట్ కలెక్షన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్ సెంటర్‌లను సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అటవీ శాఖ తరపున తిరుపత్తూరు జిల్లాలో రూ.3.57 కోట్లతో తమిళనాడులోని 29 జిల్లాల్లోని ప్రభుత్వ భూముల్లో హరిత తమిళనాడు కార్యక్రమం అమలుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి మది వేందన్ తదితరులు పాల్గొన్నారు. తమిళనాడు ఆది ద్రావిడర్ హౌసింగ్ కార్పొరేషన్ తరపున ఆది ద్రావిడ, గిరిజన విద్యార్థులకు రూ.80.70 కోట్లతో నిర్మించిన హాస్టల్ భవనాలు, పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాల్స్ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆర్ గాంధీ, టీఆర్‌బి రాజ, కయల్ వెలి సెల్వరాజ్ పాల్గొన్నారు. అలాగే, తిరుచ్చిలో రూ.1.82 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ అదనపు కార్యాలయ భవనాలను సీఎం ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర రహదారుల శాఖలో ఖాళీల భర్తీ నిమిత్తం ఎంపిక చేసిన 180 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులను సీఎం అందజేశారు. ముందుగా రైతు సంక్షేమ శాఖపరిధిలోని షుగర్ మిల్స్ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కో-ఆపరేటివ్ సాధించిన జాతీయ స్థాయి అవార్డులను ఆ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీరు సెల్వం సీఎంకు అందజేశారు.

క్లుప్తంగా

ర్యాంకులతో మరింత ప్రోత్సాహం

సాక్షి, చెన్నై: జాతీయ స్థాయిలో లభించే ర్యాంకులు విద్యా సంస్థల భవిష్యత్తుకు మరింత ప్రోత్సాహాలు అని సిమాట్స్ చాన్స్‌లర్ ఎస్ఎం వీరయ్యన్, ప్రో చాన్స్‌లర్ డాక్టర్ దీపక్ నల్లస్వామి తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ ఇండియా ర్యాంకింగ్స్– 2024లో సీమాట్స్‌కు డీమ్డ్ వర్సిటీగా ఒక్కో కేటగిరిలో తొమ్మిది ర్యాంకులు వచ్చినట్టు బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో వారు ప్రకటించారు. అగ్రశ్రేణి 25 సంస్థలలో ఒకటిగా తమకు గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. యూనివర్సిటీ కేటగిరిలో 11, మెడికల్‌లో 12, న్యాయశాస్త్రంలో 13, పరిశోధనల్లో 20, ఓవరాల్‌గా 22, ఇంజినీరింగ్‌లో 53, మేనేజిమెంట్‌లో 74, ఇన్నోవేషన్‌లో 11, 50వ ర్యాంకులు తమకు వచ్చినట్టు వివరించారు. తమ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది సరికొత్త పరిశోధనలు, ఆవిష్కరణలతో దూసుకెళ్తున్నారని, విశ్వవిద్యాలయం అభివృద్ధితో పాటు ప్రపంచ స్థాయి ప్రమాణాలు, విద్యా కార్యక్రమాలు విస్తృతంచేసినట్లు వివరించారు. జాతీయ స్థాయిలో దక్కిన ఈ ర్యాంకులు తమ విద్యా సంస్థల భవిష్యత్తుకు మరింత ప్రోత్సాహకరంగా ఉందన్నారు.

ఎమ్మెల్యే ఇంట్లోకి చొరబడ్డ ఆగంతకుడు

సాక్షి, చెన్నై : అన్నాడీఎంకే ఎమ్మెల్యే ఇసక్కిసుబ్బయ్య ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి చొరబడ్డాడు. సీసీ టీవీ కెమెరాల దృశ్యాల ఆధారంగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. వివరాలు.. ఎమ్మెల్యే ఇసక్కి సుబ్బయ్య చెన్నై అశోక్ నగర్‌లో నివాసం ఉన్నారు. ఆయన కుమారుడు ఇసక్కిదురైతో కలిసి ఎమ్మెల్యే ప్రస్తుతం అండమాన్ పర్యటనకు వెళ్లి ఉన్నారు. ఈ పరిస్థితులలో ఆయన ఇంట్లోకి మంగళవారం రాత్రి ఓ అగంతుకుడు ప్రవేశించారు. ఆవ్యక్తి ఇంట్లోకి ప్రవేశించడాన్ని గుర్తించిన పని మనిషి పెట్టిన కేకలతో ఉడాయించాడు. అండమాన్‌లో ఉన్న ఇసక్కి సుబ్బయ్యకు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయాన్నే పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలలోని దృశ్యాల ఆధారంగా విచారణ జరుపుతున్నారు. అగంతకుడు ఇంటికి పలుమార్లు రెక్కీ నిర్వహించడం, లోనికి చొరబడి చాలా సేపు ఇంట్లోకి ప్రవేశించడానికి తీవ్ర ప్రయత్నాలు చేయడం సీసీ కెమెరాల దృశ్యాలలో కనిపించింది.

పుదుచ్చేరిలో కరుణానిధికి విగ్రహం, మణి మండపం

కొరుక్కుపేట: కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి విగ్రహం, మణిమండపం నిర్మిస్తామని అసెంబ్లీలో పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి బుధవారం వెల్లడించారు. కరుణానిధి శతాబ్ధి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా మీనాక్షి అమ్మన్ జాతర



తణిగై మీనాక్షి అమ్మన్ ప్రతిమను గ్రామ వీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం



అమ్మవారి వేషాల్లో యువకులు

తిరుత్తణి: తిరుత్తణిలో తణిగై మీనాక్షి అమ్మన్ ఆలయ జాతర వేడుకలు మంగళవారం రాత్రి కోలాహలంగా నిర్వహించారు. వివరాలు.. తిరుత్తణి పెద్దవీధి, ఆర్ముగస్వామి వీధిలోని తణిగై మీనాక్షి అమ్మన్ ఆలయంలో మంగళవారం నుంచి బుధవారం వరకు రెండు రోజుల పాటు జాతర వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు అంబళ్లు పోసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి పిండి పదార్థాలతో మొక్కులు చెల్లించారు. స్థానిక చెరువుకట్ట నుంచి అమ్మవారి గెరిగ ఊరేగింపు నిర్వహించారు. బైపాస్‌రోడ్డు, గాంధీ రోడ్డు, మురుగప్పనగర్, పెద్ద వీధి, ఆర్ముగస్వామి వీధి మార్గాల్లో అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా కరగాట్టం, కాళిమాత వేషధారణతో కళాకారులు అమితంగా ఆకట్టుకున్నారు. అమ్మవారి ఊరేగింపులో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారు ఆలయం చేరుకున్నారు. బుధవారం ఉదయం బంకమట్టితో ప్రతిష్టించి పోలేరమ్మను పెద్ద వీధిలో ఊరేగించగా భక్తులు మొక్కులు చెల్లించారు. చివరగా అమ్మవారి ప్రతిమను నందినదిలో నిమజ్జనం చేశారు. సాయంత్రం తణిగై కామాక్షమ్మకు పుష్పాలంకణ చేసి ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

ముత్తమిళ్ మురుగన్ మహానాడుకు ఆహ్వానం



సీఎంకు ఆహ్వానం పలుకుతున్న ఆధ్యాత్మిక ప్రతినిధులు

సాక్షి, చెన్నై: ఈ నెల 24, 25 తేదీల్లో పళనిలో అంతర్జాతీయ ముత్తమిళ్ మురుగన్ మహానాడు జరగనున్న విషయం తెలిసిందే. హిందూ దేవాదాయ శాఖ నేతృత్వంలో జరిగే ఈ మహానాడు ప్రపంచ దేశాల నుంచి మురుగన్ భక్తులు, సేవలకు రానున్నారు. ఈ మహానాడు కోసం ఆ శాఖమంత్రి పీకే శేఖర్ బాబుతో పాటుగా ఆధ్యాత్మిక పెద్దలు, 20 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో స్టాలిన్‌ను మురుగన్ భక్తులు, అధికారులు, మంత్రి కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా 1250 గ్రామీణ ఆలయాలలో మరమ్మతులు చేపట్టేందుకు ఒక్కో ఆలయానికి రూ. 2 లక్షలు చొప్పున రూ. 50 కోట్లను సీఎం ప్రకటించారు.

సీనియర్ సిటిజన్ల కోసం అత్యాధునిక ప్రాజెక్టు

సాక్షి, చెన్నై: చెన్నైలో సీనియర్ సిటిజన్ల కోసం అత్యాధునిక సీనియర్ లివింగ్ డెస్టినేషన్ ప్రాజెక్టుగా స్వరంగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని అరి హంత్ ఫౌండేషన్స్, ఆషియానా హౌసింగ్ ప్రకటించాయి. బుధవారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో స్వరంగ్ ప్రాజెక్టు లోగోను ఆ సంస్థల డైరెక్టర్ భరత్ జైన్, ఎండి అంకుర్ గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆప్రాజెక్టు గురించిన వివరాలను మీడియాకు వివరించారు. పదవీ విరమణ తర్వాత జీవితాన్ని ఆనందంగా గడపాలనే సీనియర్ సిటిజ్ల కోసం ఈ ప్రాజెక్టుకు చర్యలు తీసుకున్నామన్నారు. చెన్నై ఈసీఆర్ మార్గంలోని నెమ్మెలిలో 10.87 ఎకరాల విస్తీర్ణంలో ప్రీమియం ప్రాజెక్టుగా చేపడుతున్నామన్నారు. బంగాళాఖాతం



ప్రాజెక్టు లోగోను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

తీరంలో ఒక సుందర ప్రదేశంగా అన్ని రకాల నిర్మాణాలు, సహజ వాతావరణం, ప్రక్రితీ రమణీయ తనుచాటే దిశగా మరెన్నో నిర్మాణాలు, గృహాలు , సీనియర్ సిటిజన్ల జీవన శైలికి ఉపయోగ పడే అన్ని రకాల వసతులు ఇక్కడ ఉంటాయని వివరించారు.

చెన్నై కోర్టుకు రౌడీ రాజేంద్రన్

సాక్షి, చెన్నై: బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో వేలూరు జైలు నుంచి వ్యూహ రచన చేసిన రౌడీ రాజేంద్రన్‌ను నిఘానీడలో బుధవారం చెన్నైకు తీసుకొచ్చారు. చెన్నై ఎగ్మూర్ కోర్టు న్యాయమూర్తి జగదీశ్ ఎదుట హాజరు పరిచారు. వివరాలు.. బీఎస్పీ నేత ఆమ్ స్ట్రాంగ్ చెన్నైలో గత నెల హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈకేసులో 22 మందిని అరెస్టు చేశారు. ఇందులో ఓ నిందితుడైన తిరువెంగడం పోలీసు ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఈ కేసు విచారణ సమయంలో అనేక మలుపులు చోటు చేసుకుంటూ వస్తున్నాయి. పలు పార్టీ స్థానిక నాయకులు ఈకేసులో అరెస్టు అవుతున్నాయి. కాంగ్రెస్ యువజన ప్రధానకార్యదర్శి అశ్వథామన్‌ను సైతం పోలీసులు అరెస్టు చేశారు. వేలూరు జైల్లో యావజ్జీవ ఖైదీగా ఉన్న రాజేంద్రన్ కుమారుడే అశ్వథామగా విచారణలో తేలింది. రాజేంద్రన్ సైతం ఆమ్ స్ట్రాంగ్‌ను మట్టుబెట్టే వ్యూహంలో కీలక పాత్ర పోషించినట్టుగా విచారణలో తేలింది. దీంతో వేలూరు జైలు నుంచి బుధవారం నిఘా నీడలో అతడిని చెన్నైకు తీసుకొచ్చారు. కోర్టులో హాజరు పరిచాననంతరం అతడి వద్ద చెన్నై పోలీసులు తీవ్ర విచారణ జరుపుతున్నారు.

అపోలో ఆసుపత్రి అరుదైన ఘనత

– విజయవంతంగా 6వేల రోబోటిక్ సర్జరీలు

కొరుక్కుపేట: చెన్నైలోని అపోలో ఆసుపత్రుల్లో 6 వేలకు పైగా రోబోటిక్ విధానంలో శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్టు ఆ ఆసుపత్రుల ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి తెలిపారు . మెడికల్ ఇన్నోవేషన్, సర్జికల్ ఎక్సలెన్స్‌లో అపోలో ఆసుపత్రి అరుదైన ఘనతను సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంగంబాక్కంలో రోబోటిక్ విధానంలో శస్త్రచికిత్సలను విజయవంతంగా చేపట్టిన చెన్నై అపోలో ఆసుపత్రులు వైద్యులను అభినందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ ప్రతాప్ సి రెడ్డితోపాటు ఆసుపత్రుల వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతారెడ్డిలు పాల్గొని వైద్యులను అభినందించి మాట్లాడారు. 2011లో రోబోటిక్ సర్జరీ ప్రోగ్రామ్‌లను ప్రారంభించినప్పటి నుంచి అత్యాధునిక వైద్య పద్ధతులతో చికిత్సలను అందించటం జరిగిందన్నారు. ఒక్క చెన్నై అపోలో ఆసుపత్రులల్లో 6 వేలకు పైగా రోబోటిక్ శస్త్ర చికిత్సలను విజయవంతంగా



వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ పతాప్ సి రెడ్డి , డాక్టర్ ప్రీతారెడ్డి

చేపట్టామని అన్నారు. చిన్నపాటి కోతతో, తక్కువ నొప్పితో , త్వరగా కోలుకోవడం , తక్కువ సమయంలో ఆసుపత్రిలో ఉండే ప్రయోజనాలతో ఈ రోబోటిక్ సర్జరీలు జరిగాయని అన్నారు. యూరాజలీ, కోలోరెక్టల్ సర్జరీ , కార్డియాక్ సర్జరీ , పీడియాట్రిక్ సర్జరీ, హెడ్ అండ్ నెక్ సర్జరీ, గైనకాలజీ, జనరల్ సర్జరీలతో విభిన్నమైన ప్రత్యేకలతో ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సైతం వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

2040 నాటికి భారత్‌లో భారీ అభివృద్ధి

• శాస్త్రవేత్త శివదానుపిళ్లై వ్యాఖ్య



ప్రదర్శనలో పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థులు

కొరుక్కుపేట: 2040 నాటికి భారతదేశం వైజ్ఞానిక రంగంలో భారీ వృద్ధి సాధిస్తుందని శాస్త్రవేత్త శివదాను పిళ్లైఅన్నారు. తమిళనాడు ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు సంయుక్తంగా ఈరోడ్‌లో నిర్వహించిన పుస్తక ప్రదర్శన ముగింపు కార్యక్రమం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఇందులో శాస్త్రవేత్త ఎ. శివథాను పిళ్లై మాట్లాడారు. చదవడం ద్వారానే జ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. 2040 నాటికి చంద్రుడిపై భారత్ పరిశోధనలను మరింత తీవ్రతరం చేస్తుందన్నారు. అక్కడ నుంచి హీలియం–3 తీసకు వస్తే భారత్ అనూహ్యంగా పుంజుకుంటుందని అభిప్రాయపడ్డారు.

ఎండీఎంకే నాయకుల ధర్నా

కొరుక్కుపేట: కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ చెన్నై కలెక్టరేట్ వద్ద ఎండీఎంకే ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ పార్టీ జనరల్ సెక్రటరీ వైగో ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి కేంద్ర తీరును తీవ్రంగా ఖండించారు. ఎండీఎంకే జిల్లా కార్యదర్శులు కౌన్సిలర్ జీవన్ సమక్షంలో జరిగిన ప్రదర్శనలో కె. కళగం కుమార్, డీసీ రాజేంద్ర ప్రసాద్, అడ్వకేట్ కౌన్సిలర్ సైదై పి. సుబ్రమణి, రాష్ట్ర మైనారిటీ విభాగం నాయకులు నిరసనలో పాల్గొన్నారు.

సిగ్నల్స్ సమస్యతో ఆగిన రైళ్లు

• ప్రయాణికుల ఇబ్బందులు

వేలూరు: రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని తిరువేలంగాడు రైల్వే స్టేషన్ ప్రాంతంలో బుధవారం ఉదయం 6.20 గంటల సమయంలో అనూహ్యంగా సిగ్నిల్స్ సమస్య ఏర్పడింది. దీంతో చెన్నై- కాట్పాడి, కాట్పాడి - చెన్నై మార్గంలో వెళ్లే రైళ్లన్నీ పూర్తిగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అరక్కోణం రైల్వే అధికారులు సిగ్నిల్స్ సమస్య ఏర్పడిన ప్రాంతానికి చేరుకొని మరమ్మతులు చేశారు. సుమారు గంట పాటు పోరాడి సిగ్నిల్స్‌ను ఉద యం 7.50 గంటలకు పూర్తి చేశారు. ఆ సమయంలో చెన్నై నుంచి మైసూరుకు వెళ్తున్న వందేభారత్ రైలు, శతాబ్ది ఎక్స్‌ప్రెస్, మైసూరు నుంచి చెన్నై వెళ్తున్న కావేరి ఎక్స్‌ప్రెస్, జోలార్‌పేట నుంచి చెన్నై వెలుతున్న ఏలగిరి ఎక్స్‌ప్రెస్, అదేవిధంగా చెన్నై నుంచి అరక్కోణం, తిరుత్తణి వెళ్తున్న రైళ్లు ఆగిపోయాయి. దీంతో గంటన్నర పాటు ప్రయాణికులు రైళ్లలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా రైల్వే సిగ్నిల్స్‌లో ఎందుకు సమస్య ఏర్పడందనే విషయంపై రైల్వే అధికారులు విచారణ చేస్తున్నారు.

మద్యం మత్తులో రైలుకు ముందు పరుగెత్తి..

• యువకుడి ఆత్మహత్య

తిరువొత్తియూరు: చెన్నై బీచ్ రైల్వేస్టేషన్ నుంచి అరక్కోణంకు బుధవారం విద్యుత్ రైలు బయలుదేరింది. ఈ రైలు రాయపురం రైల్వే స్టేషన్ వద్ద ఆగింది. ప్రయాణికులు దిగిన తర్వాత తిరిగి రైలు ముందుకు కార్ డ్రైవర్ కదిలించారు. ఆ సమయంలో అక్కడ మద్యం మత్తులో నిలబడి వున్న యువకుడు హఠాత్తుగా రైలు ముందుకు పరిగెత్తాడు. దీంతో అతన్ని రైలు ఢీ కొట్టింది. దీంతో అతడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. డ్రైవరు, రైలును ఆపి వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. రైల్వే పోలీసులు యువకుడి మృతదేహాన్ని శవ పరీక్ష కోసము స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రజనీకాంత్ కథ ఓకే చేశారు.. కానీ!



దర్శకుడు వెంకట్‌ప్రభు, నెల్సన్ దిలీప్‌కుమార్

తమిళసినిమా: రజనీకాంత్‌తో తనకు దక్కిన అవకాశాన్ని దర్శకుడు నెల్సన్ తన్నుకుపోయారని దర్శకుడు వెంకట్‌ప్రభు పేర్కొన్నారు. సీనియర్ దర్శకుడు, సంగీత దర్శకుడు గంగైఅమరన్ వారసుడు వెంకట్‌ప్రభు. చెన్నై 28 చిత్రం చిత్రంతో దర్శకుడిగా పరిచయం అయిన ఈయన తరువాత చెన్నై 28–2, మంగాత్తా, గోవా, మానాడు వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించారు. నటుడుగా, నిర్మాతగానూ కొనసాగుతున్న వెంకట్‌ప్రభు తాజాగా విజయ్ కథానాయకుడిగా గోట్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం భారి అంచనాల మధ్య సెప్టెంబర్ 5న తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. కాగా ఇటీవల ఈయన ఓ భేటీలో ఆసక్తికరమైన విషయాన్ని పేర్కొన్నారు. తాను రజనీకాంత్ కథానాయకుడిగా చిత్రం చేయాలని ఆశించాననీ, అందుకు కథను కూడా సిద్ధం చేసి ఆయనకు వినిపించానని చెప్పారు. రజనీకాంత్‌కు కూడా కథ నచ్చిందన్నారు. దీంతో రజనీకాంత్‌తో చిత్రం చేయడం ఖాయం అయ్యిందన్నారు. అయితే చివరి క్షణంలో రజనీకాంత్‌తో చిత్రం చేసే అవకాశాన్ని దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తన్నుకుపోయారని, అలా తనకు రజనీకాంత్‌తో చిత్రం చేసే అవకాశం మిస్ అయ్యిందని చెప్పారు. నెల్సన్ దిలీప్‌కుమార్ నటుడు రజనీకాంత్‌తో చిత్రం చేయడం సంతోషమేననే అభిప్రాయాన్ని వెంకట్‌ప్రభు వ్యక్తం చేశారు. ఇది ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా గోట్ చిత్రం తరువాత ఈయన నటుడు శివకార్తికేయన్ హీరోగా ఓ చిత్రం చేయడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

కోలీవుడ్ టాక్స్

వేరే లెవల్‌లో తంగలాన్!



నటుడు విక్రమ్, పా.రంజిత్, జీవీ.ప్రకాశ్‌కుమార్ తదితర తంగలాన్ చిత్ర యూనిట్

తమిళసినిమా: చియాన్ విక్రమ్ కథానాయకిగా నటించిన తాజా చిత్రం తంగలాన్. నటి పార్వతి, మాళవిక మోహనన్, పశుపతి, డెనియల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని పారంజిత్ దర్శకత్వంలో ఆయన నిర్మాణ సంస్థ నీలం ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ.జ్ఞానవేల్ రాజా నిర్మించారు. జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఆగస్ట్ 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో తెరపైకి రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ బుధవారం మధ్యాహ్నం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. నటుడు విక్రమ్, దర్శకుడు పా.రంజిత్, నటి పార్వతీ, మాళవిక మోహన్, జీవీ.ప్రకాశ్‌కుమార్, ధనుంజయన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు పా.రంజిత్ మాట్లాడుతూ తనను నమ్మినందుకు నటుడు విక్రమ్‌కు ధన్యవాదాలు అన్నారు. ఈ చిత్రం కోసం ఆయన పడిన శ్రమ, పెట్టిన అంకితభావం మాటల్లో చెప్పలేన్నారు. తంగలాన్ తన శైలిలో రాజకీయాలను ఆవిష్కరించే చిత్రంగా ఉంటుందన్నారు. కచ్చితంగా కథ, కథనం ప్రేక్షకులకు సరి కొత్త అనుభూతిని కలిగిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి ఎంపిక చేసుకున్న తారాగణం, సాంకేతిక వర్గం అంతగా అంకిత భావంతో పని చేశారని పేర్కొన్నారు. నటుడు విక్రమ్ మాట్లాడుతూ తాను ఇంతకు ముందు 2 వేల సంవత్సరాల క్రితం చరిత్రతో కూడిన పొన్నియిన్ సెల్వన్ చిత్రాన్ని చేశాననీ, ఇప్పుడు 2 వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కథాంశంతో కూడిన తంగలాన్ చిత్రాన్ని చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రం కోసం దర్శకుడు పా.రంజిత్ ఎంతగానో శ్రమించారన్నారు. ఇక జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదన్నారు. పాటలే కాకుండా బీజియం అద్భుతంగా ఉంటుందన్నారు. ఆయన ఇప్పటికే జాతీయ అవార్డులను గెలుచుకున్నారనీ, అయితే అంతకు మించి ఆయన మావమ్మ(ఏఆర్.రెహ్మాన్)మాదిరి ఆస్కార్ అవార్డును గెలుచుకంటారని చెప్పారు. తంగలాన్ చిత్రం అలా,ఇలా కాదని వేరే లెవల్‌లో ఉంటుందని నటుడు విక్రమ్ పేర్కొన్నారు.

వడచెన్నై- 2 నుంచి వైదొలిగిన ధనుష్?

తమిళసినిమా: ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ కాంబోలో తెరకెక్కిన చిత్రం వడచెన్నై. నటి ఆండ్రియా, ఐశ్వర్యరాజేశ్, దర్శకుడు అమీర్, సముద్రఖని, కిశోర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం 2018లో విడుదలై సంచలన విజయాన్ని సాధించింది. కాగా వడచెన్నైకి సీక్వెల్ చేస్తామని నటుడు ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ ప్రకటించారు. దీంతో ఈ చిత్రం ఎప్పుడు ప్రారంభం అవుతుందా? అని ధనుష్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలాంటిది తాజాగా వారికి షాకింగ్ న్యూస్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వడచెన్నై- 2 చిత్రంలో నటుడు ధనుష్ నటించడం లేదని, అసలు ఈ చిత్రానికి వెట్రిమారన్ కూడా దర్శకత్వం వహించడం లేదన్నదే ఆ ప్రచారం. కాగా వడచెన్నై –2 చిత్రాన్ని దర్శకుడు వెట్రిమారన్ శిష్యుడు కార్తికేయన్ దర్శకత్వం వహించనున్నట్లు, దీన్ని దర్శకుడు వెట్రిమారన్ నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాదు ఇందులో నటుడు ధనుష్, దర్శకుడు అమీర్ నటించిన పాత్రలకు వేరే నటులు నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. నటుడు ధనుష్ చేతి నిండా చిత్రాలతో బిజీగా ఉండడం వల్లే వడచెన్నై- 2 చిత్రంలో నటించడం లేదని టాక్ స్ప్రెడ్ అవుతోంది. అయితే ఇందులో నిజం ఎంత అన్నది అధికారిక ప్రకటన వెలువడే వరకూ వేచి చూడాల్సిందే.



నటుడు ధనుష్‌తో దర్శకుడు వెట్రిమారన్

త్రిష సౌందర్య రహస్యం అదే?



త్రిష

తమిళసినిమా: అందాల అపరంజి బొమ్మ నటి త్రిష. ఈ పాన్ ఇండియా కథానాయకి వయసిప్పుడు జస్ట్ 41 ఏళ్లు. చిన్న వయసు నుంచి అందంపై దృష్టి పెట్టి ఉన్నత విద్య పూర్తికాగానే అందాల పోటీకి సిద్ధమై మిస్ చెన్నై కిరీటాన్ని గెలుచుకున్నారు. అదే విధంగా పలు వాణిజ్య ప్రకటనలో నటించిన త్రిష కెరీర్ మాత్రం చిన్న గెస్ట్ రోల్ తోనే మొదలైంది. జోడీ అనే చిత్రంలో నటి సిమ్రాన్ కు స్నేహితురాలుగా ఒకటి రెండు సన్నివేశాల్లో కనిపించి మాయమయ్యే పాత్రలో నటించారు. అయితే అప్పుడు ఈ బ్యూటీ దక్షిణాది సినిమాను తన అంద చందాలతో, అభినయంతో ఏలుతానని ఊహించి ఉండరు. మొదట్లో లేసా లేసా, మౌనం పేసియదే వంటి చిత్రాల్లో కథానాయకిగా నటించిన విక్రమ్ సరసన నటించిన సామి చిత్రం కెరియర్లో బ్లాక్ బస్టర్ కమర్షియల్ చిత్రంగా నిలిచిపోయింది. ఆ తర్వాత విజయ్‌తో జతకట్టిన గిల్లి చిత్రం మరో మైలురాయిగా నిలిచిపోయింది. దీంతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన త్రిష తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లోనూ ఎంట్రీ ఇచ్చి పాన్ ఇండియా నాయకిగా రాణిస్తున్నారు. ఒక దశలో వరస అపజయాలతో బాగా వెనకబడిపోయిన త్రిషకు పొన్నియిన్ సెల్వన్ చిత్రంతో దర్శకుడు మణిరత్నం నటిగా పునర్ జన్మను ఇచ్చారనే చెప్పాలి. ఆ చిత్రంలో యువరాణి కుందవై అంటే ఇలానే ఉంటుందేమో అనిపించారు త్రిష. ఆ తర్వాత స్టార్ హీరోలతో చిత్రాల్లో నటించే అవకాశాలు వరుసకడుతున్నాయి. విజయ్ సరసన లియో చిత్రంలో నటించిన త్రిష, ప్రస్తుతం అజిత్ జంటగా విడాముయర్చి, కమల్ హాసన్‌తో కలిసి థగ్ లైఫ్ చిత్రాల్లో నటిస్తున్నారు. అటు తెలుగులో చిరంజీవి సరసన విశ్వంభర చిత్రంతోపాటు మలయాళం లో మోహన్ లాల్, టోవింటో థామస్‌కు జంటగా నటిస్తున్నారు. దీంతో నాలుగు పదుల వయసు దాటినా తగ్గని పరువాలతో మెరిసిపోతున్న త్రిష సౌందర్యం గురించి సర్వత్రా చర్చ సాగుతోంది. త్రిష ఆరోగ్యం, సౌందర్య రహస్యానికి గల కారణాలేమిటన్న వివరాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. త్రిష సౌందర్య రహస్యంలో డైట్, వర్కౌట్స్ ప్రధాన కారణమట. ముఖ్యంగా తను చిన్న వయసు నుంచే నాన్ వెజ్ ఆహారం విషయంలో చాలా కట్టుబాట్లు విధించుకుంటూ వస్తున్నారట. ఎక్కువగా కాయగూరలతో ఆహారాన్ని తీసుకోవడం,ఆయిల్ ఫుడ్‌కు దూరంగా ఉండడమేట. అదేవిధంగా ఇంట్లో తన తల్లి చేసిన వంటకాలే భుజిస్తారని, ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు మాత్రమే స్టార్ హోటళ్లలో తింటారట.

ఆయన్ని డైరెక్ట్ చేయాలి



కీర్తి సురేష్

తమిళసినిమా: నటి కీర్తి సురేష్ తన మనసులోని కోరికను వ్యక్తం చేశారు. సినిమా కుటుంబం నుంచి వచ్చిన నటి కీర్తి సురేష్. అమ్మ నటి. నాన్న నిర్మాత. బాలనటిగానే సినీ రంగప్రవేశం చేసిన కీర్తి సురేష్‌కి మొదటి నుంచి సినిమా రంగంపై మక్కువ ఎక్కువ. అలా మలయాళంలో కథానాయకిగా పరిచయం అయ్యి ఆ తర్వాత ఇది ఎన్నమాయం చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు. ఇక్కడ రజనీమురుగన్ చిత్రంతో తొలి సక్సెస్‌ను అందుకున్న కీర్తి సురేశ్ కెరీర్ ఉజ్వలంగా మారిపోయింది. తెలుగులో నటించిన మహానటి చిత్రం జాతీయ ఉత్తమ నటి అవార్డును అందించింది. అలా మలయాళం, తమిళం, తెలుగు భాషల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్ గా రాణిస్తున్న ఈమెను తాజాగా బాలీవుడ్ అవకాశం వరించింది. తమిళ దర్శకుడు అట్లీ నిర్మిస్తున్న బేబీ జాన్ చిత్రంలో నటిస్తున్నారు. ఇలా పాన్ ఇండియా నాయకిగా వెలిగిపోతున్న కీర్తి సురేష్ పలు ఉమెన్ సెంట్రిక్ కథా పాత్రల్లోను నటిస్తుండటం విశేషం. తాజాగా ఈ బ్యూటీ నటించిన ఉమెన్ సెంట్రిక్ కథా చిత్రం రఘుతాతా. సుమన్ కుమార్ దర్శకత్వంలో హోమ్ బలే సంస్థ నిర్మించిన ఈ చిత్రం గురువారం రానుంది. ఈ చిత్ర ప్రచారంలో బిజీగా ఉన్న కీర్తి సురేష్ ఒక భేటీలో పేర్కొంటూ నటుడు సూర్యను డైరెక్ట్ చేయాలనే కోరికను వ్యక్తం చేశారు. ఆ చిత్రానికి కథను కూడా తానే సిద్ధం చేస్తానని చెప్పారు. కాగా ఈమె ఇంతకు ముందే నటుడు సూర్య సరసన తానా సేర్న్దద కూటమి చిత్రంలో నటించారు. మరి కీర్తి సురేష్ ఆశ ఎప్పుడు నెరవేరుతుందో చూడాలి.

క్లుప్తంగా

మురుగన్ సేవలో పర్యాటకశాఖ మంత్రి


మంత్రి రామచంద్రన్‌కు ప్రసాదాలు అందజేస్తున్న అధికారులు

తిరుత్తణి: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రామచంద్రన్ బుధవారం తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ఘన స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. తర్వాత మూలవర్లను దర్శించుకుని ఆయన మొక్కులు చెల్లించారు. అంతకు ముందు చెన్నై తిరుపతి జాతీయ రహదారి మార్గంలోని మురుక్కంపట్టు వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోటల్‌ను మంత్రి తనిఖీ చేశారు. అక్కడ సౌకర్యాలపై యాత్రికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

చెన్నై నుంచి ఆరు కొత్త విమాన సర్వీసులు

కొరుక్కుపేట: ఎయిర్ ఇండియా సంస్థ చెన్నై నుంచి కొత్తగా ఆరు విమాన సర్వీసులను సోమవారం నుంచి ప్రారంభించింది. వీటిని కేరళలోని తిరువనంతపురం, ఒడిశాలోని భువనేశ్వర్, పశ్చిమ బంగాలోని పక్టోరా నుంచి చెన్నై ఎయిర్‌పోర్టుకు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

పెరిగిన విమాన చార్జీలు

కొరుక్కుపేట: చెన్నై డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు నుంచి తూత్తుకుడి, మధురై, తిరుచ్చి, కోయంబత్తూరు, సేలం వెళ్లే విమానాల చార్జీలు పెరిగాయి. విమానాల్లో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో యాథావిధిగా విమానాలు నడిచాయి. దీంతో టికెట్ ధరలు అమాతంగా పెంచేశారు. చెన్నై-తూత్తుకుడి మధ్య సాధారణ ధర రూ.4301 కాగా, బుధ, గురువారాల్లో చార్జీ రూ.10,796కు పెంచారు. చెన్నై నుంచి మదురైకి రూ.4,063 ధర ఉండగా రూ.11,716కు పెరిగింది. చెన్నై-తిరుచ్చికి 7,192, చెన్నై-కోయంబత్తూరుకు రూ.5349, చెన్నై-సేలం చార్జీ రూ.8277కు పెరిగింది.

కోయంబేడు మార్కెట్‌లో ఫాగింగ్

తిరువొత్తియూరు: చెన్నై, కోయంబేడు మార్కెట్‌లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వ్యాపారులు కోరడంతో సిబ్బంది రోజూ ఫాగింగ్ చేస్తున్నారు. వివరాలు.. చెన్నై కోయంబేడు మార్కెట్‌లో కూరగాయలు, పండ్ల దుకాణాలు 3000, పూల దుకాణాలు 500కు పైగా ఉన్నాయి. 20 వేల మందికి పైగా వ్యాపారులు, కూలీ కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు. రోజూ తెల్లవారుజామున 3 గంటల నుంచి వ్యాపారులు, కూలీలంతా పనులు ప్రారంభిస్తారు. అలాగే ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చేవారు కూడా బస చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుకాణాల కమిటీ నిర్వాహకులు రోజు వాహనం ద్వారా దోమల మందు పిచికారీ చేస్తున్నారు.

తిరుచ్చి ఎస్పీకి బెదిరింపులు

- ముగ్గురిపై కేసు

కొరుక్కుపేట: తిరుచ్చి ఎస్పీగా వరుణ్‌కుమార్ ఉన్నారు. ఆయన భార్య వందిత పాండే పుదుకోట్టై ఎస్పీగా తిరుచ్చి, పుదుకోట్టైలో రౌడీపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో గత ఏడాది నవంబర్ 22న తిరుచ్చిలో రౌడీ జగన్ అలియాస్ కొంబన్ జగన్ (30)ని కాల్చి చంపారు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ఎస్పీలకు, వారి కుటుంబ సభ్యులకు తరచూ బెదిరింపులు వస్తున్నాయి. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు విదేశాల్లో నివశిస్తున్న కొందరు తమిళులను ఉసిగొల్పి చంపేస్తామని ఇటీవల బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ కేసులో తిల్లైనగర్ పోలీసులు సీమాన్, చట్టై దురై మురుగన్, కార్తీక్‌పై బుధవారం కేసు నమోదు చేశారు.

సముద్ర తీరంలో మహిళ శవం

తిరువొత్తియూరు: చెన్నై తిరువొత్తియూరు కుప్పం సముద్రంలో తీరంలోని తుండియల్ మలుపు బండరాళ్ల మధ్య ఈ నెల 11వ తేదీ ఒక మహిళ అర్ధనగ్నంగా మృతి చెందిపడి ఉండగా పర్యాటకులు గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్టాండ్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విచారణలో శవంగా పడి ఉన్న మహిళ చెన్నై ఐనావరం ఐసీఎఫ్ కాలనీకి చెందిన మణిమేఘలై అని తెలిసింది. ఆమె చేతిలో శివకుమార్ అని పచ్చబొట్టు ఉంది. దీంతో దీన్ని ఆధారంగా మణిమేఘలైని ఆమె కుటుంబ సభ్యులు గుర్తుపట్టారు. మణిమేఘలై భర్త శివకుమార్ మృతి చెందాడు. మణిమేఘలై రైల్వేలో పనిచేస్తోంది. గత 10వ తేదీ విరక్తి చెంది ఇంటి నుంచి బయటకు వచ్చారని, తర్వాత ఆమె సముద్రతీరంలో శవంగా పడి ఉన్నట్లు తెలిసింది.

రాతి విగ్రహం మాయం

అన్నానగర్: ఎళుత్తరినాథర్ ఆలయంలో శివలింగ రాతి విగ్రహం మాయమైంది. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలో వెయ్యి ఏళ్ల నాటి ఎళుత్తరినాథర్ దేవాలయం ఉంది. ఈ ఆలయంలో వాయువ్య మూలలో అరు అడుగుల ఎత్తున్న శివలింగం, పరివార్ స్వామితోపాటు రాతి వినాయకుడి విగ్రహాలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఆలయంలోని శివాచార్య ముత్తుకుమార్ యథావిధిగా పూజలు చేసేందుకు వెళ్లగా అక్కడున్న అరు అడుగుల ఎత్తున్న శివలింగం, వినాయగర్ విగ్రహం మాయమైనట్లు గుర్తించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు స్వామి కొండ పోలీసులు బుధవారం ఉదయం ఆలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ఆ సమయంలో, ఆలయ సముదాయంలో వినాయకుని విగ్రహం కనుగొనబడింది; శివలింగం రాతి విగ్రహం దొరకలేదు. పోలీసులు విచారిస్తున్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖకు ఏటా రూ.24వేల కోట్లు


కలైంజ్ఞర్ విగ్రహ ప్రారంభోత్సవంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నెహ్రూ, మంత్రి గాంధీ, ఎమ్మెల్యేలు

తిరువళ్లూరు: డీఎంకే అధికారంలోకి వచ్చిన తరువాత ఏటా రూ.24 వేల కోట్ల వంతున మూడేళ్లలో రూ.75 వేల కోట్లు గ్రామీణభివృద్ధికి కేటాయించామని రాష్ట్ర గ్రామీణభివృద్ధి శాఖ మంత్రి నెహ్రూ తెలిపారు. తిరువళ్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలో నూతనంగా మాజీ ముఖ్యమంత్రి కలైంజ్ఞర్ విగ్రహన్ని ప్రారంభించే కార్యక్రమం మున్సిపల్ చైర్‌పర్సన్ ఉదయమలర్ పాండ్యన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రులు నెహ్రూ, రాణిపేట ఆర్.గాంధీ తదితరులు హాజరై విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 25 కార్పొరేషన్లు, 490 మున్సిపాలిటీలు, 12 వేల పంచాయతీల స్థాయిని డీఎంకే హాయాంలో పెంచామన్నారు. చెన్నై తదితర ప్రాంతాలకు తిరువళ్లూరు జిల్లాలోని పూండి, పుళల్, చెమరంబాక్కం, తేరువాయి కన్నన్‌కోట తదితర రిజర్వాయర్‌ల నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఇక్కడి రిజర్వాయర్లను మరింత బలోపేతం చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు అదనపు నీటి ఆదా కోసం చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా నిరంతరాయంగా తాగునీటిని రోజూ సరఫరా చేశామన్నారు. అనంతరం సుమారు రూ.కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను మంత్రులు పరిశీలించి, పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత తగ్గకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రభుశంకర్, ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, చంద్రన్ పాల్గొన్నారు.

శ్రీ వైకుంఠం కో-ఆపరేటివ్ సొసైటీలో అగ్నిప్రమాదం

అన్నానగర్: శ్రీ వైకుంఠం కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించింది. తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠంలోని జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆల్ వర్కర్స్ కోఆపరేటివ్ పొదుపు సంఘం ఉంది. ఈ సొసైటీకి కార్యదర్శిగా పుదుక్కుడికి చెందిన శ్రీధరన్ (52) ఉన్నారు. ఇతను మంగళవారం మధ్యాహ్నం అసోసియేషన్ కార్యాలయంలో ఉన్నారు. అతనితో పాటు పనిచేస్తున్న ఇందుచెల్వి, ఈ-సేవా కేంద్రం ఉద్యోగి భద్రకాళి బయటకు వెళ్లారు. దీంతో ఒక్కసారిగా సంఘ కార్యాలయం ప్రాంతం నుంచి భారీగా పొగలు వచ్చాయి. అగ్నిమాపక వాహనం రావడం ఆలస్యం కావడంతో కొందరు వ్యక్తులు దుకాణం తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి స్పృహతప్పిన స్థితిలో ఉన్న శ్రీధరన్ బయటకు తీసుకుని వచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు వచ్చి పరిశీలించగా మృతి చెందినట్లుగా తెలిసింది. శ్రీవైకుంఠం డీఎస్పీ మాయవన్, తహసీల్దార్ శివకుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఫోరెన్సిక్ నిపుణులు విచారణకు ఆదేశించారు.

డీజీపీ కార్యాలయం ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

అన్నానగర్: డీజీపీ కార్యాలయం ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆర్కాట్ తాలూకా రాణిపేట జిల్లాకి చెందిన 45 ఏళ్ల మహిళ 14 ఏళ్ల కూతురు తల్లిదండ్రులతో గొడవ పడి, 27 సవర్ల నగలు, రూ.28 వేలు తీసుకుని, గత 3వ తేదీన తన స్నేహితురాలితో కలిసి అలిగి వెళ్లి చెన్నైలో ఆటోడ్రైవర్‌ను ఉద్యోగం కోసం అడిగారు. ఆటో డ్రైవర్ వారిద్దరిని తీసుకెళ్లి తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడ్‌లోని ఓ ఇంట్లో ఉంచాడు. దీంతో పక్క ఇంటి వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికలను రక్షించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చగా ఇంట్లోని నగలు మాయమైన విషయమై తన కూతురిని అడగ్గా తిరువలాంగాడులోని ఇంట్లో దాచి ఉంచినట్లు చెప్పింది. ఈ విషయమై డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును రాణిపేట పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు పంపారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక తల్లి బుధవారం డీజీపీ కార్యలయం ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు ఆమెని రక్షించారు. ఆమె నుంచి ఫిర్యాదును స్వీకరించిన ఏఐజీ శ్రీరాథ, రాణిపేట ఎస్పీకి వినతిపత్రం పంపి, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. తరువాత మహిళ వెళ్లిపోయింది.

చెన్నై బీచ్- చెంగల్పట్టు మార్గంలో 55 రైళ్ల రద్దు

కొరుక్కుపేట: తాంబరం రైల్వేస్టేషన్ నిర్వహణ పనులు కారణంగా చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టు మార్గంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 55 రైళ్లను రద్దు చేశారు. దీంతో చెన్నై బీచ్- చెంగల్పట్టు మార్గంలో రైళ్ల సంఖ్య తగ్గడంతో ఉదయం పూట విధులకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులు ఒకరినొకరు తొక్కుకునే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు మధ్య వాగ్వాదాలు జరిగాయి. ఇదిలా ఉండగా గురువారం నుంచి మూడు రోజులు పాటు మళ్లీ పలు రైళ్లు రద్దు చేయబోతున్నారు.

విద్యార్థి మృతి

అన్నానగర్: కొల్లిమలైలోని ఓ హోటల్‌లో ప్రైవేట్ క్యాటరింగ్ కళాశాల విద్యార్థి ఆకస్మికంగా మృతి చెందారు. నామక్కల్‌లోని ప్రైవేట్ కాలేజ్ ఆఫ్ క్యాటరింగ్‌లో పలువురు విద్యార్థులు పలు కోర్సులు చదువుతున్నారు. ఈ కళాశాలలోని విద్యార్థులను శిక్షణ కోసం హోటళ్లకు పంపిస్తారు. ఈ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న పుదుచత్రం సమీపంలోని కల్యాణి ప్రాంతానికి చెందిన శరవణన్, రేవతి దంపతుల కుమార్తె గోపిక (17)తో సహ విద్యార్థినులను శిక్షణ నిమిత్తం కొల్లిమలైలోని ఓ స్టార్ హోటల్‌కు పంపారు. బుధవారం గోపిక అక్కడ హఠాత్తుగా వాష్ రూమ్‌లో స్పృహతప్పి పడి మృతి చెందినట్లుగా హోటల్ యాజమాన్యం ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మరోవైపు విద్యార్థిని గోపిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నామక్కల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ పరిస్థితిలో విద్యార్థిని మృతి అనుమానాస్పదంగా ఉందని గ్రామస్తులు, బంధువులు మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించి ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.

రైలులో మహిళల నగలు చోరీ

తిరువొత్తియూరు: ముంబయి నుంచి చెన్నైకి వస్తున్న రైలులో మత్తు మందు కలిపిన టీ ఇచ్చి ఇద్దరు మహిళల వద్ద బంగారు నగలు చోరీ చేసిన దుండగులు కోసం పోలీసులు గాలిస్తున్నారు. కడలూరు జిల్లా మదియనూర్ ప్రాంతానికి చెందిన తమిళసెల్వి (44), రోహిణి(56) తదితరులు ముంబయిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ముంబయి-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఇంటికి బయలుదేరారు. అదే బోగిలో ఉన్న 35 ఏళ్ల వయస్సున్న ముగ్గురు వ్యక్తులు మహిళలతో స్నేహంగా ఉన్నట్లు నటించారు. తర్వాత తమ వద్ద ఉన్న ఫ్లాస్క్‌లో టీ పోసి అందరికీ ఇచ్చారు. టీ తాగిన తరువాత ఇద్దరు మహిళలు స్పృహ కోల్పోయారు. ఇది గమనించిన వ్యక్తులు మహిళలు ధరించి ఉన్న తాళి సరుడు, కమ్మలు, ఉంగరం తదితర నగలను లాక్కొని పారిపోయారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ముంబయి, నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ రైలు అరక్కోణం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఆ తర్వాత ఇద్దరు మహిళలు మైకం నుంచి లేచి చూడగా వారి మెడలోని తాళి సరుడు, కమ్మలతో సహా ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించడం చూసి దిగ్భ్రాంతి చెంది కేకలు వేశారు. ఈ విషయం తెలుసుకున్న తోటి ప్రయాణికులు అరక్కోణం రైల్వేస్టేషన్‌లో దిగి, ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ యజమాని కిడ్నాప్

వేలూరు: పట్టణ సమీపంలోని రియల్ ఎస్టేట్ యజమానిని కిడ్నాప్ చేసిన ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. చెన్నై అరుంబాక్కం ప్రాంతానికి చెందిన కాళిదాస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతను వేలూరు జిల్లా కన్నియంబాడి సమీపంలోని కన్నికోయల్ వద్ద స్థలాన్ని కొనుగోలు చేసి స్థలాన్ని శుభ్రం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు సిద్ధం చేసి, కడలూరుకు చెందిన శ్రీధరన్‌ను వాచ్‌మన్‌గా నియమించాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చెన్నైకి చెందిన ఇబ్రహీంతో పాటు మరో ఇద్దరు కన్నియంబాడిలోని కాళిదాస్ రియల్ ఎస్టేట్ స్థలం వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో ఇబ్రహీంతోపాటు మరో ఇద్దరు కలిసి కాళిదాస్‌తో ఘర్షణ పడుతూ కాళిదాస్‌ను కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఈ విషయమై వాచ్‌మన్ శ్రీధరన్ వేలూరు నార్త్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరపగా కాళిదాస్‌ను ముగ్గురు వ్యక్తులు కిడ్నాప్ చేసి పుదుచ్చేరిలోని ఒక గదిలో ఉంచినట్లు తెలియడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ చేసిన ఇబ్రహీంతో పాటు మరో ఇద్దరిని పోలీసులు గాలిస్తున్నారు.

వంతెన కోసం తవ్వి గుంతలో పడి ఎలక్ట్రీషియన్..

అన్నానగర్: బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడి ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. మైలాడుదురై నుంచి తిరువారూర్ వరకు హైవే విస్తరణ ఎలంతంగుడి వద్ద చిన్న వంతెన నిర్మాణం కోసం తవ్విన కందకానికి సరిపడా అడ్డుకట్టలు వేయలేదు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న వాళువూరుకు చెందిన ఇలాంగో కుమారుడు మణికంఠన్ (25) మైలాడుదురై నుంచి మంగళవారం రాత్రి 11 గంటలకు బైక్‌పై ఇంటికి వస్తూ ఆ గుంతలో పడిపోయాడు. ఇందులో మణికంఠన్‌తల వంతెన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కంబికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పెరంబూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీళ్ల బకెట్‌లో పడి చిన్నారి..

అన్నానగర్: నీళ్ల బకెట్ పడి ఏడాదిన్నర చిన్నారి మృతి చెందాడు. బీహార్‌కు చెందిన మహ్మద్ సాధిక్ (46)కు ఆరుగురు పిల్లలు ఉన్నారు. చెన్నైలోని అరుంబాక్కం ఎంఎండీఏ కాలనీ ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం కుటుంబసభ్యులు ఇంట్లో మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో ఏడాదిన్నర కుమారుడు మహ్మద్ ఇంట్లో ఆడుకుంటూ కనిపించలేదు. దీంతో చిన్నారి కోసం తల్లిదండ్రులు వెతికారు. అప్పుడు ఇంట్లోని నీళ్ల బకెట్‌లో మునిగి చిన్నారి మృతి చెంది ఉండటాన్ని చూసి షాక్ తిన్నారు. వెంటనే కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి పరీక్షించగా అప్పటికే మహ్మద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అరుంబాక్కం పోలీసులు కేసు నమోదు చేసి చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్‌పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి పటిష్ట పోలీస్ బందోబస్తు


కాట్పాడిలో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు

వేలూరు: స్వాతంత్ర దినోత్సవానికి వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వాతంత్ర దినోత్సవం గురువారం దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో ఎటువంటి తీవ్రవాద శక్తులు జిల్లాలకు రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా ఎస్పీ మణివన్నన్ అధ్యక్షతన వేలూరు జిల్లాలోని బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, సీఎంసీ ఆస్పత్రి తదితర ప్రధాన స్థలాల్లో పోలీసులు నిఘా ఉంచారు. చెన్నై, బెంగళూరు మీదుగా వెళ్లే రైలులోని ప్రయాణికుల బోగిలోనికి వెళ్లి బ్యాగులను తనిఖీ చేసి పంపుతున్నారు. అలాగే అనుమానంగా కనిపించే వ్యక్తులను విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఎస్పీ మణివన్నన్ ఆంధ్ర సరిహద్దులో ఉన్న చెక్ పోస్టు వద్ద ఆకస్మికంగా వాహనాలు తనిఖీ చేపట్టారు.

నిర్మాణ సంస్థకు రూ. 2 లక్షల జరిమానా

కొరుక్కుపేట: ప్లాట్ ఆక్యుపెన్సీ ప్రాజెక్టును సక్రమంగా పూర్తి చేయనందున నిర్మాణ సంస్థకు రియల్ ఎస్టేట్ కమిషన్ రూ.2 లక్షల జరిమానా విధించింది. పాయింట్ టెక్నాలజీ చెన్నైలోని షోలింగనల్లూరులో మినిస్టర్ సిగ్నేచర్ విల్లాస్ పేరుతో రెసిడెన్షియల్ ప్రాజెక్టును నిర్మిస్తోంది. ఇందులో షర్మిలీ బ్యాచ్ నిల్సన్ ఓ ఇంటిని కొనుగోలు చేసింది. నిర్మాణ పనులు సక్రమంగా పూర్తి కాలేదని, వివిధ సౌకర్యాలు అసంపూర్తిగా ఉన్నాయని రియల్ ఎస్టేట్ కమిషన్‌కు షర్మిలీ బ్యాచ్ నిల్సన్ ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారించిన కమిషన్ 2023లో రియల్ ఎస్టేట్ చట్టం కింద సగంలో నిలిచిన సౌకర్యాలను సక్రమంగా పూర్తి చేయాలని కోరింది. పాయింట్ టెక్నాలజీ నిర్మాణ సంస్థ ఆదేశాలను అమలు చేయకపోవడంతో రియల్ ఎస్టేట్ కమిషన్ ముందు కేసు మళ్లీ విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ సునీల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రియల్ ఎస్టేట్ కమిషన్‌తో నిర్దిష్ట నిర్మాణ ప్రాజెక్టును వెంటనే నమోదు చేయాలి. ఈ ప్రాజెక్టు కోసం పొందిన పూర్తి ధ్రువీకరణ పత్రాన్ని కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించింది. అలాగే రియల్ ఎస్టేట్ చట్టంలోని నిబంధనలు ఉల్లంఘించినందుకు కంపెనీకి రూ.2 లక్షల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మొత్తాన్ని సెప్టెంబర్ 30వ తేదీ లోగా చెల్లించాలని పేర్కొంది. అలాగే ఈ నిర్మాణ సంస్థపై క్రిమినల్ ఫిర్యాదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఈమేరకు ఉత్తర్వుల్లో పేర్కొంది.

వైభవంగా ఉద్దికేశులమ్మ తిరునాళ్ల


తిరువీదుల్లో ఊరేగుతున్న ఉద్దికేశులమ్మ

నాగలాపురం: గ్రామ దేవత ఉద్దికేశులమ్మ జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని వేకువజామున శుద్ధి చేసి, విద్యుత్‌దీప అలంకరణతో, వివిధ రకాల పూలు, వేపాకు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణలో మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి మొక్కులును చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు జానకిరామన్ ఉద్దికేశులమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం సాయంత్రం 7.30 గంటలకు ఉద్దికేశులమ్మ ఉత్సవమూర్తికి విశేషాలంకరణ చేసి ఊరేగించారు. ఎస్‌ఐ ఓబయ్య బందోబస్తు నిర్వహించారు.

ఎంవీఐ కార్యాలయంలో ఏసీబీ సోదాలు


తిరుత్తణి ఎంవీఐ కార్యాలయంలో సోదాలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తిరుత్తణి: పట్టణంలోని మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో లెక్కకు రాని రూ.1.46 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తిరుత్తణి సమీపంలోని చెన్నై -తిరుపతి జాతీయ రహదారిలో మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో తిరువళ్లూరు విజిలెన్స్ డీఎస్పీ రామచంద్రమూర్తి ఆధ్వర్యంలోని ఏసీబీ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. దాదాపు మూడు గంటల పాటు నిర్వహించిన తనిఖీల్లో లెక్కకు రాని రూ.1.46 లక్షల నగదు, రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. లెక్కకు రాని నగదుకు సంబంధించి మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ రాజరాజేశ్వరిని విచారణ జరుపుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత సైకిళ్ల పంపిణీ


కేజీ.కండ్రిగ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: ఆర్కేపేట, తిరుత్తణి ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే చంద్రన్ బుధవారం ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. తిరుత్తణి సమీపంలోని కేజీ.కండ్రిగ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ప్లస్-1 విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం డీఈఓ ఆనందరసన్ అధ్యక్షతన నిర్వహించారు. హెచ్ఎం దామోదరన్, పీటీఏ అధ్యక్షుడు రమేష్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొని, 91 మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షురాలు నిరోష, డీఎంకే మండల కార్యదర్శి ఆర్తి రవి, యూనియన్ కౌన్సిలర్ జ్యోతి చిరంజీవులు, ఏహెచ్ఎం ముకుందయ్య పాల్గొన్నారు. అలాగే ఆర్కేపేట యూనియన్‌లోని వంగనూరు, ఆర్కేపేట, బాలాపురం, శ్రీకాళికాపురం, వెడియంగాడు ప్రాంతాల్లోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలల విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు.

యువతిపై సామూహిక లైంగిక దాడి

- బాలుడి సహా నలుగురి అరెస్టు

తిరువొత్తియూరు: యువతిపై సామూహిక లైంగిక దాడి చేసిన బాలుడి సహా నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తంజావూరు జిల్లా వరత్తనాడు సమీపంలోని పాపనాడు తెర్కు కోటయ్యకి చెందిన కవి దాసన్ (25) అదే జిల్లాకు చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈమె చెన్నైలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తోంది. ఈక్రమంలో యువతి సెలవు కోసం మూడు రోజుల క్రితం ఊరికి వచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో యువతి ఇంటికి ఎదురుగా ఎవరూ లేని కొట్టం వద్దకు రప్పించాడు. అక్కడ వెళ్లిన యువతికి కవిదాసన్, అతని స్నేహితులు పాపానాడుకు చెందిన దివాకర్, ప్రవీణ్, 17 సంవత్సరముల బాలుడు బీర్ బాటిల్, కత్తిని చూపించి బెదిరించి సామూహిక అత్యాచారం చేశారు. అలాగే ఈ లైంగిక దాడిని ఒకరు సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. దీనికి సంబంధించి బాధిత యువతి వరత్తనాడు మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కవిదాసన్, దివాకర్, ప్రవీణ్, 17 ఏళ్ల మైనర్ యువకుడుని బుధవారం అరెస్టు చేశారు. ఎస్పీ ఆశిష్ రావత్ వరత్తనాడు ఏఎస్పీ సగునాల్ బాధిత యువతితో మాట్లాడి వివరాలు సేకరించారు. నేరస్తులు నలుగురిని పోలీసులు బుధవారం వరత్తనాడు కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

కూలిన తరగతి గది పైకప్పు


కూలిపడిన తరగతి పైకప్పు

అన్నానగర్: తరగతి గది పైకప్పు కూలిపోవడంతో విద్యార్థులు భయాందోళన చెందారు. పుదుకోట్టై జిల్లా, మేట్టుపట్టి పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌లో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు 167 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల భవనాన్ని 25 ఏళ్ల క్రితం నిర్మించారు. బుధవారం ఉదయం పాఠశాల తెరిచిన సమయంలో ఏడో తరగతి గది పైకప్పు కూలిపోయింది. దీంతో షాక్‌కు గురైన విద్యార్థులు తరగతి గది బయటనే నిలబడి పోయారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాల ముందు గుమిగూడారు. విద్యార్థులు తరగతి గదిలోకి వస్తుండగా పాఠశాల హాలు పైకప్పు కూలిపోయింది. శబ్దం విని భయాందోళనకు గురైన విద్యార్థులు బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది.

గ్రీన్ పార్కు నిర్మాణానికి సంతకాల ఉద్యమం

కొరుక్కుపేట: కోయంబేడు బస్‌స్టేషన్ కీలంబాక్కం ప్రాంతానికి మారడంతో ఆ ప్రాంతాన్ని గ్రీన్‌పార్కుగా మార్చేందుకు ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హరిత జన్మభూమి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆ సంస్థ చేపట్టింది. బుధవారం చెన్నై అమింజికరై ఎంఎండీఏ కాలనీలోని పామాకా అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రామదాస్ తొలి సంతకం చేసి ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు పార్కులు ఏర్పాటు చేయాలని రామదాస్ తెలిపారు. చెన్నైలో సెమ్మొళి పార్కు మాత్రమే పెద్దదని, ఇతర పార్కులు చిన్నవని, గ్రీన్ పార్కులు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయని పేర్కొన్నారు. తమిళనాడులో 67 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని, నడక, శారీరక శిక్షణ లేకపోవడంతోనే అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. పార్కులు లేకపోవడంతోనే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కోయంబేడు బస్టాండ్ ప్రాంతంలో భారీ పార్కును రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పార్కుకు దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరుకూడా పెట్టవచ్చని, చెన్నైలో ప్రజల నుంచి సంతకాలు తీసుకుని ముఖ్యమంత్రికి ఈ వినతిపత్రం ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

రూ.1.50 కోట్లతో హాస్టల్ భవనం ఏర్పాటు


వేలూరులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు: పట్టణంలోని తొర్రపాడిలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన హాస్టల్ భవనాన్ని సీఎం స్టాలిన్ రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా బుధవారం ఉదయం ప్రారంభించారు. తొర్రపాడిలో ఆది ద్రావిడ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినుల కోసం నూతనంగా మూడంతస్తుల భవనాన్ని నిర్మించారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎంపీ కదీర్ ఆనంద్, ఎమ్మెల్యే అములు, మేయర్ సుజాత, కమిషనర్ జానకి స్థానికంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ హాస్టల్‌లో భవనంలో వాచ్‌మన్ గది, ఆహారం తయారు చేసే కేంద్రం, విద్యార్థులు బస చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లును సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం ఆమె హాస్టల్ భనాలను తనిఖీ చేశారు.

ఇరుగు పొరుగు

17న ఉపరాష్ట్రపతి పర్యటన


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ నెల 17వ తేదీన రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్ఓ పెంచల కిషోర్‌తో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి నెల్లూరు జిల్లా వెంకటాచలం వద్ద స్వర్ణ భారత ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి హాజరు కానున్నట్లు వెల్లడించారు. రేణిగుంట నుంచి ఆయన హెలికాప్టర్‌లో వెంకటాచలం వెళ్లనున్నట్లు చెప్పారు.. అలాగే ఈ నెల 19వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు శ్రీసిటీని సందర్శించనున్నట్లు వివరించారు. వీవీపీల పర్యటనలకు పకడ్బందీ భద్రత కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీలు వెంకట్రావు, విమల కుమారి, సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, సివిల్ సప్లయి మేనేజర్ వై.సుమతి, డీఎంహెచ్ఓ శ్రీహరి, శ్రీసిటీ జీఎం నారాయణ భగవన్, ఏపీఐఐసీ జెడ్ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గజరాజుపై ద్రౌపదీదేవి విహారం


గెరిగకు పూజ చేస్తున్న మహిళలు

పుత్తూరు: పట్టణంలో ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గజ వాహనంపై ద్రౌపదీదేవి విహరించారు. ఇంటింటి వద్ద భక్తులు అమ్మవారికి కర్పూరహారతులిచ్చారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు హేమాచలంబాబు ఆధ్వర్యంలో మంచినీళ్ల గుంట వద్ద నుంచి గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొంది. గెరిగ జలాలతో స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి, పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఈశ్వరాపురం దళిత సంఘం ఆధ్వర్యంలో గాండీవ రాజసూయయాగం ఘట్టం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ద్రౌపదీ సమేత అర్జునుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి గజవాహనంపై కొలువుదీర్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గజవాహనం ఊరేగింపు నిర్వహించారు. ఇంటింట స్వామి అమ్మవార్లకు నారికేళ్ల కర్పూర నీరాజనాలు సమర్పించారు.

▸▸ పలమనేరుకు చెందిన రాజేశ్వరి, మహిళా గ్రూపులోని ఆర్పీ మాటలు నమ్మి అప్పులు తెచ్చి రూ.1.90 లక్షలు డాయ్ యాప్‌లో కట్టి మోసపోయింది. ఇదంతా తన భర్తకు తెలియకుండా చేసింది. ఇప్పుడు భర్త ఆమెతో గొడవపడి, ఇంటి నుంచి తరిమేశాడు.

▸▸ పట్టణానికి చెందిన అనిల్‌కుమార్ అప్పు చేసి మరీ రూ.93 వేలను యాప్‌లో కట్టి పోగొట్టుకున్నాడు.

▸▸ స్థానిక కొత్తపేటకు చెందిన భాగ్యలక్ష్మి బంగారాన్ని తాకట్టు పెట్టి ఇందులో రూ.లక్ష కట్టింది.

▸▸ భర్తలేని వసంతి చిన్నకొట్టు ద్వారా జీవనం సాగిస్తూ ఇందులో రూ.3 లక్షలు పోగొట్టుకుంది. ఇంకా అనురాధ, వాణి, దివ్యలే కాదు జిల్లాలోని వేలాదిమంది గొలుసుకట్టు యాప్‌ల ద్వారా కోట్లాది రూపాయలు మోసపోయారు.


పోలీస్ స్టేషన్ వద్ద డాయ్ యాప్ బాధితులు

గొలుసుకట్టు.. కొల్లగొట్టు

- చైన్ లింక్‌కు మోసపోయిన మహిళలు
- బంగారు తాకట్టుపెట్టి, అప్పులు చేసి కట్టారు
- జిల్లాలో కోట్లు పోగొట్టుకున్న బాధితులు
- కొంపలు ముంచుతున్న మాయదారి యాప్‌లు


యాప్ వారు పేరిట స్థానిక నిర్వాహకులు జారీచేసిన ఐడీ కార్డు

పలమనేరు: మున్సిపాలిటీలోని మెప్మా కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా రాజేష్ పనిచేస్తున్నాడు. ఇతని స్నేహితుడు పట్టణానికే చెందిన ఓ హోటల్ యజమాని ద్వారా బయటి వ్యక్తుల ద్వారా డాయ్ యాప్ కథ మొదలైంది. రాజేష్ పనిచేసే కార్యాలయంలో 26 వార్డులకు చెందిన 40మంది దాకా ఆర్పీ(రిసోర్స్‌పర్సన్)లున్నారు. వీరి ఆధ్వర్యంలో పట్టణంలోని పది వేలమంది గ్రూపు సభ్యులు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. తొలుత కార్యాలయంలోని ఆర్పీలు, సీవోలను ఇందులోకి దించి వారికి నిత్యం డబ్బులు ఖాతాలోకి వచ్చేలా చేశారు. వీరి ద్వారా గ్రూపుల్లోని మహిళలను ఇందులోకి వచ్చేలా చేసి మోసానికి పాల్పడ్డారు.

ఇప్పటికే పలు చోట్ల ఇదేతరహా మోసాలు

పలమనేరులో జరిగినట్టే చిత్తూరులోనూ యాప్ మోసం తాజాగా బయటపడింది. ఇక్కడే కాక గుంటూరు, అనంతపూర్, తెలంగాణాలోని పలుచోట్ల గతంలో యాప్ మోసాలు జరిగినట్టు తెలుస్తోంది. దీంతో అక్కడి పోలీసులు సైతం యాప్‌లను నమ్మి మోసపోరాదంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో కొన్నాళ్లపాటు స్థానికుల ద్వారా యాప్ కార్యకలాపాలను నిర్వహించి ఆపై యాప్‌ను మాయం చేస్తున్నారు. మోసపోయామని గమనించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయుంటుంది. పలమనేరులో ఈ నెల 21న యాప్ కనిపించకుండా పోయే నాటికి దీని బారిన వేలాది మంది పడినట్లు తెలుస్తోంది.

ఏఐ టెక్నాలజీతో నడిచేయాప్

డాయ్ యాప్ సాధరణ ప్లేస్టోర్‌లా కాకుండా లింక్‌ద్వారా మాత్రమే ఇన్‌స్టాల్ అవుతుంది. ఇది పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నడుస్తుంది. మనకు యాప్ నుంచి వచ్చే కాల్స్ కేవలం వినేందుకు మాత్రమే మాట్లాడేందుకు వీలు కాదు. వీటికి ఎలాంటి అనుమతులుండవు. కేవలం సిస్టమ్ ద్వారా ఎక్కడినుంచో మొత్తం నెట్‌వర్క్ జరుగుతుంది. ఇందులో కాస్త తెలివైన వారిని మేనేజర్‌గా నియమించుకొని మొత్తం వ్యవహారాన్ని నడుపుతుంటారు. మొదట్లో జనానికి ఆశచూపి క్రెడిట్ అవుతున్న మొత్తం భారీ స్థాయిలో చేరే సరికి యాప్‌ను కనిపించకుండా చేసేస్తారు. ఆపై ఏమీ చేసినా యాప్ కనిపించదు. ఎవరిని సంప్రదించాలో తెలియదు.

డాయ్ యాప్ ఘటనపై విచారణ కమిటీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలమనేరులో జరిగిన డాయ్ యాప్ ఘటనపై విచారణ కమిటీని నియమించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పలమనేరు ప్రాంతంలో డాయ్ యాప్ వలలో బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మెప్మా పీడీ ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించామన్నారు. కమిటీలో రెవెన్యూ శాఖ తరపున డిప్యూటీ తహసీల్దార్, పోలీసుశాఖ తరపున సీఐ సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఈ కమిటీ ఈ నెల 29, 30 తేదీల్లో పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి కార్యాలయపు పనివేళల్లో విచారణ జరుపుతుందన్నారు. డాయ్ యాప్ బాధితులు విచారణ కమిటీకి ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ వెల్లడించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

'డాయ్' బాధితులకు బెదిరింపులు

- చైన్ లింక్‌లో 'మెప్మా' పేరు వాడొద్దంటూ హుకుం
- రూ.30 లక్షల వరకు మహిళలకు కుచ్చు టోపీ
- 'లక్కీ' వారియర్ వాట్సప్ గ్రూప్ పేరిట లావాదేవీలు



చిత్తూరు అర్బన్: సామాన్యుల ఆశను ఆధారంగా చేసుకుని రూ.కోట్లలో దోచుకున్న 'డాయ్' (డాటామీర్ ఏఐ) సంస్థ బాధితులు చిత్తూరు నగరంలోనూ వెలుగు చూస్తున్నారు. పలమనేరు పట్టణంలో వెలుగు చూసిన ఈ భారీ మోసంలో దాదాపు రూ.30 కోట్ల వరకు బాధితుల నుంచి రాబట్టుకున్న డాయ్ సంస్థ బోర్డు తిప్పేసిన విషయం తెలిసిందే. దీని బాధితులు చిత్తూరులో కూడా ఉన్నారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)లో పనిచేసే ఓ ఉద్యోగి పాత్ర ఇందులో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవో) కొందరు ఈ స్కీమ్‌లో చేరి మహిళలపై ఒత్తిడి పెంచి డాయ్ సంస్థలో పెట్టుబడులు పెట్టించినట్లు తెలుస్తోంది. ఈ చైన్‌లింక్ ద్వారా రూ.30 లక్షలకు పైగా నగదు పోగొట్టుకున్నట్లు పలువురు స్వయం సహాయక మహిళలు ఆరోపిస్తున్నారు. మొబైల్‌ఫోన్ యాప్‌లలో వచ్చే పలు ప్రకటనలకు రేటింగ్ ఇచ్చి.. కొద్ది మొత్తం పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తుందనే అత్యాశతో ఈ సంస్థలో పెద్ద సంఖ్యలో మహిళలు చేరి, బాధితులుగా మారారు. యాప్‌లో ఒకర్ని చేర్చి, వారు మరో పది మందిని ఇందులో చేర్పిస్తే కమిషన్ రూపంలో పెద్ద మొత్తంలో నగదు వస్తుందనే మరో మోసానికి కూడా తెరతీశారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని ఇద్దరు ఉద్యోగులను నమ్మిన మహిళా సంఘాల సభ్యులు రూ.30 లక్షల వరకు ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయారు. ప్రధానంగా మహిళా సంఘాలను పర్యవేక్షించే కొందరు రిసోర్స్ పర్సన్లు కమిషన్‌కు ఆశపడి పెద్ద సంఖ్యలో మహిళల్ని ఇందులో సభ్యులుగా చేర్పించారు. కార్పొరేషన్‌కు చెందిన మహిళా మార్టు, స్వయం సహాయక సంఘాల్లోని పలువురు సభ్యులు ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టడానికి పెద్ద మొత్తంలో అప్పులు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఆటో నడుపుతున్న వ్యక్తి భార్య ఒకరు తన చుట్టుపక్కల మహిళల ద్వారా రూ.10 లక్షలను డాయ్ కంపెనీలో పెట్టుబడిగా పెట్టినట్లు వెలుగుచూసింది. ఈ మోసం బయటకు పొక్కడంతో చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ మెప్మా పేరు ఎక్కడా వాడొద్దని, ఎదైనా ఉంటే పలమనేరు వెళ్లి తేల్చుకోవాలని ఓ ఉద్యోగి బాధిత మహిళల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పలువురు బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

రూ.3 వేలకు వారంలో రూ.5,292

డాయ్ యాప్‌లో సభ్యులుగా చిత్తూరుకు చెందిన మహిళల్ని పెద్ద సంఖ్యలో చేర్పించడంలో మెప్మాలోని ఉద్యోగితో పాటు కొందరు ఆర్పీలు కీలకంగా వ్యవహరించినట్లు అర్థమవుతోంది. లక్కీ వారియర్ పేరిట వాట్సప్ గ్రూప్‌ను తయారుచేసి, పెట్టుబడులు పెట్టేవాళ్లను సభ్యులుగా చేర్చారు. ఎఫ్ఈ రూబోట్ పేరిట ఒక్కసారి రూ.3 వేలు పెడితే రోజుకు రూ.756 చొప్పున వారంలో రూ.5,292, రూ.7 వేలు పెడితే రూ.13,813, రూ.9 వేలు పెడితే అయిదు రోజుల్లో రూ.13,365 వస్తుందని ప్రచారం చేశారు. మహిళల ఆర్థిక బలహీనతను ఆసరాగా చేసుకుని బోర్డు తిప్పేశారు.

బాధ ఎవరికి చెప్పకోవాలో



గ్రూపుల్లో ఉండే మాకు యాప్ గురించి ఏమీ తెలీదు. మా ఆర్పీ డబ్బులు బాగా సంపాదించే మార్గమని మా చేత కట్టించారు. నేను అప్పు చేసి ఇందులో డబ్బులు కట్టా. ఇప్పుడు ఆర్పీలను అడిగితే మాకు రూ.లక్షల్లో నష్టం వచ్చింది మేమేమి చేసేదంటున్నారు. ఇంక మేము ఎవరికి చెప్పినా పోయిన డబ్బు వచ్చేలాలేదే.

– రాజేశ్వరి, గ్రూపు సభ్యురాలు, పలమనేరు

లాభం వస్తా ఉందని నమ్మి..



నాకు తెలిసిన వాళ్లు చెప్పినమాట విని రెట్టింపు లాభం ఉంటుందని డబ్బులు కట్టా. మొదట్లో కొన్ని రోజులు డబ్బులు వచ్చాయి. దీంతో ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టా. ఆపై మొబైల్‌లో యాప్ కనిపించకుండా పోయింది. అప్పుచేసిన డబ్బు మొత్తం పోయింది. ఇప్పుడు ఏమి చేయాలో.. ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచడం లేదు.

– అనిల్‌కుమార్, పలమనేరు

నగలు తాకట్టు పెట్టి కట్టా



మా ఆర్పీ చెప్పింది కాబట్టి నమ్మి ఇందులో చేరా. రోజుకి 200 వస్తా ఉంది కదా ఇంకా ఎక్కువగా డబ్బులు వస్తాయన ఆశపడ్డా. దీంతో నగలను తాకట్టు పెట్టి ఇందులో కట్టాను. ఇప్పుడు మోసపోయానని తెలిసింది. మా ఇంట్లోవాళ్లు ఎందుకు ఇలా చేశావని గొడవకు దిగారు. ఇకపై గ్రూపుల్లో అప్పు డబ్బు కట్టేందుకు కూడా కుదరకుండా పోయింది.

– భాగ్యలక్ష్మి, పలమనేరు

యాప్‌లను నమ్మి మోసపోకండి



గొలుసుకట్టు, యాప్‌లను నమ్మి డబ్బులు కట్టొద్దని ముందునుంచి చెబుతూనే ఉన్నాం. కానీ అత్యాశకుపోయి కష్టాలను కొనితెచ్చుకుంటున్నారు. సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మనం జాగ్రత్తగా ఉండాలి. ఎవరికైనా ఊరికే డబ్బులిస్తామా. దానికి గ్యారెంటీ చూస్తాం కదా ఇందులో మాత్రం ఎలా పెడతారో అర్థంకాదు. ఇకనైనా ప్రజలు ఇలాంటి వాటి జోలికెళ్లకుండా ఉండాలి.

– విష్ణు రఘువీర్, డీఎస్పీ, పలమనేరు

పట్టం కట్టినా.. ప్రాధాన్యత ఏదీ!

- నాటి నుంచి రాయలసీమ ప్రాజెక్టుల పట్ల చంద్రబాబుకు అంతులేని నిర్లక్ష్యం
- జీఎన్ఎస్ఎస్‌కు ప్రాధాన్యత ఇచ్చింది వైఎస్సార్– వైఎస్ జగన్ ప్రభుత్వాలే
- 2014–19లో చంద్రబాబు సర్కార్ నామమాత్రపు వెచ్చింపు
- గండికోటకు రెండు సార్లు శిలాఫలకాలు వేసిన ఘనత బాబుదే
- వైఎస్ జగన్ హయాంలో 27 టీఎంసీల నీటితో కళకళలాడిన గండికోట



'వినేవారు లోకువైతే చెప్పేవారు చంద్రబాబు' అనే నానుడి ఉంది. విపక్షంలో ఓ మాట..అధికారంలో మరోమాట మాట్లాడడం ఆయనకే చెల్లు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను చెప్పకోవచ్చు. అధికారంలో ఉంటే విస్మరించడం.. లేకపోతే ప్రాజెక్టుల సందర్శనంటూ హంగామా చేయడం జిల్లా వాసులకు ఎరుకే. గండికోట ప్రాజెక్టు నిర్మాణానికి 1996, 1999 ఎన్నికలకు ముందు రెండుసార్లు శంకుస్థాపన చేయడం మినహా, ఆ ప్రాజెక్టు నిర్మాణం పట్ల చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యమే ప్రదర్శించింది. రాయలసీమలో తమకు ఓట్లు, సీట్లు ఇవ్వరని, అందుకే అభివృద్ధి చేయలేదని ప్రకటించడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి, కడప: నిర్దిష్ట అభివృద్ధి సాధించే అవకాశం ఉన్నా సాగునీటి ప్రాజెక్టు పట్ల ఇదివరకు టీడీపీ సర్కార్ అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఈ మారైనా చిత్తశుద్ధితో సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనాలు కాంక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 1995–2004, విభజన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 2014–19లో నారా చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల పట్ల పూర్తి నిర్లక్ష్యం చూపారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులంటే మండిపడేవారు. నిన్నమొన్నటి వరకు 25 టీఎంసీల నిల్వకు కారణమైన గండికోట ప్రాజెక్టును ఉమ్మడి ఏపీలో నాన్ ప్రియారిటీ జాబితాలోకి చేర్చిన చరిత్రను కూడా చంద్రబాబునాయుడు మూట గట్టుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు నీరు చేరాలంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ ఒక్కటే మార్గమని తలచారు. అలా చేస్తేనే కాస్తో, కూస్తో రాయలసీమ ప్రాంతానికి నీరు చేరుతుందని మనస్ఫూర్తిగా నమ్మారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వైఎస్సార్ సర్కార్ పెంచుతుంటే, తెలుగుదేశం పార్టీ నేత దేవినేని ఉమామహేశ్వరావు ద్వారా అడ్డుకునే ప్రయత్నం కూడా చేపట్టారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాతైనా ఈ ప్రాంత ఉన్నతికి కృషి చేస్తారంటే ఐదేళ్ల కాలం ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టారని పలువురు గుర్తు చేస్తున్నారు.

చంద్రబాబు శంకుస్థాపనతో సరి...



గండికోట ప్రాజెక్టుకు 1996 ఫిబ్రవరి 29న ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శెట్టివారిపల్లె సమీపంలో శంకుస్థాపన చేశారు. వామికొండ వద్ద మరోమారు 1999 ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేశారు. తర్వాత ఆ ప్రాజెక్టు పట్ల ఏమాత్రం శ్రద్ధాసక్తులు చూపలేదు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.3213 కోట్లు వెచ్చిస్తే, తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కేవలం రూ.804 కోట్లు మాత్రమే వెచ్చించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) పరిధిలో రూ.4256 కోట్లు వ్యయం చేశారు. మరో రూ.454 కోట్లు నిర్వాసితులకు చెల్లించారు. పైగా 26.85 టీఎంసీల నీరు నిల్వ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకే దక్కిందని పలువురు వివరిస్తున్నారు.

▸▸ కరువు నివారణకు ప్రత్యేక ప్రణాళిక



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాయలసీమ కరువు నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం ప్రక్రియను ప్రారంభించి వేగవంతంగా పనులు చేపట్టుతోంది. 12టీఎంసీ నీరు జీఎన్ఎస్ఎస్ ద్వారా లిఫ్ట్ చేసి చిత్తూరు అన్నమయ్య జిల్లాల్లో కరువు నివారణకు శ్రీకారం చుట్టింది. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో జంగందేవరపల్లె వద్ద నీరు కలపడం ద్వారా పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, రాయచోటి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసేందుకు అనువుగా మారింది. ఇలాంటి ప్రాజెక్టుల పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించి పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత చంద్రబాబు సర్కార్‌పై ఉంది. మరోవైపు జలాశయాలు ఉన్నా, వాటి ఫలాలు క్షేత్రస్థాయిలో దక్కలేదు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ లేకపోవడమే అందుకు ప్రధాన కారణం. సీఎం చంద్రబాబు కోరినట్లుగా జిల్లాలో సీట్లు, ఓట్లు కూడా లభించాయి. ఈమారైనా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పట్ల చంద్రబాబు సర్కార్ ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

● సత్యదేవా.. అడ్డుకోవా..!

ఆన్‌లైన్ బుకింగ్‌లు

అన్నవరం దేవస్థానంలో దళారీల దందా

వివిధ సత్రాల్లో 30 శాతం రూములకు ఆన్‌లైన్ రిజర్వేషన్

వెబ్‌సైట్‌లో ఓపెన్ కాగానే రెండు నిమిషాల్లోనే చేజిక్కించుకుంటున్న వైనం

రైల్వే తత్కాల్ టికెట్లు ఓపెన్ అవగానే నిమిషాల్లో రిజర్వేషన్లు అయిపోవడం చాలా మందికి అనుభవమే. కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి టీటీడీ ఆన్‌లైన్ టికెట్లు విడుదల చేయగానే హాట్ కేకుల్లా భక్తులు తన్నుకుపోతూంటారు. ఇదీ అందరికీ తెలిసిందే. సరిగ్గా ఇదే కోవలో అన్నవరం దేవస్థానంలో పలువురు దళారీలు దందా సాగిస్తున్నారు.


ఏపీ టెంపుల్స్ వెబ్‌సైట్

అన్నవరం: భక్తవరదుడైన రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి ప్రతి రోజూ వేలాదిగా భక్తులు వస్తూంటారు. పలువురు దేవస్థానం సత్రాల్లో గదులు బుక్ చేసుకుని, రాత్రి బస ఉండి.. మర్నాడు వ్రతాలు, ఇతర పూజలు చేయించుకుని వెళ్తూంటారు. పర్వదినాలు, వివాహాల సీజన్‌లో అయితే రత్నగిరిపై సత్రం గదులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో గదులు లభ్యం కాక అనేక మంది భక్తులు కొండ దిగువన డబ్బులిచ్చుకుని ప్రైవేటు సత్రాల్లో బస చేస్తారు. అంత ఖర్చు భరించలేని వారు గత్యంతరం కొండ పైనే ఎక్కడో ఒక చోట కాలక్షేపం చేస్తూ.. ఇబ్బందులు పడుతూంటారు. ఇలా రత్నగిరిపై అవసరమైన భక్తులకు సత్రం గదులు దొరకకపోవడానికి దళారీల దందాయే కారణమవుతోంది.


ఏం జరుగుతోందంటే..

అన్నవరం దేవస్థానంలో ప్రకాష్ సదన్ మినహా మిగిలిన అన్ని సత్రాల్లో 30 శాతం గదులను ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకునే అవకాశాన్ని భక్తులకు కల్పించారు. వీటిలో రూ.200 చార్జీ చేసే సీతారామ సత్రం నుంచి రూ.1,650 అద్దె కలిగిన శివసదన్ (ఏసీ) వరకూ ఉన్నాయి. దేవస్థానంలోని అన్ని సత్రాల్లోనూ 600 గదులున్నాయి. వాటిలో ప్రకాష్ సదన్‌లోని 64 గదులు మినహా మిగిలినవి 536. వీటిలోనూ 60 గదులు మరమ్మతుల్లో ఉన్నాయి. మిగిలిన 476లో 145 గదులకు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఎక్కువగా పర్వదినాలు, వివాహాల సీజన్‌లో అధిక సంఖ్యలో భక్తులు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకుంటారు. సంబంధిత వెబ్‌సైట్‌ను అధికారులు నెల రోజులు ముందుగా అర్ధరాత్రి 12 గంటలకు ఓపెన్ చేస్తారు. అలా ఓపెన్ అయిన రెండు మూడు నిమిషాల్లోనే దేవస్థానం సత్రాల్లో ఖాళీగా ఉన్న గదులను రిజర్వ్ అయిపోతున్నాయి. ప్రధానంగా ఎక్కువ మంది దళారీలే వివిధ పేర్లతో ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. దీంతో గదులు అవసరమున్న భక్తులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

ఆన్‌లైన్ రిజర్వేషన్ ఇలా..

దేవస్థానంలో ఆన్‌లైన్‌లో గదులు రిజర్వ్ చేసుకోవడానికి గూగుల్‌లో ఏపీటెంపుల్స్.ఏపీ.జీఓవీ.ఇన్ అని ఇంగ్లిషులో టైపు చేస్తే సంబంధిత సైట్ ఓపెన్ అవుతుంది. అందులో రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవస్థానాల వివరాలు కనిపిస్తాయి. 'శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, అన్నవరం' మీద క్లిక్ చేస్తే వెంటనే సత్యదేవుని సన్నిధిలో అకామిడేషన్, దర్శనం తదితర ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో 'అకామిడేషన్' క్లిక్ చేస్తే దేవస్థానంలో వివిధ సత్రాలు, వాటిలో ఖాళీ గదుల వివరాలు కనిపిస్తాయి. వెంటనే ఏ సత్రంలో గది కావాలో క్లిక్ చేస్తే వెంటనే ఆధార్ నంబర్ అడుగుతుంది. ఆ నంబర్ అప్‌లోడ్ చేసిన వెంటనే సంబంధిత ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని అప్‌లోడ్ చేయగానే యూజర్ ఐడీ వస్తుంది. దాని ద్వారా రూము కోసం అప్లికేషన్ వస్తుంది. అందులో వివరాలు పొందుపరచాలి. ఒక ఆధార్ కార్డుతో నిర్దేశిత మొత్తం చెల్లించి, ఒక రూము మాత్రమే రిజర్వ్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఒక యూజర్ ఐడీతో మరో ఆధార్ కార్డు అప్‌లోడ్ చేసి, మరో రూము తీసుకునే అవకాశం కూడా ఉంది.

దళారీలకు అడ్డుకట్ట వేయాలి



అన్నవరం దేవస్థానంలో ఆన్‌లైన్‌లో వసతి గదులు రిజర్వ్ చేసుకునే భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కొందరు దళారులు వెబ్‌సైట్‌లో రూములు ఓపెన్ అయిన వెంటనే నిమిషాల వ్యవధిలోనే రిజర్వ్ చేసుకుంటున్నారు. అటువంటి దళారీలకు అడ్డుకట్ట వేసి, అవసరమైన భక్తులకే గదులు లభ్యమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కొండపల్లి అప్పారావు, భక్తుడు, అన్నవరం

అంతా నిమిషాల్లోనే..

సాధారణంగా ఎవరైనా సత్రం గదుల రిజర్వేషన్ కోసం ఈ ప్రొసీజర్ అంతా పూర్తి చేసి, రూమ్ రిజర్వ్ చేసుకోవడానికి కనీసం ఐదు నిమిషాలు పడుతుంది. అయితే సైట్ ఓపెన్ అయిన రెండు నిమిషాల్లోనే దళారీలు పలువురి ఆధార్ కార్డులు ఉపయోగించి రూములు రిజర్వ్ చేసేసుకుంటున్నారు. దీంతో మిగిలిన వారికి గదులు దొరకడం లేదు. అంతే కాదు.. ఒక్కోసారి దేవస్థానంలోని ఉద్యోగులకు కూడా ఆన్‌లైన్‌లో గదులు లభ్యం కాని పరిస్థితి. అటువంటి వారికి ఆ దళారీలు ఎర వేసి, దేవస్థానం గదులు ఇస్తూ.. వారి నుంచి అధిక మొత్తాలు గుంజుతున్నారు. వచ్చే నెల ఆరో తేదీ నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతోంది. ఆ మాసంలో ఎక్కువగా వివాహాలు జరగనున్నాయి. ఆ వివాహ ముహూర్తాలున్న తేదీల్లో ఇప్పటికే 30 శాతం గదులూ రిజర్వ్ అయిపోయాయి. అలా రిజర్వ్ చేసుకున్న వారు పెళ్లి బృందాలే అనుకుంటే పొరపాటే. దళారీలే పలువురి ఆధార్ కార్డులతో ఈ గదులు హస్తగతం చేసేసుకున్నారు. వివాహాల సీజన్‌లో విష్ణు సదన్ హాల్స్‌కు దగ్గరగా ఉండే హరిహర సదన్, సీతారామ, న్యూ సీసీ, ఓల్డ్ సీసీ వంటి సత్రాల్లోను గదులకు చాలా డిమాండ్ ఉంటుంది. దీనిని దళారీలు ఆన్‌లైన్ వేదికగా 'క్యాష్' చేసుకుంటున్నారు.

ఏం చేయాలంటే..

దళారీలకు అడ్డుకట్ట వేసేందుకు దేవస్థానం పలు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఎవరి ఆధార్‌తో గదులు రిజర్వ్ చేశారో వారి ఆధార్ కార్డు నకలు ఎవరు తెచ్చి చూపించినా రూము ఇచ్చేస్తున్నారు. దీనికి బదులు ఎవరి ఆధార్ కార్డుతో గది రిజర్వ్ చేసుకున్నారో ఆ వ్యక్తే స్వయంగా సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయానికి (సీఆర్ఓ) వచ్చి, ఆధార్ కార్డు చూపించి, గది తీసుకోవాలనే నిబంధన పెట్టాలని పలువురు సూచిస్తున్నారు. అలాగే, సత్రం గదుల రిజర్వేషన్‌కు గతంలో గది అద్దెలో 150 శాతం వసూలు చేసేవారు. ప్రస్తుతం 100 శాతం మాత్రమే వసూలు చేస్తున్నారు. అంటే సీఆర్ఓకు వచ్చి అద్దెకు తీసుకుంటే ఎంత చెల్లించాలో రిజర్వేషన్ చేయించుకున్నా అంతే మొత్తం చెల్లిస్తున్నారు. దీనిని 150 అంటే అద్దె కన్నా 50 శాతం ఎక్కువ వసూలు చేస్తే దళారీలకు కాస్త అడ్డుకట్ట పడుతుందని అంటున్నారు.


దుర్గావతి


విప్లవ వనిత

మూడేళ్ల కొడుకును పణంగా పెట్టి...

భగత్‌సింగ్‌ను కాపాడిన భాభీ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌వీర్... వీరంతా ఆమెను 'దుర్గా భాభీ' అని పిలిచేవారు. సాయుధ పోరాటంతోనే బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టగలం అని భావించిన దళంలో పిస్తోల్ పట్టిన తొలి విప్లవ వనిత దుర్గావతి దేవి. బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను హత్య చేసిన భగత్‌సింగ్‌ను లాహోర్ నుంచి తప్పించేందుకు అతడి భార్య అవతారం ఎత్తిందామె. చరిత్ర పుటలలో కనుమరుగై పోయిన ఆ త్యాగమయి గురించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

'సైమన్ గోబ్యాక్' నిరసన కార్యక్రమం చేస్తున్న లాలా లజపతిరాయ్ మీద బ్రిటిష్ పోలీసుల లాఠీచార్జ్ జరిగి ఆయన ప్రాణం పోయింది. పంజాబ్‌లో యువతకు మార్గదర్శిగా ఉన్న ఆ మహా నాయకుణ్ణి కోల్పోయినందుకు 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' (హెచ్‌ఎస్‌ఆర్‌ఏ) సభ్యులకు ఆగ్రహం వచ్చింది. ఇది స్వాతంత్ర్య సమరయోధుడు భగవతి చరణ్ ఓహ్రా నడుపుతున్న గ్రూప్. చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తదితరులంతా ఇందులో సభ్యులు. వీరంతా కలిసి లాఠీచార్జిని ఆర్డర్ వేసిన బ్రిటిష్ ఆఫీసర్ స్కాట్‌ను చంపాలనుకున్నారు. నిర్ణయం అమలు పరచడమే తరువాయి.


టెలివిజన్ ఎపిసోడ్‌లో భగత్‌సింగ్, దుర్గా భాభీ

స్కాట్ బదులు సాండర్స్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు 17 డిసెంబర్ 1928న లాహోర్‌లో పోలీస్ ఆఫీసర్ స్కాట్‌ను హతమార్చడానికి సిద్ధమయ్యారు. అయితే బైక్ మీద రావాల్సిన స్కాట్ కారులో, కారులోనూ రావాల్సిన మరో అధికారి సాండర్స్ బైక్ మీద రావడంతో అయోమయం నెలకొంది. అయినా సరే ఎదురుపడిన సాండర్స్‌పై మొదట రాజ్‌గురు, ఆ తర్వాత భగత్ సింగ్ తుపాకీ పేల్చి అతణ్ణి హతమార్చారు. లాహోర్ అంతా గగ్గోలు రేగింది. వందలాది మంది పోలీసులు అన్ని దారులు... బస్టాండ్లు... రైల్వేస్టేషన్లు కమ్ముకున్నారు. లాహోర్‌లో ఉండటం భగత్‌సింగ్‌కు ఏ మాత్రం మంచిది కాదు. అతణ్ణి తప్పించేవారు ఎవరు?

ఆమె వచ్చింది

భగవతి చరణ్ ఓహ్రా సతీమణి దుర్గావతిని అందరూ దుర్గాభాభీ అని పిలిచేవారు. సాండర్స్‌ని హత్య చేశాక భగత్‌సింగ్, రాజ్‌గురు నేరుగా దుర్గావతి దగ్గరకు వచ్చారు. అప్పటికి ఆమె భర్త వేరే పని మీద కలకత్తా వెళ్లి ఉన్నాడు. జరిగింది తెలుసుకున్న దుర్గావతి వెంటనే భగత్‌సింగ్‌ను లాహోర్ దాటించడానికి సిద్ధమైంది. జుట్టు కత్తిరించుకుని హ్యాట్ పెట్టి రూపం మార్చిన భగత్‌సింగ్‌కు ఆమె భార్యగా నటిస్తూ తన మూడేళ్ల కొడుకుతో మరుసటి రోజు సాయంత్రం లాహోర్ నుంచి డెహ్రాడూన్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో మొదటి తరగతి ప్రయాణికురాలిగా బయల్దేరదీసింది. వందలాది నిఘా కళ్ల మీద ఈ పని చేయడం చాలా ప్రమాదం... మూడేళ్ల కొడుక్కు కూడా ఏదైనా కావచ్చు అని భగత్‌సింగ్ ఆమెతో అన్నాడు. 'నా కొడుక్కు మరణం సంభవిస్తే ఒక దేశభక్తునిగా తన ప్రాణం అర్పించే అవకాశం వాడికి దక్కుతుంది' అని చెప్పి ఆమె ముందుకు కదిలింది. భగత్‌సింగ్ ఆధునికవేషంలో ఉన్న అధికారిగా, దుర్గావతి అతని భార్యగా, రాజ్‌గురు నౌకరుగా ఆ ప్రయాణం చేశారు. బ్రిటిష్ వాళ్లకు ఏ మాత్రం అనుమానం రాలేదు. భగత్‌సింగ్‌ను అలా క్షేమంగా కలకత్తా చేర్చి వెనక్కు వచ్చింది దుర్గావతి.

గొప్ప దేశభక్తురాలు

స్వతంత్ర పోరాటం చేస్తున్న భగవతి చరణ్ ఓహ్రాను వివాహం చేసుకునేనాటికి దుర్గావతికి 13 ఏళ్లు. పెళ్లి తర్వాతనే చదువుకుంది. ఇంట్లో ఇరుగు పొరుగు పిల్లలకు పాఠాలు చెప్పేది. సాయుధ పోరాటం చేయాలన్న భర్త ఆశయానికి మద్దతుగా నిలిచిందామె. భగత్‌సింగ్‌ను తన కన్నబిడ్డలా భావించింది. భగత్ సింగ్ పార్లమెంట్‌లో బాంబు దాడి చేసి అరెస్ట్ అయ్యాక ఆ తర్వాతగాని అతడే సాండర్స్ హత్యలో ఉన్నాడన్న సంగతి పోలీసులకు తెలియలేదు. ఆ కేసు వాదనలను బ్రిటిష్ ప్రభుత్వం హడావిడిగా ముగించి అక్టోబర్ 7, 1930న తీర్పు వెలువరించి భగత్‌సింగ్‌కు మరణశిక్ష విధించింది. అయితే లాహోర్‌లో ఈ విచారణ జరుగుతున్నప్పుడు భగత్‌సింగ్‌ను తీసుకెళ్లే వ్యానుపై బాంబుదాడి చేసి అతణ్ణి కాపాడాలని ప్లాన్ చేసింది దుర్గావతి. వీలు కాలేదు.

భర్తను కోల్పోయి

భగత్‌సింగ్‌ను జైలు నుంచి రక్షించడానికి స్వదేశీ జ్ఞానంతో బాంబులు తయారు చేస్తూ ప్రమాదవశాత్తు భగవతి చరణ్ ఓహ్రా మరణించాడు. అంత కష్టాన్ని తట్టుకుని దేశం కోసం పోరాడాలనుకుంది దుర్గావతి. భగత్‌సింగ్ మరణశిక్ష విధించాక ఆగ్రహంతో బొంబాయి వెళ్లి బ్రిటిష్ గవర్నర్‌ను చంపాలనుకుంది. అయితే గవర్నర్ దొరకలేదు. మరో బ్రిటిష్ అధికారి మీద స్వయంగా గుళ్ల వర్షం కురిపించి పగ చల్లార్చుకుంది. భగత్ సింగ్ ఉరి (1931 మార్చి 23) తర్వాత తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడం, పోలీసుల వెతుకులాట ఎక్కువ కావడంతో తనే వెళ్లి లొంగిపోయింది. మూడేళ్ల జైలు శిక్ష అనంతరం మొదట లక్నో ఆ తర్వాత ఘజియాబాద్‌లో పెద్దగా పబ్లిక్‌లో ఉండటానికి ఇష్టపడక స్కూల్ నడుపుతూ 1999లో తన 92వ ఏట మరణించిందా గొప్ప దేశభక్తురాలు, భారత తొలి సాయుధ పోరాట సమరయోధురాలు దుర్గాభాభీ.

ఇది సైనికుల సంగ్రామం

- ఇంటికొకరుగా ఆర్మీ జవాన్లు
- నాటి పీపుల్స్‌వార్ ఖిల్లా నుంచి నేడు దేశరక్షణకు సరిహద్దుల్లో యువకులు

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా ఈ ఊరికి ఉన్న ప్రత్యేకత 'దేశభక్తి'. దేశాన్ని కాపాడాలనే ధ్యేయంతో ఊరి యువకులు సైన్యం బాట పట్టారు. ఒకే ఊరి నుంచి ఇంటికి ఒక్కరు చొప్పున సుమారుగా 92 మందికిపైగా యువకులు సైన్యంలో తమ సేవలను అందిస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఖిల్లాగా ఉన్న ఆ ఊరిని ఇప్పుడు ఆర్మీ జవాన్ల పుట్టినిల్లుగా పిలుచుకుంటున్నారు. ఆ ఊరు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం. ఆ ఊరి ముచ్చట్లలోకి వెళదామా?

సుమారు 40 ఏళ్ల క్రితం కట్కూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయన స్ఫూర్తితో గ్రామంలోని యువకులు సైన్యం బాటపట్టారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆర్మీలో చేరారు. జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం 92 మంది ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతో జిల్లాలో కట్కూరు గ్రామం అంటే ఆర్మీజవాన్‌ల గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 1,014 కుటుంబాలుండగా జనాభా సుమారుగా 3,045 ఉన్నారు. అందులో మొత్తం గ్రామంలో 175 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

- మాలోతు శ్రీనివాస్, సాక్షి, అక్కన్నపేట

దేశసేవ ఇష్టం...



దేశసేవ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే 1998లో భారతసైన్యంలో చేరాను. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ బెంగళూర్‌లో ట్రైనింగ్ చేశాను. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నాను. కాశ్మీర్‌లో రాష్ట్రీయ విభాగంలో సేవలు అందించి అనేక టెర్రరిస్ట్ ఆపరేషన్‌లలో పాల్గొన్నాను. కాశ్మీర్ సేవలను గుర్తించి నాకు సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

- పంజా సదయ్య, సుబేదార్

గర్వపడుతున్నా...



దేశరక్షణ కోసం సైన్యంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశం కోసం పని చేయడం ఆనందంగా ఉంది.

- కొయ్యడ శ్రీనివాస్, ఆర్మీ జవాన్

పోస్టల్ స్టాంపులు

యుద్ధం ముద్రలు

మహిళలు ఇల్లు విడిచి బయట అడుగు పెడితే వింతగా చూసే కాలంలో సాహసమే వెన్నెముకగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు ఎంతోమంది మహిళలు. వారి త్యాగాల వెలుగు చరిత్రకే పరిమితమైనది కాదు, వర్తమానంలోనూ స్ఫూర్తిని ఇస్తుంటుంది. ఎంతోమంది మహిళా స్వాతంత్ర్య సమరయోధుల పోస్టల్ స్టాంప్స్ విడుదల అయ్యాయి. ఈ చిన్న స్టాంప్‌లు వారి త్యాగాలు, పోరాట పటిమను ప్రతిఫలిస్తాయి. పోస్టల్ స్టాంప్స్‌పై మెరిసిన కొందరు మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి...



రుక్మిణీ లక్ష్మీపతి

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మధురైలో పుట్టింది రుక్మిణీ. గాంధీజీ 'హరిజన సంక్షేమ నిధి' కోసం తన బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేసింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళగా చరిత్రలో నిలిచింది.



సుభద్రా జోషి

గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితం అయిన సుభద్రా జోషి విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది. 'హమారా సంగ్రామ్' పత్రికకు ఎడిటర్‌గా పని చేసింది. సుభద్రను అరెస్ట్ చేసి లాహోర్ సెంట్రల్ జైల్‌కు తరలించారు. విడుదలయ్యాక మళ్లీ ఉద్యమంలో భాగం అయింది. సుభద్ర అంకితభావాన్ని నెహ్రూ ప్రశంసించారు.



రాణి మా గైడిన్లియు

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన 'హెరాక' ఉద్యమంలో పదమూడు సంవత్సరాల వయసులోనే పాల్గొంది రాణి మా. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి మహిళగా చరిత్రకెక్కింది. 'హెరాక' ఉద్యమంతో పాటు ఎదుగుతూ వచ్చిన రాణి మా ప్రముఖ రాజకీయ నాయకురాలిగా, ఆధ్యాత్మిక గురువుగా ప్రఖ్యాతి పొందింది.



బేగం హజ్రత్ మహల్

తొలి తరం మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు బేగం హజ్రత్ మహల్. బేగం హజ్రత్ ఇతర సంస్థానాధీశులతో కలిసి బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది. లక్నో సమీపంలో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత కాలంలో మాత్రం ఓటమికి గురైంది. బ్రిటిష్ వారికి చిక్కకుండా అడవుల్లో తలదాచుకొని పోరాడేది.



కమలానెహ్రూ

జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ మహిళా సాధికారత కోసం గళం విప్పిన యోధురాలు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అరెస్టై జైలుకు వెళ్లింది. 'దేశ సేవిక' సంఘాలను ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది.



సుభద్రాకుమారి చౌహాన్

సుభద్రాకుమారి చౌహాన్ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తరువాత నాగపూర్ నుంచి అరెస్ట్ అయిన మొట్టమొదటి మహిళా సత్యాగ్రహిగా చరిత్రలో నిలిచింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఎన్నో త్యాగాలు చేసింది.

అరుణా అసఫ్ అలి



భర్త అసఫ్ అలీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది అరుణ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయింది. కాంగ్రెస్‌పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసిన తరువాత బ్రిటిష్ వారు విరుచుకుపడ్డారు. ప్రముఖ నాయకులను అరెస్ట్ చేశారు. ఆ క్లిష్ట సమయంలో అరుణా అసఫ్ అలి కార్యకర్తలకు అండగా ఉంది. బొంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగరేసి క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకునేలా చేసింది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాహసవంతురాలైన సామాజిక కార్యకర్త, చిన్నతనం నుంచే మహిళల హక్కుల కోసం పోరాడింది. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. గాంధీజీ ప్రభావంతో దుర్గాబాయి మాత్రమే కాదు ఆమె కుటుంబం మొత్తం అన్ని రకాల పాశ్చాత్య దుస్తులను విడిచిపెట్టి, ఖాదీని మాత్రమే ధరించేవారు. మద్రాస్‌లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

రాజ్‌కుమారీ అమృత్ కౌర్



రాజ్‌కుమారీ అమృత్ కౌర్ సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు. గాంధీజీ కార్యదర్శిగా పని చేసిన ఆమె దండి మార్చ్‌లాంటి ఎన్నో జాతీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రాజ్‌కుమారి ఇరవై నెలల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. రాచరిక కుటుంబంలో పుట్టినప్పటికీ మహాత్ముడి ఆశ్రమంలో సాధారణ జీవితాన్ని గడిపింది.

మన(సు)లో మాట



మా బాబు వయసు 5 సంవత్సరాలు. ఒకచోట నిలకడగా ఉండకుండా, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో బయటా కూడా ఇలాగే చస్తుంటాడు. బయట ఫంక్షన్లకు తీసుకెళితే తనను పట్టుకోవడం, తన చుట్టూ తిరగడంతోటే సరిపోతుంది. అందువల్ల ఈ మధ్య బయటకు వెళ్లడం కూడా తగ్గించేశాం. వాళ్ల నానమ్మేమో, ఇది పిల్లల్లో మామూలే అంటుంది. ఈ మధ్య వాళ్ల స్కూల్ టీచర్ మమ్మల్ని పిలిచి, మా బాబు మీద అనేక కంప్లయింట్లు చెప్పింది. మాకు చాలా ఆందోళనగా ఉంది.

– కె. మాధవి, సికింద్రాబాద్

పిల్లల మెదడులో ఉండే సెల్ఫ్ కంట్రోల్ విభాగం లోని లోపాల వల్ల, వారసత్వ లక్షణాల రీత్యా, కొందరు పిల్లలకు మీరు చెప్పిన లక్షణాలు రావచ్చు. దీనిని హైపర్ యాక్టివిటీ లేదా ఏడీహెచ్‌డీ అంటారు. నిలకడ లేకపోవడం, చదువు మీద ఏకాగ్రత లేకపోవడం, వస్తువులు విసిరేయడం, సహనం లేకపోవడం, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉండటం, స్కూల్‌లో వస్తువులు మరచిపోవడం, ఈ సమస్య ముఖ్య లక్షణాలు. వీరికి తెలివితేటలు బాగానే ఉన్నప్పటికీ, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనకబడతారు. ఇలాంటి వారిని ఎంత చిన్నవయసులో గుర్తించి, సరియైన చికిత్స చేయిస్తే అంత తొందరగా దీంట్లోంచి బయట పడతారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, అవసరమైతే కొద్ది మోతాదులో కొన్ని మందులు వాడటం ద్వారా వీరిని పూర్తిగా బాగు చెయ్యచ్చు. పేరెంట్స్, టీచర్లు ఇలాంటి వారిని త్వరగా గుర్తించగలిగితే తొందరగా బాగుపడతారు. మైకేల్ ఫిలిప్స్ అనే స్విమ్మర్ ఈ సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుని బాగుపడి, ఒలింపిక్స్‌లో 20కి పైగా స్వర్ణ పతకాలు సాధించాడు. చైల్డ్ సైకియాట్రిస్ట్‌ల సూచనలు తీసుకోవడం, పాటించడం మేలు చేస్తుంది.



- డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

హెల్దీ డైట్

సగ్గుబియ్యం పొంగనాలు



కావలసినవి: సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

తయారీ:
- ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీలాగా చేయాలి
- గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

పోషకాలు: (ఒక్కో పొంగనంలో)...
- కేలరీలు 63;
- ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు;
- కార్బోహైడ్రేట్లు – 8–9 గ్రాములు;
- ఫ్యాట్ – 2–3 గ్రాములు;
- ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40 –50 గ్రాములు.

అరుదైన ఆహ్వానం

12 ఏళ్లు... 15 లైబ్రరీలు

ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ఇరవై మందిలో విద్యార్థులు ఆరుగురు. వారిలో అమ్మాయి ఒకే ఒక్కరు. ఆ సరస్వతి పుత్రిక పేరు ఆకర్షణ. లైబ్రరీలు స్థాపిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు దగ్గర చేస్తున్న ఆమె అక్షరసేవకు జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు ఇది.


సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతితో...

''హైదరాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్‌మాస్టర్ నుంచి 12వ తేదీన నాన్నకు ఫోన్ వచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 15వ తేదీన ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావలసిందిగా మీ అమ్మాయి ఆకర్షణకు ఆహ్వానం వచ్చిందని చెబుతూ అభినందనలు తెలియచేశారు'' అంటూ తాను లైబ్రరీ వ్యవస్థాపకురాలిగా మారిన వివరాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు ఆకర్షణ సతీష్.

కోవిడ్ వచ్చినప్పుడు

''హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాన్న సతీశ్ క్యాన్సర్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ ఉద్యోగి. నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. పుస్తక పఠనం నా హాబీ కావడంతో వెయ్యికి పైగా పుస్తకాలతో ఇంట్లోనే నాకు సొంత లైబ్రరీ ఉంది. ఇతరుల కోసం లైబ్రరీ స్థాపించాలనే ఆలోచన కోవిడ్ సమయంలో వచ్చింది.

తొలి లైబ్రరీ క్యాన్సర్ హాస్పిటల్‌లో

నాన్న ఉద్యోగరీత్యా క్యాన్సర్ హాస్పిటళ్లకు టచ్‌లో ఉంటారు. కోవిడ్ సమయంలో ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వాళ్లు 'కోవిడ్ కారణంగా వంటవాళ్లు డ్యూటీకి రావడం లేదు. పేషెంట్‌లకు ఆహారం అందించడానికి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసి పెట్టవలసింది'గా కోరడంతో నాన్న వాళ్ల కోసం రోజూ భోజనం వండించి తీసుకెళ్లి ఇచ్చేవారు. నాకు స్కూల్ లేకపోవడంతో రోజూ నాన్నతోపాటు హాస్పిటల్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న పేషెంట్‌లలో నా ఏజ్ గ్రూప్ వాళ్లతో స్నేహం ఏర్పడింది. వాళ్లు కొంతమంది చదువుకోవడానికి పుస్తకాలు తెచ్చిపెట్టమని అడిగారు. రోజూ నా పుస్తకాలు కొన్ని తీసుకెళ్లి ఇస్తూ ఉన్నప్పుడు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయలత గారు... 'హాస్పిటల్‌కి చికిత్స కోసం ఎప్పుడూ కొత్తవాళ్లు వస్తుంటారు. హాస్పిటల్‌లోనే లైబ్రరీ ఉంటే బావుంటుంది' అన్నారు. వారి ఆలోచనే నా లైబ్రరీ ఉద్యమానికి నాంది. నా పుస్తకాలతోపాటు మా స్కూల్, అపార్ట్‌మెంట్ స్నేహితుల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలతో తొలి లైబ్రరీ అలా మొదలైంది. ఇప్పటికి 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగాను.

పదకొండు వేల పుస్తకాలు

నాలుగేళ్లలో పదకొండు వేల పుస్తకాలు సేకరించాను. అందులో రెండు వేల పుస్తకాలు ప్రధాని నరేంద్రమోదీగారిచ్చారు. ఈ ఏడాది మార్చి 18న కోయంబత్తూరులో ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా ఆయన 25 లైబ్రరీలు స్థాపించమని, 25 లైబ్రరీ స్థాపనకు స్వయంగా హాజరవుతానని చెప్పారు. భారత రాష్ట్రపతి గత ఏడాది శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కలిశాను. అప్పుడామె 'ప్రజల్లో రీడింగ్ హ్యాబిట్ తగ్గుతోంది, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కొనసాగించ'మని చెప్పి ఆమే స్వయంగా 74 పుస్తకాలిచ్చారు. ఈ ఏడాది ఢిల్లీ, కర్తవ్య పథ్‌లో జరిగిన 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యాను. ఇదే ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకు కూడా హాజరయ్యే అవకాశం కలగడం సంతోషంగా ఉంది'' అంటూ 25 లైబ్రరీల లక్ష్యాన్ని పూర్తి చేస్తానని చెప్పింది ఆకర్షణ సతీశ్.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



తొలి రౌండ్‌లోనే సుమిత్ పరాజయం

సిన్సినాటి ఓపెన్ ఏటీపీ మాస్టర్స్‌-1000 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం క్వాలిఫయింగ్‌లోనే ముగిసింది. తొలి రౌండ్‌లో ప్రపంచ 74వ ర్యాంకర్ సుమిత్ 2-6, 4-6తో ప్రపంచ 119వ ర్యాంకర్ మెకంజీ మెక్‌డొనాల్డ్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయాడు.. సుమిత్‌కు 7,290 డాలర్ల (రూ. 6 లక్షల 11 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

కెన్యా జట్టు హెడ్ కోచ్‌గా దొడ్డ గణేశ్



భారత జట్టు మాజీ పేస్ బౌలర్ దొడ్డ గణేశ్ కెన్యా క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. 2026లో భారత్‌-శ్రీలంక ఆతిథ్యమిచ్చే టి20 ప్రపంచకప్ కోసం అక్టోబర్‌లో ఆఫ్రికా క్వాలిఫయర్స్ పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 51 ఏళ్ల భారత మాజీ క్రికెటర్‌ను కెన్యా క్రికెట్ బోర్డు నియమించుకుంది. ముందుగా వచ్చే నెలలో ఐసీసీ డివిజన్‌-2 చాలెంజ్ లీగ్ జరుగుతుంది. అంతర్జాతీయ కెరీర్‌లో 4 టెస్టులు, ఒక వన్డే మాత్రమే ఆడిన గణేశ్... దేశవాళీ క్రికెట్‌లో కర్ణాటక తరఫున 365 వికెట్లు పడగొట్టాడు.



ఒలింపిక్ బృందాన్ని అభినందించిన రాష్ట్రపతి

నేడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానం

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పారిస్‌లో పాల్గొన్న భారత ఒలింపిక్ బృందాన్ని బుధవారం అభినందించారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండప్‌లో భారత బృందంతో భేటీ అయిన ముర్ము... దేశంలోని యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. పతకాలు తెచ్చిన క్రీడాకారులతో పాటు పతకాల కోసం పారిస్‌లో శ్రమించిన అథ్లెట్లను ఆమె ప్రశంసించారు. పలువురు అథ్లెట్లతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముచ్చటించిన ఫొటోలు, బృందంతో దిగిన ఫొటోల్ని రాష్ట్రపతి భవన్ అధికారిక 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మరోవైపు ఈరోజు ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన భారత క్రీడాకారులకు ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత క్రీడాకారులు కూడా ఆ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు.

వినేశ్‌కు చుక్కెదురు

- అప్పీలును తిరస్కరించిన సీఏఎస్
- రజత పతకం ఇచ్చేందుకు నిరాకరణ
- భారత స్టార్ రెజ్లర్‌కు తప్పని నిరాశ

కోట్లాది మంది అభిమానుల ప్రార్థనలు ఫలించలేదు. పారిస్ ఒలింపిక్స్‌లో అసమాన పోరాటంతో ఫైనల్‌కు చేరి... అనంతరం 100 గ్రాముల అధిక బరువు కారణంగా అనర్హత వేటుకు గురైన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు న్యాయ పోరాటంలోనూ ఊరట దక్కలేదు. తుదిపోరుకు చేరినందుకు రజత పతకమైనా ఇవ్వాలని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ (సీఏఎస్)ను ఆశ్రయించిన వినేశ్ ఫొగాట్ అప్పీలు తిరస్కరణకు గురైంది.

పారిస్: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ (సీఏఎస్)లో చుక్కెదురైంది. పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్... నిర్దేశిత బరువు కంటే 100 గ్రాములు ఎక్కువగా ఉండటంతో అనర్హతకు గురైంది. దీంతో అనుమతించిన బరువుతోనే ఫైనల్ వరకు చేరినందుకు గానూ... రజత పతకం అందించాలని వినేశ్ సీఏఎస్‌ను ఆశ్రయించింది. అయితే ఈ అంశంపై ఇప్పటికే రెండుసార్లు తీర్పు వాయిదా వేసిన సీఏఎస్... ఎట్టకేలకు బుధవారం రాత్రి ఏకవాక్యంలో తుది తీర్పు వెల్లడించింది. వినేశ్ పిటిషన్‌ను సీఏఎస్ అడ్‌హాక్ డివిజన్ కొట్టి వేసింది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) వివరాలు వెల్లడించింది. అథ్లెట్లు ఎదుర్కొంటున్న శారీరక, మానసిక ఒత్తిళ్లను పరిగణనలోకి తీసుకోవడంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ విఫలమైందని... ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష అభిప్రాయపడింది. 'నిరాశాజనక తీర్పు. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి వ్యతిరేకంగా వినేశ్ ఫొగాట్ అభ్యర్థనను ఆర్బిట్రేటర్ తిరస్కరించారు. మహిళల 50 కేజీల విభాగంలో తనకు కూడా రజత పతకం ఇవ్వాలన్న వినేశ్ దరఖాస్తును కొట్టేశారు' అని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష ఒక ప్రకటనలో తెలిపింది. తొలి రోజు నిబంధనల ప్రకారమే బరువు ఉన్నందుకుగానూ దాన్ని పరిగణనలోకి తీసుకొని మానవీయ కోణంలో తీర్పు ఇవ్వాల్సిందని... కానీ అది జరగలేదని పీటీ ఉష వాపోయింది. కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవడం సబబు కాదని పేర్కొంది. దీంతో 'పారిస్' క్రీడల్లో భారత్‌కు మరో పతకం వస్తుందనే ఆశలు ఆవిరయ్యాయి. ఫలితంగా విశ్వక్రీడల్లో భారత్ ఆరు (ఒక రజతం, 5 కాంస్యాలు) పతకాలతోనే సరిపెట్టుకోనుంది. అనర్హత వేటు అనంతరం మానసికంగా కుంగిపోయిన 29 ఏళ్ల వినేశ్.. కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించింది.



సీఏఎస్ తీర్పుపై అప్పీల్ చేయవచ్చా?

కష్ట కాలంలో వినేశ్‌కు అండగా నిలుస్తామని ఐఓఏ ప్రకటించింది. తదుపరి న్యాయ పరమైన అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. అధికారిక వెబ్‌సైట్ వివరాల ప్రకారం సీఏఎస్ తీర్పుపై అప్పీలు చేసే అవకాశం ఉంది. అయితే సీఏఎస్ తీర్పు మారే అవకాశాలు మాత్రం లేవనే చెప్పాలి. 'ప్రాథమిక విధానపరమైన నియమాల ఉల్లంఘన, ప్రజా పాలసీతో సంబంధం ఉన్న చాలా పరిమిత అంశాలపైనే తీర్పు మార్చే అవకాశం ఉంది. అది మినహా స్విస్ ఫెడరల్ ట్రిబ్యునల్‌కు న్యాయపరిధి పరిమితం' అని వినేశ్ కేసు వాదించిన ఫ్రాన్స్ లాయర్లు తెలిపారు.

భారత బౌలింగ్ కోచ్‌గా మోర్కెల్

- వచ్చే నెలలో బాధ్యతల స్వీకరణ
- 2027 వరకు పదవిలో కొనసాగనున్న దక్షిణాఫ్రికా మాజీ పేసర్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా మాజీ పేస్ బౌలర్ మోర్నీ మోర్కెల్ భారత సీనియర్ క్రికెట్ జట్టు కొత్త బౌలింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. సెప్టెంబర్ 19 నుంచి భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండు టెస్టుల సిరీస్ మొదలవుతుంది. ఈ సిరీస్‌తోనే బౌలింగ్ కోచ్‌గా మోర్కెల్ ఇన్నింగ్స్ ప్రారంభం కానుందని బీసీసీఐ కార్యదర్శి జై షా బుధవారం వెల్లడించాడు. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్ వరకు మోర్కెల్ కాంట్రాక్ట్ కొనసాగనుంది. మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ ఇటీవల టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా.. కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ తరఫున తనతో కలిసి పనిచేసిన అభిషేక్ నాయర్, టెన్ డస్కటేను అతను సహాయక బృందంలో చేర్చుకున్నాడు. ఇప్పుడు మోర్నీ మోర్కెల్ రాకతో ఇక కోచింగ్ స్టాఫ్ ఎంపిక ముగిసినట్లయింది. ఫీల్డింగ్ కోచ్‌గా హైదరాబాద్‌కు చెందిన టి.దిలీప్ కొనసాగుతున్నాడు.

మూడు దేశాలకు కోచ్‌గా...

మోర్కెల్‌కు గంభీర్‌కు మధ్య మంచి సమన్వయం ఉంది. ఐపీఎల్‌లో కేకేఆర్ తరఫున గంభీర్ సారథ్యంలో ఆడిన మోర్నీ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్‌కు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. ఆ సమయంలో లక్నో ఫ్రాంచైజీకి గంభీర్ మెంటార్‌గా వ్యవహరించాడు. దక్షిణాఫ్రికా జాతీయ జట్టు తరఫున 86 టెస్టులు, 117 వన్డేలు, 44 టి20లు ఆడిన మోర్నీ మోర్కెల్ ఓవరాల్‌గా మూడు ఫార్మాట్లలో కలిపి 544 వికెట్లు పడగొట్టాడు. కెరీర్‌కు వీడ్కోలు



పలికిన అనంతరం మోర్కెల్ పలు జట్లకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సందర్భంగా పాకిస్తాన్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన మోర్కెల్... మహిళల టి20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ జట్టుకు శిక్షకుడిగా వ్యవహరించాడు. ఇక ఈ ఏడాది జరిగిన పురుషుల టి20 ప్రపంచకప్‌లో నమీబియా జట్టుకూ మోర్కెల్ శిక్షణ ఇచ్చాడు. బౌలింగ్ కోచ్ రేసులో వినయ్ కుమార్, లక్ష్మీపతి బాలాజీ వంటి భారత మాజీ పేసర్ల పేర్లు వినిపించినా... గంభీర్ కోరిక మేరకే మోర్నీ మోర్కెల్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చిన నయా పేస్ సంచలనం మయాంక్ యాదవ్ మెరుగైన ప్రదర్శన వెనక కూడా మోర్కెల్ కృషి ఉంది. ఇటీవల శ్రీలంక పర్యటనలో భారత మాజీ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులే టీమిండియా తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించగా... అతడిని స్పిన్ కన్సల్టెంట్‌గా కొనసాగిస్తారా లేదో వేచి చూడాలి.

జెర్సీ నంబర్ 16కు వీడ్కోలు

భారత గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ గౌరవార్థం హాకీ ఇండియా నిర్ణయం





న్యూఢిల్లీ: భారత దిగ్గజ గోల్‌కీపర్ శ్రీజేశ్ ఇకపై హాకీ మైదానంలో కనిపించడు. అలాగే అతని జెర్సీ నంబర్ 16 కూడా కనిపించదు. గోల్‌పోస్ట్ ముందు ప్రత్యర్థులకు అడ్డుగోడలా నిలబడి భారత జట్టుకు విశేష సేవలందించిన శ్రీజేశ్ ఘనకీర్తికి గుర్తుగా ఆ జెర్సీకి అతనితోపాటే రిటైర్మెంట్ ఇవ్వాలని హాకీ ఇండియా (హెచ్ఐ) నిర్ణయించింది. బుధవారం ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జట్టు సభ్యులను ఘనంగా సన్మానించారు. శ్రీజేశ్‌కు రూ. 25 లక్షల నగదు పురస్కారం చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్ టిర్కీ, భోళానాథ్ సింగ్‌లు మాట్లాడుతూ శ్రీజేశ్‌ను ఆకాశానికెత్తారు. ఆధునిక భారత హాకీకి అతనొక దేవుడని కితాబిచ్చారు. భారత సీనియర్ పురుషుల జట్టులో 16వ నంబర్ జెర్సీని ఎవరికీ కేటాయించబోమని భోళానాథ్ చెప్పారు. 'శ్రీజేశ్ త్వరలోనే జూనియర్ భారత జట్టు కోచ్‌గా వెళతారు. ఘనమైన కెరీర్‌కు అతను వీడ్కోలు పలికితే ... హాకీ ఇండియా అతని ఘనకీర్తికి గుర్తుగా జెర్సీ నంబర్ 16కు రిటైర్మెంట్ ఇచ్చింది. అయితే ఇది సీనియర్ స్థాయికే పరిమితం. జూనియర్ జట్టులో 16వ జెర్సీ యథాతథంగా కొనసాగుతుంది' అని ఆయన వివరించారు.

దులీప్ ట్రోఫీలో అగ్రశ్రేణి క్రికెటర్లు

బరిలో గిల్, పంత్, రాహుల్, జడేజా, సిరాజ్ ● రోహిత్, కోహ్లి, బుమ్రా దూరం

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు భారత దేశవాళీ క్రికెట్ సీజన్ దులీప్ ట్రోఫీతో మొదలుకానుంది. వచ్చేనెల 5 నుంచి బెంగళూరు, అనంతపురంలో ఈ టోర్నీ జరగనుంది. దీనికోసం జాతీయ సెలెక్షన్ కమిటీ బుధవారం నాలుగు జట్లను ప్రకటించింది. శుబ్‌మన్ గిల్, అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్ వరుసగా 'ఎ' 'బి' 'సి' 'డి' జట్లకు కెప్టెన్‌లుగా వ్యవహరిస్తారు. పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, బుమ్రా, అశ్విన్‌లకు ఈ టోర్నీ నుంచి విశ్రాంతి ఇచ్చారు. శస్త్రచికిత్స తర్వాత పూర్తిగా కోలుకోని సీనియర్ పేసర్ షమీని కూడా ఎంపిక చేయలేదు. ఇక కారు ప్రమాదం నుంచి కోలుకున్న రిషభ్ పంత్ చాలా రోజులకు ఎర్రబంతితో ఆడనున్నాడు. గత సీజన్‌లో రంజీ ట్రోఫీ ఆడకుండా.. ఐపీఎల్‌పై దృష్టి పెట్టి సెంట్రల్ కాంట్రాక్టు కోల్పోయిన ఇషాన్ కిషన్ టీమ్ 'డి'లో చోటు దక్కించుకున్నాడు. సెప్టెంబర్ 19 నుంచి భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండు టెస్టుల సిరీస్ ప్రారంభమవుతుంది. టీమిండియా ఆటగాళ్లు దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌లో మాత్రమే ఆడే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిని 'బి' జట్టుకు ఎంపిక చేశారు. హైదరాబాద్ ఆటగాళ్లు సిరాజ్ 'బి' జట్టులో చోటు పొందగా.. తిలక్ వర్మ 'ఎ' జట్టులో ఉన్నాడు. ఆంధ్ర ఆటగాళ్లు శ్రీకర్ భరత్, రికీ భుయ్ టీమ్ 'డి'లో చోటు దక్కించుకున్నారు.


సిరాజ్


భరత్

రెండో ర్యాంక్‌లో రోహిత్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఒక స్థానం మెరుగుపర్చుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో రోహిత్ 765 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో రోహిత్ రెండు అర్ధ సెంచరీలతో కలిపి 157 పరుగులు చేశాడు. శుబ్‌మన్ గిల్ ఒక స్థానం పడిపోయి 763 పాయింట్లతో మూడో స్థానంలో నిలువగా... విరాట్ కోహ్లి 746 పాయింట్లతో నాలుగో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. పాకిస్తాన్ ప్లేయర్ బాబర్ ఆజమ్ 824 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.

చహల్ 10-5-14-5



లండన్: ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్ వన్డే కప్ టోర్నీలో భాగంగా ఆడిన తొలి మ్యాచ్‌లోనే భారత లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చహల్ అదరగొట్టాడు. కెంట్ జట్టుతో కాంటర్‌బరీలో బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో నార్తంప్టన్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహించిన చహల్ 10 ఓవర్లు వేసి 14 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు. చహల్ 5 మెయిడెన్లు కూడా వేయడం విశేషం. చహల్ మాయాజాలానికి కెంట్ జట్టు 35.1 ఓవర్లలో 82 పరుగులకే ఆలౌటైంది. నార్తంప్టన్‌షైర్ 14 ఓవర్లలో వికెట్ కోల్పోయి 86 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ టోర్నీలో నార్తంప్టన్‌షైర్ 8వ స్థానంలో నిలిచి గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

సినిమా

దేవర... ఓ అద్భుతమైన ప్రయాణం

– ఎన్టీఆర్




'దేవర'... ఓ అద్భుతమైన ప్రయాణం' అంటున్నారు ఎన్టీఆర్. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'దేవర'. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్. కొరటాల శివ దర్శకత్వంలో నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ సినిమా తొలి భాగంలో తన పాత్ర చిత్రీకరణ పూర్తయినట్లు ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ''దేవర' మొదటి భాగం కోసం నా చివరి షాట్‌ను ముగించాను. శివగారు రూపొందించిన ప్రపంచంలోకి మీరందరూ అడుగుపెట్టే సెప్టెంబరు 27 ('దేవర' తొలి భాగం విడుదల తేదీ) కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని పేర్కొన్నారు ఎన్టీఆర్.

ఆ వార్తలు అవాస్తవం... ''దేవర' షూటింగ్‌లో ఎన్టీఆర్ గాయపడ్డారు, రోడ్డు ప్రమాదంలో ఎన్టీఆర్‌కి గాయాలు'... అంటూ బుధవారం ఉదయం సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఆ వార్తలు అవాస్తవం అని ఎన్టీఆర్ టీమ్ స్పష్టత ఇచ్చింది. ''ఎన్టీఆర్ జిమ్‌లో కసరత్తులు చేస్తుండగా ఎడమ చేతికి రెండు రోజుల క్రితం స్వల్ప గాయమైంది. అయినప్పటికీ ఆయన 'దేవర' షూటింగ్‌లో మంగళవారం పాల్గొన్నారు. ఆయకు పెద్ద ప్రమాదం జరిగినట్టు వస్తున్న వార్తలు అవాస్తవం'' అని క్లారిటీ ఇచ్చారు.

ఏ సినిమాకీ ఇంత కష్టపడలేదు

– విక్రమ్

''నేను నటించిన 'శివపుత్రుడు, అపరిచితుడు, నాన్న, ఐ' వంటి చిత్రాల్లానే 'తంగలాన్' కూడా వైవిధ్యమైన సినిమా. భావోద్వేగాలతో కూడుకున్న చిత్రమిది. ఈ స్క్రిప్ట్ చేసిన తర్వాత రంజిత్ ఒక ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాడు. ఈ మూవీలో ఒక జీవితం ఉంటుంది. లైవ్ సౌండింగ్‌లో చిత్రీకరించిన ఈ సినిమా నాకు అందమైన అనుభూతినిచ్చింది'' అని విక్రమ్ అన్నారు. పా. రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా నటించిన చిత్రం 'తంగలాన్'. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా విక్రమ్ చెప్పిన విశేషాలు.


● 'తంగలాన్'లో విక్రమ్

● నా ప్రతి చిత్రంలో కొంత గొంతు మార్చి మాట్లాడుతుంటా. 'తంగలాన్'లోనూ అలాగే డైలాగ్స్ చెప్పాను. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ ప్రాంతం వాళ్లు ఎలాంటి లైఫ్ లీడ్ చేశారో.. మేమూ అలాంటి పరిస్థితులను ఫేస్ చేస్తూ షూటింగ్ చేశాం. నేనిప్పటిదాకా ఏ సినిమాకీ ఇంతలా కష్టపడలేదు... ఇలాంటి సినిమా చేయనూ లేదు. మా డైరెక్టర్ రంజిత్ చేసిన గొప్ప సినిమాల్లో 'తంగలాన్' ఒకటిగా నిలుస్తుంది. ఇందులో నేను రెండు పాత్రలు చేశాను. సహజంగా కనిపించేందుకు శారీరకంగా శ్రద్ధ తీసుకున్నాను. ఈ సినిమాని పాన్ వరల్డ్‌కి తీసుకెళ్లడానికి ట్రై చేస్తున్నారు జ్ఞానవేల్ రాజా. ● 'తంగలాన్' తెలుగు, తమిళ, కన్నడ అని కాదు.. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ రిలేట్ అయ్యే స్టోరీ. బంగారం వేట అనేది హైలైట్ అవుతున్నా ఈ కథలో స్వేచ్ఛ కోసం చేసే పోరాటం ఉంది. ఈ మూవీ చేయడం వల్ల ఆఫ్రికన్ తెగలతో పాటు ప్రపంచంలోని కొన్ని తెగలు ఎలా ఉంటాయో తెలుసుకున్నాను.

ఆయ్ చూసి భావోద్వేగంతో బయటికొస్తారు

– అల్లు అరవింద్


● నిఖిల్, నార్నే నితిన్, అల్లు అరవింద్, శ్రీలీల, అంజి, బన్నీ వాసు

''ఆయ్' డైరెక్టర్ అంజి ఈ చిత్రకథ బాగా చెప్పాడు.. కానీ ఎలా తీస్తాడో? అనుకున్నా. అందుకు నేను గ్యారెంటీ అని బన్నీ వాసు అన్నాడు. నిజంగానే సినిమాని అద్భుతంగా తీశాడు అంజి. నేనీ సినిమా చూశాను. ప్రేక్షకులు ఓ భావోద్వేగంతో థియేటర్ నుంచి బయటికొస్తారు'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా అంజి కె. మణిపుత్ర దర్శకత్వం వహించిన చిత్రం 'ఆయ్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరో నిఖిల్, హీరోయిన్ శ్రీలీల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''జాతి రత్నాలు, మ్యాడ్, బేబీ' సినిమాల్లా 'ఆయ్' కూడా బ్లాక్ బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు నిఖిల్. ''ఆయ్'లో మంచి వినోదం ఉందని తెలుస్తోంది. నాకు ఇలాంటి చిత్రాలంటే చాలా ఇష్టం'' అన్నారు శ్రీలీల. ''కులాలు, మతాలను మించినదే స్నేహం అనే మంచి సందేశాన్ని మా సినిమాలో ఇచ్చాం'' అని నార్నే నితిన్ చెప్పారు. ''బన్నీ (అల్లు అర్జున్) లేకపోయి ఉంటే నేను ఉండేవాణ్ణి కాదు'' అని చెప్పారు బన్నీ వాసు. ''ఆయ్'తో మాకు పైసా వసూల్.. మీకు (ఆడియన్స్) నవ్వుల వసూల్'' అని అంజి కె. మణిపుత్ర పేర్కొన్నారు.

ఉమ కథ


● సుమయా రెడ్డి

సుమయా రెడ్డి హీరోయిన్‌గా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేశారు సుమయా రెడ్డి. ''అందమైన ప్రేమకథ, ఫ్యామిలీ, యాక్షన్ డ్రామాతో రూపొందిన చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే వాణిజ్య అంశాలున్నాయి. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది'' అని యూనిట్ పేర్కొంది. కమల్ కామరాజు, సప్తగిరి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: రధన్.

జీరోలో మంచి కంటెంట్ ఉంది


– తనికెళ్ల భరణి


శివాజీ రాజా, తనికెళ్ల భరణి, విజయ్ రాజా, లక్ష్మణ్ రావు

''జీరో' గ్లింప్స్ చాలా బాగుంది. ఓ హీరోకి కావాల్సిన కసి విజయ్ రాజాలో కనిపించింది. మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. డైరెక్టర్ చాలా భావోద్వేగంగా తీశాడు. నిర్మాతలు ప్యాషన్‌తో నిర్మించారు. ఈ సినిమాని అందరూ ఆదరించాలి'' అని నటుడు తనికెళ్ల భరణి అన్నారు. నటుడు శివాజీ రాజా తనయుడు విజయ్ రాజా హీరోగా లక్ష్మీ నారాయణ .సి దర్శకత్వం వహించిన చిత్రం 'జీరో'. సాయి విలా సినిమాస్‌పై ఆర్. లక్ష్మణ్ రావు, ఆర్. శ్రీను నిర్మించిన ఈ చిత్రానికి 'జీరో' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ టైటిల్ గ్లింప్స్‌ని తనికెళ్ల భరణి లాంచ్ చేశారు. శివాజీ రాజా మాట్లాడుతూ– ''జీరో' బాగా వచ్చింది. ప్రేక్షకులు మా అబ్బాయిని ఆశీర్వదించాలి'' అన్నారు. ''మా చిత్రం అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని విజయ్ రాజా చెప్పారు. ''మన క్రీడల్లో ఉండే పాజిటివ్స్, నెగిటివ్స్‌ని బేస్ చేసుకొని ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్, స్పోర్ట్స్ డ్రామాగా ఈ సినిమా తీశాను'' అని లక్ష్మీనారాయణ .సి పేర్కొన్నారు. ''మా సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది'' అన్నారు ఆర్. శ్రీను, ఆర్. లక్ష్మణ్ రావు. సంగీత దర్శకుడు సాయి కార్తీక్ మాట్లాడారు.

మేరా భారత్ మహాన్


● కమల్‌హాసన్


● నాగచైతన్య

దేశం అంటే భక్తి... ప్రేమ ఉన్నవాళ్లు దేశం కోసం ప్రాణాలను వదిలేయడానికి కూడా వెనకడుగు వేయరు. 'మేరా భారత్ మహాన్' అంటూ నిజజీవితంలో ప్రాణాలను పణంగా పెట్టిన అలాంటి మహానుభావులు ఎందరో ఉన్నారు. కొందరి జీవితాల ఆదర్శంగా వెండితెరపైకి వచ్చిన సినిమాలనూ చూశాం. ప్రస్తుతం నిర్మాణంలో అలాంటి నిజ జీవిత వీరుల నేపథ్యంలో, కల్పిత పాత్రలతోనూ రూపొందుతున్న దేశభక్తి చిత్రాలు చాలా ఉన్నాయి. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.

భూతల్లిపై ఒట్టేయ్...

''భూతల్లిపై ఒట్టేయ్... తెలుగోడి వాడి చూపెట్టేయ్... తెల్లోడి నెత్తురుతోనే నీ కత్తికి పదును పట్టేయ్' అంటూ ప్రజలను చైతన్యపరిచేలా, వారిలో దేశభక్తి ఉప్పొంగేలా పాట పాడుతున్నాడు వీరశేఖరన్. ఇతని గురించి బాగా తెలిసిన వ్యక్తి సేనాపతి. ఎందుకంటే సేనాపతి తండ్రి వీర శేఖరన్. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిషర్లకు వ్యతిరేకంగా వీర శేఖరన్ (కల్పిత పాత్ర) ఏ విధంగా పోరాడాడు? అనేది వెండితెరపై 'ఇండియన్ 3' సినిమాలో చూడొచ్చు. హీరో కమల్‌హాసన్‌-దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఇండియన్' ('భారతీయుడు') ఫ్రాంచైజీలో త్వరలో రానున్న చిత్రం 'ఇండియన్ 3'. ఈ చిత్రంలో వీరశేఖరన్, సేనాపతి పాత్రల్లో తండ్రీకొడుకుగా కమల్‌హాసన్ కనిపిస్తారు. 1806 సమయంలో బ్రిటిషర్లకు వ్యతిరేకంగా వీర శేఖరన్ ఏ విధంగా పోరాడాడు? అతని పోరాట స్ఫూర్తితో 1940లలో సేనాపతి ఏం చేశాడు? అనే అంశాలతో 'ఇండియన్ 3' ఉంటుందని తెలుస్తోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.



● శివ కార్తికేయన్


● ధ్రువ సర్జా

భారత్ మాతా కీ జై

'తేరే పాకిస్తానీ అడ్డా మే బైట్ కే బతా రహా హూ... భారత్ మాతా కీ జై...' అంటూ నాగచైతన్య చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ 'తండేల్' సినిమాలోనిది. విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు జీవనోపాధి కోసం గుజరాత్ తీర ప్రాంతానికి వలస వెళ్తారు. వేటలో భాగంగా వారికి తెలియకుండానే పాకిస్తాన్ సరిహద్దుల్లోకి వెళ్తారు. పాకిస్తాన్ కోస్ట్ గార్డులు ఈ భారత మత్స్యకారులను బందీలుగా పట్టుకుని జైల్లో వేస్తారు. పాకిస్తాన్ జైల్లో వీరి పరిస్థితి ఏంటి? వీరి కుటుంబ సభ్యులు వీరి కోసం ఏమైనా పోరాటం చేశారా? అనే అంశాల నేపథ్యంలో 'తండేల్' కథనం ఉంటుందని తెలిసింది. వాస్తవ ఘటన ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో జాలరి రాజు పాత్రలో నాగచైతన్య, అతని భార్య పాత్రలో సాయి పల్లవి కనిపిస్తారు. దేశభక్తి అంశాలతో పాటు ప్రేమకథ, కుటుంబ భావోద్వేగాలు మిళితమైన ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ ఏడాదే విడుదలయ్యే అవకాశం ఉంది.

మార్టిన్... ఇండియన్

పాకిస్తాన్ ఆర్మీ మార్టిన్ అనే భారతీయుడిని క్రూరంగా శిక్షించాలనుకుంటుంది. మార్టిన్‌కు దేశభక్తి ఎక్కువ. ఎంతలా అంటే... అతని చేతిపై ఇండియన్ అనే ట్యాటూ ఉంటుంది. అసలు పాకిస్తాన్ జైల్లో మార్టిన్ ఎందుకు ఉండాల్సి వచ్చింది? అనేది కన్నడ చిత్రం 'మార్టిన్' చూస్తే తెలుస్తుంది. ధ్రువ్ సర్జా హీరోగా నటించిన చిత్రం ఇది. ఏపీ అర్జున్ దర్శకత్వం వహించిన ఈ దేశభక్తి, యాక్షన్, ఎమోషనల్ మూవీ అక్టోబరు 11న రిలీజ్ కానుంది.

సరిహద్దు యుద్ధం



● అక్షయ్ కుమార్

దేశభక్తి ప్రధానాంశంగా ఉన్న చిత్రాల్లో నటించేందుకు అక్షయ్ కుమార్ ఆసక్తి చూపిస్తుంటారు. ఆయన చేసిన 'బేబీ, ఎయిర్ లిఫ్ట్, 'మిషన్ మంగళ్' వంటి చిత్రాలు ఇందుకు ఓ నిదర్శనం. తాజాగా అక్షయ్ కుమార్ నటించిన చిత్రం 'స్కై ఫోర్స్'. 1965లో ఇండియా–పాకిస్తాన్‌ల మధ్య జరిగిన వార్ నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని సమాచారం. వీర్ పహారియా, నిమ్రత్ కౌర్, సారా అలీఖాన్ ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తారు. సందీప్ కెవ్లానీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం అక్టోబరు 2న రిలీజ్ కానుంది. అలాగే 1971లో ఇండియా–పాకిస్తాన్‌ల మధ్య జరిగిన వార్ నేపథ్యంలో 1997లో హిందీలో 'బోర్డర్' చిత్రం వచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో సన్నీ డియోల్ హీరోగా నటించారు. కాగా ఇటీవల సన్నీ డియోల్ 'బోర్డర్ 2'ను ప్రకటించారు. ఇంకా భారత్–పాకిస్తాన్ విడిపోయిన నాటి పరిస్థితుల నేపథ్యంలో 'లాహోర్ –1947' సినిమా కూడా చేస్తున్నారు సన్నీ డియోల్. ఇక పాకిస్తాన్ చిన్నారిని ఆమె దేశంలో విడిచి పెట్టేందుకు 'భజరంగీ భాయిజాన్' (2015)గా సల్మాన్ ఖాన్ చేసిన సాహసాలను సులభంగా మర్చిపోలేం. ఈ ఫిల్మ్‌కు సీక్వెల్ ఉంటుందని చిత్ర కథారచయిత విజయేంద్ర ప్రసాద్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

అమరన్

'రమణ (తెలుగులో 'ఠాగూర్'గా రీమేక్ అయింది), తుపాకీ, కత్తి' వంటి సినిమాల్లో సామాజిక బాధ్యతతో పాటు కాస్త దేశభక్తిని కూడా మిళితం చేసి, హిట్ సాధించారు తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్. ప్రస్తుతం హీరో శివ కార్తికేయన్‌తో 'అమరన్' సినిమా చేస్తున్నారాయన. ఈ చిత్రంలో సైనికుడి పాత్రలో కనిపిస్తారు శివ కార్తికేయన్. సాయిపల్లవి హీరోయిన్. మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోందని టాక్. ఈ చిత్రం అక్టోబరు 31న రిలీజ్ కానుంది. అలాగే ప్రస్తుతం మురుగదాస్ హిందీలో సల్మాన్ ఖాన్‌తో చేస్తున్న 'సికందర్' కూడా దేశభక్తి నేపథ్యంలోనే ఉంటుందని టాక్.

సాక్షి
బిజినెస్
గురువారం
15-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	150	79,106
నిఫ్టీ ▲	5	24,144

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,510	▽	35
డోజోన్స్	39,996	▲	230
ఎఫ్‌టీఎస్ఈ 100	8,281	▲	46
డాక్స్	17,886	▲	73
షాంఘై	2,850	▽	17
నికాయ్	36,442	▲	209

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

	ధర		మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	70,793	▲	394
బంగారం (99.5 స్వచ్ఛత)	70,510	▲	348
వెండి (కిలో)	80,921	▲	219

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.51	84.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.74	109.32
€	యూరో	ఎస్‌బీఐ	91.16	93.54
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.64	57.93
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.41	56.34
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.05	66.21
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.71

పిక్సెల్ 9 సిరీస్ వచ్చేసింది..

- 4 మోడళ్లను ఆవిష్కరించిన గూగుల్
- ధర రూ.74,999 నుంచి ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ దిగ్గజం గూగుల్ పిక్సెల్ 9 సిరీస్‌ను ఆవిష్కరించింది. పిక్సెల్ 9, పిక్సెల్ 9 ప్రో, పిక్సెల్ 9 ప్రో ఎక్స్‌ఎల్, పిక్సెల్ 9 ప్రో ఫోల్డ్ వీటిలో ఉన్నాయి. ధర రూ.74,999 నుంచి ప్రారంభం. ఫోల్డ్ మోడళ్లలో తొలిసారిగా గూగుల్ నుంచి పిక్సెల్ 9 ప్రో ఫోల్డ్ భారత్‌లో ఎంట్రీ ఇస్తోంది. పిక్సెల్ 9, పిక్సెల్ 9 ప్రో ఎక్స్‌ఎల్ ఆగస్ట్ 22 నుంచి భారతీయ కస్టమర్లకు అందుబాటులోకి వస్తాయి. ప్రీ–ఆర్డర్లు ప్రారంభం అయ్యాయి. మిగిలిన రెండు మోడళ్లు సెప్టెంబర్‌లో ఎంట్రీ ఇస్తాయి. పిక్సెల్ ఫోల్డ్ ధర రూ.1,72,999 ఉంది. పిక్సెల్ 9 సిరీస్‌లో జెమిని అనేక ప్రత్యేక ఫీచర్లు ఉన్నాయని కంపెనీ తెలిపింది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్–2 రక్షణతోపాటు మోడల్‌నుబట్టి ఇంటర్నల్ మెమరీ 1 టీబీ వరకు ఉంది. కాగా, కొత్త సిరీస్ రాకతో పిక్సెల్ 8, పిక్సెల్ 7 సిరీస్ ధరలను వేరియంట్‌నుబట్టి రూ.7,000 వరకు గూగుల్ తగ్గించింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరులో గూగుల్ వాకిన్ సెంటర్స్ రానున్నాయి. పిక్సెల్ 8 సిరీస్ ఫోన్లను భారత్‌లో తయారు చేస్తున్నట్టు కంపెనీ ఇప్పటికే ప్రకటించింది.



టోకు ధరలూ తగ్గాయ్..

- జూలైలో ద్రవ్యోల్బణం 2.04 శాతం
- మూడు నెలల కనిష్ట స్థాయి
- శాంతించిన కూరగాయల ధరలు



న్యూఢిల్లీ: కూరగాయల ధరలు గణనీయంగా దిగిరావడంతో, జూలై మాసంలో టోకు ద్రవ్యోల్బణం (హోల్‌సేల్) 2.04 శాతానికి క్షీణించింది. అంతకుముందు జూన్ వరకు వరుసగా నాలుగు నెలల పాటు టోకు ధరల ఆధారిత సూచీ (డబ్ల్యూపీఐ/టోకు ద్రవ్యోల్బణం) వరుసగా పెరగడం గమనార్హం. జూన్ నెలకు ఇది 3.36 శాతంగా ఉంది. క్రితం ఏడాది జూలై నెలలో టోకు ద్రవ్యోల్బణం మైనస్ 1.23 శాతంగా నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇది 1.19%గా ఉంది. జూలై నెలలో ఆహార విభాగం ద్రవ్యోల్బణం 3.45%కి పరిమితమైంది. జూన్‌లో నమోదైన 10.87% స్థాయి నుంచి గణనీయంగా తగ్గింది. కూరగాయలు, పప్పులు, ఉల్లిపాయల ధరలు తగ్గడం ఆహారద్రవ్యో ల్బణం శాంతించేందుకు సహకరించింది. కూరగాయల ధరలకు సంబంధించి ద్రవ్యోల్బణం జూన్‌లో 38.76% స్థాయిలో ఉంటే, జూలై నెలలో మైనస్ 8.93%కి (డిఫ్లేషన్) పడిపోయింది. తయారీ ఉత్పత్తుల వార్షిక ద్రవ్యోల్బణ రేటు జూన్ నెలలో ఉన్న 1.43 శాతం నుంచి జూలైలో 1.58 శాతానికి పెరిగింది. 'ఆహార తయారీ మినహా టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం వరుసగా ఐదో నెలలోనూ పెరిగింది. క్రితం నెలతో పోల్చితే తగ్గినప్పటికీ.. జూలైలో 17 నెలల గరిష్ఠ స్థాయిలో 1.2%గా నమోదైంది'అని ఇక్రా సీనియర్ ఆర్థికవేత్త రాహుల్ అగర్వాల్ తెలిపారు.

ఐటీ షేర్ల అండతో..



- రెండురోజుల నష్టాలకు చెక్
- 150 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు సెప్టెంబర్‌లో వడ్డీరేట్లను తగ్గించవచ్చనే ఆశలతో ఐటీ షేర్లు రాణించాయి. ఫలితంగా దేశీయ స్టాక్ సూచీలు బుధవారం రెండు రోజుల నష్టాల నుంచి తేరుకున్నాయి. సెన్సెక్స్ 150 పాయింట్లు పెరిగి 79,106 వద్ద స్థిరపడింది. నిఫ్టీ అయిదు పాయింట్ల లాభంతో 24,144 వద్ద ముగిసింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 333 పాయింట్ల మధ్య 78,896–79,229 శ్రేణిలో కదలాడింది. ఐటీతో పాటు కన్జూమర్ డ్యూరబుల్స్, కన్జూమర్ డిస్క్రేషనరీ షేర్లూ రాణించాయి. కమోడిటీ, ఇంధన, టెలికం, యుటిలిటీ, మెటల్, విద్యుత్, రియల్టీ, సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

ప్రొడ్యూసర్ ప్రైజ్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ డేటా అంచనాలకు తగ్గట్లు వెలువడంతో సెప్టెంబర్‌లో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఖనిజాలు, గనులపై రాష్ట్రాలకు రాయల్టీ విధించే హక్కు ఉందంటూ సుప్రీం కోర్టు స్పష్టం చేయడంతో మైనింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. హిందుస్థాన్ కాపర్ 4%, ఎంఓఐఎల్ 3.50%, కోల్ ఇండియా, నాల్కో 3% చొప్పున క్షీణించాయి. సెయిల్ 2%, టాటా స్టీల్ 2%, నష్టపోయాయి.
- తొలి త్రైమాసికంలో నికరలాభం 121% వృద్ధి నమోదు మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ షేరుకు డిమాండ్ లభించింది. బీఎస్ఈలో 3.50% పెరిగి రూ.4997 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

జూలైలో ఎగుమతులు డౌన్	హింద్ జింక్ ఓఎఫ్ఎస్ షేరు ధర రూ. 486

ఐటీ కొలువులు.. చిగురిస్తున్న ఆశలు!

ఐటీ రంగం ఉద్యోగాల విషయంలో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికం (2023–24, క్యూ1)లో వరుసగా ఏడో క్వార్టర్లోనూ టాప్–5 ఐటీ దిగ్గజాల మొత్తం సిబ్బంది సంఖ్య తగ్గింది. అయితే, గతంతో పోలిస్తే తగ్గుదల జోరుకు భారీగా అడ్డుకట్ట పడటం సానుకూలాంశం. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరికల్లా మళ్లీ ఐటీ రంగం పెరిగిన ఉద్యోగులతో కళకళలాడే పరిస్థితి వస్తుందంటున్నారు పరిశ్రమ విశ్లేషకులు.



- వరుసగా ఏడో క్వార్టర్లోనూ తగ్గిన ఐటీ బిగ్–5 సిబ్బంది సంఖ్య
- తగ్గుదల జోరుకు అడ్డుకట్టపడటం ఊరట
- టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రాకు క్యూ1లో ప్లస్
- ట్రెండ్ రివర్స్ అవుతుందంటున్న విశ్లేషకులు

టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా... దేశీ ఐటీ రంగంలో ఇవి టాప్–5 కంపెనీలు. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ1లో వీటి మొత్తం సిబ్బంది సంఖ్య సీక్వెన్షియల్‌గా (గతేడాది క్యూ4తో పోలిస్తే) 2,034 మంది తగ్గారు. అయితే, టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రా.. ఈ మూడు దిగ్గజాలు మాత్రం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో నికరంగా ఉద్యోగులను జత చేసుకోవడం విశేషం. 'గడిచిన ఐదు క్వార్టర్లలో ఉద్యోగుల తగ్గుదల జోరుకు క్రమంగా అడ్డుకట్ట పడటం సానుకూల పరిణామం' అని హైరింగ్ కంపెనీ ఎక్స్‌ఫెనో బిజినెస్ హెడ్ (టెక్నాలజీ సిబ్బంది నియామకాలు) దీప్తి ఎస్ పేర్కొన్నారు. టాప్–5లో మూడు దిగ్గజ సంస్థలు క్యూ1లో నికరంగా ఉద్యోగులను జత చేసుకోవడంతో నియామకాల రికవరీ ఆశలు చిగురిస్తున్నాయని, ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఐటీ పరిశ్రమ మళ్లీ కొత్త ఉద్యోగుల చేరికలతో కళకళలాడే అవకాశం ఉందని కూడా ఆమె అంచనా వేస్తున్నారు.

హైరింగ్‌పై ఆర్థిక అనిశ్చితి ఎఫెక్ట్...


దేశీ ఐటీ కంపెనీలకు ప్రధాన మార్కెట్లయిన అమెరికా, యూరప్‌లలో ఆర్థిక అనిశ్చితి కొనసాగుతుండటంతో గత ఏడాదిన్నరగా హైరింగ్‌కు ముఖం చాటేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఉద్యోగాల్లో కోతలకు కూడా తెరతీశాయి. అయితే, ఈ ఆర్థిక సంవత్సరం క్యూ1 ఫలితాల్లో ఈ ప్రతికూల పరిస్థితులు సద్దుమణుగుతున్న సంకేతాలు వెలువడ్డాయి. టాప్–5 కంపెనీల మొత్తం సిబ్బంది సంఖ్య ఈ జూన్ నాటికి 15,23,742కు చేరింది. మార్చి చివరికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 15,25,776గా నమోదైంది. టీసీఎస్ సిబ్బంది 6,06,998కి చేరింది. కొత్తగా 5,452 మంది జతయ్యారు. ఇన్ఫోసిస్ ఉద్యోగుల సంఖ్య 3.15 లక్షలకు చేరింది. 1,908 మంది తగ్గారు.

2,034
టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా మొత్తం ఉద్యోగుల సంఖ్య క్యూ1లో సీక్వెన్షియల్‌గా తగ్గుదల.

15,23,742
ఈ ఏడాది జూన్ (క్యూ1) చివరి నాటికి ఈ బిగ్‌5 కంపెనీల మొత్తం సిబ్బంది సంఖ్య 15,23,742.

5
గడిచిన ఐదు త్రైమాసికాలుగా సిబ్బంది తగ్గుదల క్రమంగా శాంతించడం సానుకూలాంశం.

హెచ్‌సీఎల్ టెక్‌లో దాదాపు 8,000 మంది తగ్గుదలతో మొత్తం సిబ్బంది 2.27 లక్షలకు చేరారు. విప్రోలో ఉద్యోగుల సంఖ్య క్యూ1లో స్వల్పంగా 337 మంది పెరిగి 2.34 లక్షలకు చేరింది. టెక్ మహీంద్రాకు నికరంగా 2,165 మంది జతకావడంతో మొత్తం ఉద్యోగులు 1.47 లక్షలకు పెరిగారు. అయితే, గతేడాది క్యూ1 నాటి సిబ్బంది సంఖ్యతో పోలిస్తే బిగ్–5 కంపెనీల్లో 46,325 మంది ఉద్యోగులు తగ్గారు. గడిచిన రెండేళ్లలో టాప్–5 కంపెనీల మొత్తం ఉద్యోగుల సంఖ్య 3 శాతం తగ్గగా... అంతక్రితం మూడేళ్ల కాలంతో పోలిస్తే 18 శాతం పెరిగారని దీప్తి తెలిపారు. ఐటీ హైరింగ్ విషయంలో సాధారణ స్థాయికి రావడానికి మరి కొన్నాళ్లు పట్టే అవకాశం ఉన్నప్పటికీ, తాజా గణాంకాలు ఆశాజనకంగా ఉన్నాయని ఆమె చెబుతున్నారు.



ఫ్రెషర్లకు చాన్స్..

ఐటీ రంగంలో ఫ్రెషర్ల హైరింగ్ భారీగా పుంజుకోనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 15,000–20,000 మంది ఫ్రెషర్లను నియమించుకునే అవకాశం ఉందని ఇన్ఫోసిస్ క్యూ1 ఫలితాల సందర్భంగా ప్రకటించింది. విప్రో సైతం 10,000–12,000 మందికి ఈ ఏడాది ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొంది. ప్రధానంగా జెనరేటివ్ ఏఐ, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ విభాగాల్లో కూడా అదనంగా ఉద్యోగులను తీసుకోనున్నట్లు కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. క్యూ1లో 3,000 మంది ఫ్రెషర్లకు (న్యూ జెన్ అసోసియేట్స్) అవకాశం ఇచ్చినట్లు తెలిపింది. ఇక హెచ్‌సీఎల్ టెక్ కొత్తగా 10,000 మంది ఫ్రెషర్లకు ఉద్యోగాలిస్తామని ప్రకటించింది. టీసీఎస్ సైతం క్యాంపస్ హైరింగ్‌పై దృష్టిపెడుతోంది. మొత్తంమీద ఈ ఐటీ పరిశ్రమ ఫ్రెష్ హైరింగ్ 1,00,000–1,20,000 స్థాయిలో ఉండొచ్చని హెచ్ఆర్ కన్సల్టెన్సీ ఎక్స్‌ఫెనో అంచనా. గతేడాది 60,000 స్థాయితో పోలిస్తే ఇది భారీగానే లెక్క.

– సాక్షి, బిజినెస్ డెస్క్

అగ్రిగోల్డ్ అంశంలో చంద్రబాబుది తప్పు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, అమరావతి: అగ్రిగోల్డ్ అంశంలో సీఎం చంద్రబాబు తప్పు చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే అగ్రిగోల్డ్ సంస్థకు రూ.21వేల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకుని డిపాజిట్‌దారులకు న్యాయం చేయాలని సీపీఐ తరఫున తాము కోరినట్లు చెప్పారు. ప్రస్తుతం మాజీ మంత్రి జోగి రమేష్ వ్యవహారం బయటకు వచ్చిందని, రానున్న రోజుల్లో మరిన్ని వెలుగు చూస్తాయన్నారు. విజయవాడలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నారాయణ తెలిపారు. హిండెన్‌బర్గ్ రిపోర్టు అంతర్జాతీయ స్థాయిలో సంచలనాలు రేకెత్తిస్తుందన్నారు.

'పుంగనూరు' అభ్యర్థులకు నోటీసులు

సాక్షి, అమరావతి: పుంగనూరు శాసన సభ్యుడిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికను సవాలు చేస్తూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రతివాదులందరికీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ అభ్యర్థి చల్లా బాబుతో పాటు పోటీ చేసిన వారందరికీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి తదితరులకు నోటీసులు ఇచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బెయిల్ కోరుతూ జోగి రాజీవ్ పిటిషన్

విజయవాడ స్పోర్ట్స్: అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ ఏసీబీ కోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి హిమబిందు విచారణ జరిపారు. అనంతరం కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీ అధికారులను ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేశారు. అంతకు ముందు రాజీవ్ తరఫు న్యాయవాది ఒగ్గు గవాస్కర్ వాదనలు వినిపించారు. రాజీవ్‌ను అక్రమంగా ఈ కేసులో ఇరికించారని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అరెస్ట్ చేశారని చెప్పారు.

● ఫలించని చర్చలు

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు చెల్లించని ప్రభుత్వం
బుధవారం అర్ధరాత్రి వరకు సీఈవోతో కొనసాగిన చర్చలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి సంజీవని లాంటి ఆరోగ్యశ్రీ పథకంపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. పథకం ఊసే లేకుండా చేయాలని సీఎం చంద్రబాబు నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలో పథకం నిర్వహణకు డబ్బులు లేవు.. కేంద్రం అమలు చేసే ఆయుష్మాన్ భారత్ పథకాన్నే ప్రజలు వినియోగించుకోవాలంటూ టీడీపీకి చెందిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉచిత సలహా ఇచ్చారు. మరోవైపు పథకం స్థానంలో బీమా ప్రవేశ పెట్టడానికి సిద్ధమైన బాబు సర్కార్.. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిల చెల్లింపులో జాప్యం చేస్తోంది. దీంతో ఆస్పత్రుల నిర్వహణ సాధ్యం కావడం లేదని, సిబ్బందికి జీతాల చెల్లింపు, మందులు, కన్జుమబుల్స్ కొనుగోలుకు కూడా డబ్బులు లేవని నెట్‌వర్క్ ఆస్పత్రులు చేతులెత్తేశాయి. గురువారం నుంచి పథకం సేవలను నిలిపి వేయడానికి ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశా) సిద్ధమైంది. బకాయిలు చెల్లిస్తేగానీ సేవలు కొనసాగించలేమని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో లక్ష్మిషాకు బుధవారం అసోసియేషన్ ప్రతినిధులు తేల్చిచెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆస్పత్రుల యాజమాన్య అసోసియేషన్ ప్రతినిధులతో సీఈవో అర్ధరాత్రి వరకు చర్చలు జరిపారు. ప్రస్తుతం రూ.200 కోట్లు విడుదల చేశామని, త్వరలో మరో రూ.300 కోట్లు ఇస్తామని సీఈవో వెల్లడించినట్టు తెలిసింది. ఇలా అరకొర నిధులతో ఆస్పత్రులను నడపలేమని వారు తేల్చి చెప్పినట్టు సమాచారం. బకాయిలు రూ.2500 కోట్లు వెంటనే విడుదల చేయాలని లేదంటే ఆగస్టు 15 నుంచి సేవలు నిలిపివేస్తామని ప్రభుత్వానికి నెట్‌వర్క్ ఆస్పత్రులు గత నెల 30వ తేదీనే అల్టిమేటం ఇచ్చాయి. తొలుత ఈ నెల 10వ తేదీలోగా కొంత మొత్తం విడుదల చేస్తామని అధికారులు చెప్పారు. రెండు వారాల తర్వాత బుధవారం రాత్రి కేవలం రూ.200 కోట్లు మాత్రమే విడుదల చేసిన ప్రభుత్వం.. సేవలు కొనసాగించాలని కోరింది. ఈ మేరకు సీఈవో లక్ష్మిషా ఆస్పత్రుల యాజమాన్యాలను కోరగా, వారు ససేమిరా అన్నట్లు సమాచారం. దీంతో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌తో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఈవో హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంతో కేవలం అత్యవసర కేసులు మాత్రమే చూసేందుకు యాజమాన్య అసోసియేషన్ ప్రతినిధులు సమ్మతించారు. మొత్తం బకాయిలు చెల్లించే వరకు పూర్తి స్థాయిలో సేవలు అందించలేమని స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో అత్యంత కీలకమైన పథకానికి నిధులు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తుండటం పట్ల ఆస్పత్రుల యాజమానులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



'రిమ్స్'లో నిర్లక్ష్యంపై విచారణ

వైద్యం ఆలస్యంపై శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

శ్రీకాకుళం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడికి మంగళవారం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సీరియస్‌గా స్పందించారు. యువకుడికి వైద్యం అందించడంలో జాప్యంపై 'ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..' అని బుధవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై కలెక్టర్ స్పందించి తక్షణమే విచారణ జరపాలని ఆర్డీవో రంగయ్య, శ్రీకాకుళం తహసీల్దార్ గణపతిరావులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీవో, తహసీల్దార్ బుధవారం ఉదయం 11.30కు రిమ్స్‌కు చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఎంఎస్‌వోలు, డ్యూటీ డాక్టర్, ఆర్ఎంవోలు, నర్సులను వేర్వేరుగా విచారణ చేశారు. అనంతరం నివేదికను తయారుచేసి మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్‌కు సమర్పించారు. అయితే, ఆ నివేదికలో ఆస్పత్రి వర్గాలు చెప్పిన వివరాలు మాత్రమే ఉండడంతో పూర్తి ఘటనపై రోగి బంధువుల నుంచి వివరాలు సేకరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షిని కలెక్టర్ ఆదేశించారు. వెంటనే 4.30 గంటల సమయంలో రిమ్స్‌కు వెళ్లిన డీఎంహెచ్‌వో కూడా సీసీ ఫుటేజీలను పరిశీలించారు. రోగిని 20 నిమిషాలకు పైగా అంబులెన్స్ నుంచి దించకపోవడం నిజమేనని గుర్తించి ఎంఎస్‌వోలతో మాట్లాడి విషయాన్ని ఆరా తీశారు. ఇద్దరు సెక్యూరిటీ గార్డులు అంబులెన్స్ సమీపంలో ఉన్నట్లు గుర్తించి వారితో మాట్లాడారు. రోగి బంధువులు, వారి ఫోన్ నంబర్లు అందుబాటులో లేకపోవడంతో అంబులెన్సు డ్రైవర్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎంఎస్‌వో, డ్యూటీ డాక్టర్లు, ఆర్ఎంవో, సూపరింటెండెంట్ల నుంచి వివరాలు తీసుకుని రాత్రి ఏడు గంటల సమయంలో కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. ఈ రెండు నివేదికల ఆధారంగా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

డెంగీకి రెండేళ్లలో టీకా!

మూడో దశ ప్రయోగాలు షురూ!
10,335 మందిని పరిశీలించనున్న ఐసీఎంఆర్, పాన్ ఆసియా
పూర్తిగా స్వదేశీ టెక్నాలజీలతో అభివృద్ధి

సాక్షి, హైదరాబాద్: సీజన్ మారిందంటే ప్రజలను బెంబేలెత్తించే డెంగీ వ్యాధికి చెక్ పడే అవకాశం కన్పిస్తోంది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), పాన్ ఆసియా బయోటెక్ కంపెనీలు కలిసికట్టుగా తయారు చేస్తున్న టీకా 'డెంగిఆల్' కీలకమైన మూడో దశ ప్రయోగాలకు సిద్ధమైంది. ఈ దశలోనూ ఆశించిన ఫలితాలు వస్తే టీకా అందుబాటులోకి రావడమే తరువాయి అవుతుంది. ఈ టీకా తయారీ ప్రక్రియ దేశీయంగానే జరిగిందని, డెంగీపై పోరాటంలో టీకా అభివృద్ధి కీలక మలుపు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం: నడ్డా

ఏదైనా వ్యాధి నివారణకు అభివృద్ధి చేసే టీకా మూడు దశల ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే పాన్ ఆసియా బయోటెక్ డెంగిఆల్‌పై ఇప్పటివరకు రెండు దశల ప్రయోగాలను పూర్తి చేసింది. తాజాగా బుధవారం హరియాణాలోని రోహతక్‌లో ఉన్న పండిట్ భగవత్ దయాళ్ శర్మ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మూడో దశ ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ.. డెంగిఆల్ మూడో దశకు చేరుకోవడం ప్రజారోగ్య సంరక్షణపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. పూర్తిగా స్వదేశీ టెక్నాలజీల సాయంతో ఈ టీకాను అభివృద్ధి చేయడం ఆరోగ్య రంగంలో ఆత్మ నిర్భర్ భారత్‌కు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.

కోవిడ్‌కు ముందే రెండు దశలు పూర్తి

కనీసం నాలుగు రకాల డెంగీ వైరస్‌లను నియంత్రించే లక్ష్యంతో టీకా తయారీ ప్రయత్నాలు మొదలయ్యాయి. అమెరికా లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అభివృద్ధి చేసిన ఒక టెట్రా వేలంట్ టీకా ప్రపంచ వ్యాప్తంగా ప్రీ క్లినికల్, క్లినికల్ ట్రయల్స్‌లో ప్రభావశీలంగా కనిపించింది. అయితే దేశంలోని పాన్ ఆసియా బయోటెక్‌కు కూడా ఇది అందుబాటులోకి రావడంతో ఆ కంపెనీ ఐసీఎంఆర్‌తో కలిసి ప్రయోగాలు మొదలుపెట్టింది. తొలి, మలి దశ ప్రయోగాలు కోవిడ్‌కు ముందు 2018 – 19లోనే పూర్తి చేసింది. మూడో దశ ప్రయోగాల కోసం 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 19 కేంద్రాలను ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 10,335 మందిపై జరిగే మూడో దశ ప్రయోగాల్లో భాగంగా టీకాలు తీసుకున్న వారిని రెండేళ్ల పాటు పరిశీలించనున్నారు.

పిన్నెల్లి వ్యాజ్యాలను తగిన బెంచ్ ముందుంచండి

- హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించిన జస్టిస్ కృపాసాగర్



సాక్షి, అమరావతి: రెంటచింతల, కారంపూడి పోలీసులు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ కోరుతూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలను తగిన బెంచ్ ముందుంచాలని హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం రిజిస్ట్రీని ఆదేశించారు. పోలింగ్ రోజున పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసి, అడ్డువచ్చిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేశారంటూ రెంటచింతల పోలీసులు రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆ మరునాడు కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడి చేసి గాయపరిచారంటూ కారంపూడి పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కింద కూడా రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు ఇటీవల గురజాల కోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో ఆయన బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా, జస్టిస్ కృపాసాగర్ ముందు ఇటీవల విచారణకు వచ్చాయి. ఇదే కేసులకు సంబంధించి గతంలో పిన్నెల్లి దాఖలు చేసిన వ్యాజ్యాలను విచారించిన న్యాయమూర్తే తాజా పిటిషన్లను కూడా విచారించాలని పోలీసుల తరఫు న్యాయవాది చెప్పారు. అలాంటిది ఏమీ లేదని, రోస్టర్ ఎవరికి ఉంటే వారే విచారించాలని పిన్నెల్లి తరఫు న్యాయవాది చెప్పారు. వాదనలు విన్న జస్టిస్ కృపాసాగర్ బుధవారం తన నిర్ణయాన్ని వెలువరించారు. పిన్నెల్లి వ్యాజ్యాలను తగిన బెంచ్ ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊరట

సాక్షి, అమరావతి: గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హైకోర్టులో ఊరట లభించింది. ఈ నెల 20వ తేదీ వరకు ఆయనపై ఎలాంటి తొందరపాటు చర్యలు వద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపా సాగర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో 71వ నిందితునిగా ఉన్న వంశీ ముందస్తు మధ్యంతర బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ కృపా సాగర్ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వేములపాటి పట్టాభి వాదనలు వినిపించారు. 2023 ఫిబ్రవరిలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, ఏడాదిన్నర తర్వాత వంశీని నిందితుడిగా చేర్చారని, ఇంత జాప్యం ఎందుకు జరిగిందో కూడా చెప్పడంలేదని పట్టాభి చెప్పారు. ప్రభుత్వం మారిన తరువాత రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఇలా చేశారన్నారు. పెట్టినవన్నీ నాన్ బెయిలబుల్ కేసులని, దీనిని బట్టి ప్రభుత్వ పెద్దల ఆదేశానుసారం పోలీసులు నడుచుకుంటున్నారన్న విషయం స్పష్టమవుతోందని అన్నారు. పిటిషనర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారన్నారు. వాస్తవానికి ఈ కేసు చెల్లదని తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో పిటిషనర్‌పై ఎలాంటి నిర్దిష్ట ఆరోపణలు లేవన్నారు. టీడీపీ నేతలపై పిటిషనర్ న్యాయపరంగా పోరాటం చేస్తున్నారన్న కక్షతోనే తప్పుడు కేసులో ఇరికించారని తెలిపారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పిటిషనర్‌కు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

క్లుప్తంగా...

ఆ 16 మంది ఐపీఎస్‌లు అందుబాటులో ఉండాలి!

సాక్షి, అమరావతి: పోస్టింగులు ఇవ్వకుండా వెయిటింగ్‌లో‌ఉంచిన 16మంది ఐపీఎస్ అధికారులు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. ఉదయం, సాయంత్రం రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని .. ఏదైనా అత్యవసర విధుల కోసం అందుబాటులో ఉండాలని ఆయన జారీ చేసిన మెమోలో పేర్కొన్నారు.

'వెలుగు'ను మెరుగు పరచండి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సాక్షి, అమరావతి: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు కార్యకలాపాలను మెరుగు పరిచి అభివృద్ధి పథంలో పయనింపజేయాలని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కేంద్ర కార్యాలయంలో అధికారులతో బుధవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలను ప్రగతిశీలంగా పనిచేసేందుకు తక్షణ చర్యలను చేపట్టి వినూత్నంగా ముందుకు సాగాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న 51వెలుగు మహిళా మార్టులు అత్యంత ప్రగతి సాధించేలా వ్యాపారాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలను చిన్న, సూక్ష్మ వ్యాపార సంస్థలుగానూ, రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఉన్న మండల సమాఖ్యలను చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలుగా అభివృద్ధి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. సెర్ప్ సీఈవో వీరపాండ్యన్, డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్‌పై దాడి

ఆగ్రహించిన జూడాలు
కర్నూలు కలెక్టరేట్ ముట్టడి

కర్నూలు (సెంట్రల్/హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై వ్యక్తి దాడి చేయడంతో జూనియర్ డాక్టర్లు ఆగ్రహించారు. నాలుగు రోజుల క్రితం బూత్ బంగ్లా విభాగంలో దివాకర్ నాయుడు అనే వ్యక్తి కాలు సెప్టిక్ కావడంతో చికిత్స నిమిత్తం చేరాడు. ఆయనకు ఆ రోజు నుంచి వైద్యం అందిస్తున్నారు. బుధవారం ఉదయం దివాకర్ నాయుడుకు సహాయకుడిగా వచ్చిన గిరీష్ తన తండ్రికి వైద్యం సక్రమంగా చేయడం లేదని, కనీసం డ్రెస్సింగ్ చేయడం లేదంటూ పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న సర్జన్ డాక్టర్ అరవింద్‌తో వాదనకు దిగాడు. ఈ నేపథ్యంలో ఇద్దరూ ఒకరినొకరు కొట్టుకున్నారు. కోల్‌కతా మెడికోకు సంఘీభావంగా నిరసన తెలపాలని సిద్ధమవుతున్న జూడాలకు ఈ విషయం తెలియడంతో ఒక్కసారిగా వందలాదిగా తరలివచ్చి మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటకుపైగా అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. చివరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వచ్చారు. అక్కడ పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో జూడాలు ఆందోళన విరమించారు.

వైవీయూ అధ్యాపకుడికి జర్మనీ ఫెలోషిప్



వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు డాక్టర్ వసు గోవర్ధనరెడ్డి ప్రతిష్టాత్మక అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ రిన్యూడ్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. జర్మనీలోని అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ ఫౌండేషన్ పరిశోధకులకు అందించే అత్యంత గౌరవమైన ఫెలోషిప్‌గా దీన్ని భావిస్తారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

- ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు మృతి




సిద్ధేశ్వర, వెంకటసుబ్బయ్య (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్/ఓబులవారిపల్లె: లారీ ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మంగంపేట అగ్రహారానికి చెందిన పుల్లగుంట సుబ్బయ్య (45), బత్తల సిద్ధేశ్వర (35) వ్యక్తిగత పనుల నిమిత్తం రైల్వే కోడూరుకు బైక్‌పై బయలుదేరారు. రైల్వే కోడూరు నుంచి ట్రావెలర్ లారీ.. కడప-రేణిగుంట జాతీయ రహదారి వై.కోట క్రాస్ వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వచ్చి ముందు వెళ్తున్న రెండు బైక్‌లను ఢీకొంది. ఓ వాహనంలో వెళ్తున్న సుబ్బయ్య, బత్తల సిద్ధేశ్వర అక్కడికక్కడే మృతి చెందారు. మరో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఢీకొట్టిన లారీతో సహా డ్రైవర్ పరారవగా.. గ్రామస్తులు వెంబడించి పట్టుకున్నారు. మృతులు సుబ్బయ్య టైమెక్స్ కంపెనీలో, సిద్ధేశ్వర త్రివేణి కంపెనీలో పనిచేస్తున్నారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో.. యాజమాన్య కోటాకు నోటిఫికేషన్

- ఈనెల 21 వరకూ దరఖాస్తులకు అవకాశం
- ఆలస్య రుసుముతో 21 నుంచి 23 వరకూ వీలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల యాజమాన్య కోటా.. గత ఏడాది ప్రారంభించిన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ ఎంబీబీఎస్.. స్కీమ్స్‌లో ఎంబీబీఎస్ సీట్ల ఎన్ఆర్ఐ కోటాలో ప్రవేశాల కోసం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. నీట్ యూజీ-2024 అర్హత సాధించిన విద్యార్థులు బుధవారం రాత్రి 10 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఇందుకు ఈనెల 21వ తేదీ రాత్రి 9 గంటల వరకు గడువు విధించారు. అలాగే, శుక్రవారం (16వ తేదీ) సా.7 గంటల నుంచి ఆదివారం (18వ తేదీ) రాత్రి 9 గంటల వరకూ ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉండదని.. ఈ సమయంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి వీలుండదని వర్సిటీ వెల్లడించింది. ఈ వ్యవధిలో కన్వీనర్ కోటాలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలుండదని తెలిపారు. ఏపీ ఆన్‌లైన్ ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వ సర్వర్లు మెయింటెనెన్స్‌లో ఉండడంవల్ల ఈ అంతరాయం ఉంటుందని సమాచారం. యాజమాన్య కోటా సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు సమయంలో విద్యార్థులు రూ.10,620ల రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రూ.30,620ల ఆలస్య రుసుముతో 21వ తేదీ రాత్రి 9 గంటల నుంచి 23వ తేదీ సా.6 గంటల వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో నియమ నిబంధనల్లో సందేహాల నివృత్తికి 8978780501, 7997710168.. సాంకేతిక సమస్యలపై 9000780707 నెంబర్లను సంప్రదించాల్సిందిగా రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

దళారుల మాటలు నమ్మొద్దు..

నీట్ యూజీ మెరిట్ స్కోర్ ఆధారంగా నియమ నిబంధనలకు లోబడి ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కేటాయింపు ఉంటుందని.. తల్లిదండ్రులు, విద్యార్థులు దళారుల మాయమాటలు నమ్మొద్దని రాధికారెడ్డి సూచించారు. విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల ప్రభుత్వ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ 225.. ఎన్ఆర్ఐ కోటా 95 చొప్పున ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఈ సీట్లను తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థులకు ఉచితంగా అందజేస్తామని టీడీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక దానిని తుంగలో తొక్కి ఎంబీబీఎస్ సీట్లను అమ్మకానికి పెట్టారు. మరోవైపు.. స్కీమ్స్‌లో 23, ఎన్ఆర్ఐ-ప్రైవేట్, మైనారిటీ వైద్య కళాశాలల్లో 1,078 బీ-కేటగిరి, 472 ఎన్ఆర్ఐ ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. దంత వైద్య కళాశాలల్లో 489 బీ-కేటగిరి, 211 ఎన్ఆర్ఐ బీడీఎస్ సీట్లున్నాయి.

ఇసుక బుకింగ్‌కు ఆన్‌లైన్ అప్లికేషన్

సీఎం సమీక్షలో మార్గదర్శకాలు జారీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇసుక బుక్ చేసుకోవడానికి ఆన్‌లైన్ అప్లికేషన్ రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని గనుల శాఖ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక సరఫరాపై బుధవారం నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మార్గదర్శకాలు జారీ చేశారని వెల్లడించారు.

మార్గదర్శకాలివీ..

- ఆన్‌లైన్ అప్లికేషన్‌తో పాటు వినియోగదారులు గ్రామ, వార్డు సచివాలయాలను సందర్శించి ఇసుక బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.
- బుకింగ్ సమయంలోనే ఏ రోజున ఇసుక డెలివరీ అవుతుందనే సమాచారం వినియోగదారుడికి తెలియజేస్తారు.
- ఆన్‌లైన్ విధానంలో బల్క్ బుకింగ్ కోసం ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- బల్క్ బుకింగ్ చేసుకునే వారు జీఎస్టీ, నిర్మాణ పనులు, ప్రాజెక్ట్‌ల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ వివరాల ఆధారంగా ప్రభుత్వ ప్రతినిధులు భౌతికంగా పని ప్రదేశాలను సందర్శించి పరిశీలిస్తారు.
- ఇసుక వినియోగంపై క్రమానుగుణంగా థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా ఆడిట్ నిర్వహిస్తారు.
- ఇసుక సరఫరా కోసం వెహికల్ ఎంపానెల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెడతారు. రిజిస్టర్డ్ వాహనాలను లేదా వినియోగదారు సొంత వాహనాల ద్వారా ఇసుక సరఫరా కోసం ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంటుంది.
- దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడంలో భాగంగా రీచ్/స్టాక్ పాయింట్ సామర్థ్యం ఆధారంగా రోజువారీ సరఫరాపై షరతులు విధిస్తారు.
- మొదట బుక్ చేసుకున్న వారికే ఇసుక సరఫరా అయ్యేలా చూడటంతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంచుతారు.
- వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్, జిల్లా విజిలెన్స్ కమిటీలను బలోపేతం చేయడం సహా పలు చర్యలు చేపడతారు.
- ఇసుక సమస్యలపై 1800-599-45999, dmgapsandcomplaints@yahoo.com కు ఫిర్యాదులు చేయవచ్చు.
- ఇసుక సరఫరాను రియల్ టైమ్‌లో మానిటరింగ్ చేయడం, వినియోగదారులు, రవాణాదారుల, ఇతర వాటాదారుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడానికి ప్రతి జిల్లాలో సులభతర కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.
- ఇసుక తవ్వకం, రవాణా కార్యకలాపాలన్నిటినీ పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయిలో కమాండ్, కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. కమాండ్, కంట్రోల్ సెంటర్ వినియోగదారుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారించడానికి కృషి చేస్తుంది.
- ఇసుక విధానంపై ప్రజల సంతృప్తిని కాలానుగుణ ఫీడ్‌బ్యాక్ ద్వారా అంచనా వేస్తారు.
- వినియోగదారులకు ఇసుక బుకింగ్ సౌలభ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు, అక్రమ రవాణా కట్టడి, ఇతర అంశాల్లో కృత్రిమ మేధస్సు ఉపయోగిస్తారు. బుకింగ్ సౌలభ్యం, సమర్థవంతమైన ఇసుక కార్యకలాపాలు, రవాణాను మెరుగుపరచడం కోసం వివరణాత్మక మార్గదర్శకాలను రూపొందించి, ప్రజల అభిప్రాయాలు సేకరించనున్నారు.

పాకాలలో నూతన కోర్టు భవనం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



నూతన కోర్టు భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

పాకాల: తిరుపతి జిల్లా పాకాలలోని చిత్తూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) భవనాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ బుధవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆయనతోపాటు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ 37 ఏళ్లుగా పాకాల కోర్టును అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని, కక్షిదారుల సౌకర్యం కోసం సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నూతన భవనం నిర్మించినట్లు తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలు, మంచి వాతావరణంలో కోర్టు నూతన భవనం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు, ఇన్‌చార్జ్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ బాబాజాన్, చిత్తూరు 3వ అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఎస్.శ్రీనివాస్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పీ వెంకటరావు, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎస్.ద్వారకానాథరెడ్డి, పాకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నెల్లేపల్లి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బి.చిన్నరెడ్డెప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈ నెల 21కి వాయిదా వేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడికి సంబంధించి నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ వైఎస్సార్‌సీపీ నేతలు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యాల్లో పోలీసుల వాదనలు ముగిశాయి. ఈ వాదనలకు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు సమాధానం ఇచ్చేందుకు తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేష్, విజయవాడ తూర్పు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, పలువురు కార్యకర్తలు ముందస్తు బెయిలు కోరుతూ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ కృపాసాగర్ బుధవారం మరోసారి విచారణ జరిపారు. పోలీసుల తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

ప్రభుత్వ భవనాలపై సోలార్ రూఫ్ టాప్

సీఎం సమక్షంలో నెడ్‌క్యాప్, ఎన్‌వీవీఎన్ అధికారుల సంతకాలు



సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఎన్‌వీవీఎన్, నెడ్‌క్యాప్ అధికారులు

సాక్షి, అమరావతి: ఎన్టీపీసీ విద్యుత్ వ్యాపార్ నిగమ్ లిమిటెడ్ (ఎన్‌వీవీఎన్) సహకారంతో రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాలపై సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ల సమక్షంలో ఎన్‌వీవీఎన్, రాష్ట్ర నూతన పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(నెడ్‌క్యాప్) అధికారులు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా ప్రభుత్వ సంస్థల్లో సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌లను ప్రోత్సహించడానికి ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్‌సింగ్, ఎన్‌వీవీఎన్ సీఈవో రేణునారంగ్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఎస్ఆర్ఈడీసీఏపీ వీసీఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు పాల్గొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం మొదటి దశలో 300 మెగావాట్ల సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌లను ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేస్తారు. 25 సంవత్సరాల కాలానికి ఒకే టారిఫ్(చార్జీ)తో సౌరవిద్యుత్ లభిస్తుంది. ఈ కాలానికి సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ల నిర్వహణ సేవలను ఎన్‌వీవీఎన్ ఉచితంగా అందిస్తుంది.

రాష్ట్రంలో ప్రధానమంత్రి సూర్య ఘర్, ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఆ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

రాష్ట్రంలో ఆస్ట్రేలియా పెట్టుబడులు: టీజీ భరత్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త కంపెనీల ఏర్పాటు, ప్రస్తుత కంపెనీల విస్తరణకు సహకరించాల్సిందిగా ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సైలాయ్ జాకీను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ కోరారు. మంగళగిరిలో ఏపీఐఐసీ భవనంలో మంత్రి భరత్‌ను ఆస్ట్రేలియన్ ప్రతినిధుల బృందం బుధవారం కలిసి మాట్లాడింది. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై మంత్రి చర్చించారు. ఏపీలో కంపెనీలను విస్తరించేందుకు కృషి చేయాల్సిందిగా ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్‌ను ఈ సందర్భంగా మంత్రి కోరారు. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా బృందాన్ని ఏపీ జెన్‌కో ఎండీ, నెడ్ క్యాప్ వీసీఎండీ కె.వి.ఎన్.చక్రధర్ బాబు కోరారు. విద్యుత్ సౌధలోని స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్‌ను చెన్నైలోని ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సైలాయ్ జాకీ, ఆస్ట్రేలియన్ కాన్సులేట్ డిప్యూటీ జనరల్ డేవిడ్ ఎగ్లెస్టన్ సందర్శించారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడా?

- త్వరలోనే ఏపీకి బృందాన్ని పంపిస్తాం..
- దుండగుల్ని శిక్షించేలా చర్యలు
- వైఎస్సార్‌సీపీ నేతలకు ఎన్‌సీఎస్సీ చైర్మన్ కిషోర్ మక్వానా హామీ




ఎన్‌సీఎస్సీ చైర్మన్ కిషోర్ మక్వానాకు వినతిపత్రం అందజేస్తున్న సురేశ్, ఎంపీ గురుమూర్తి, నాగార్జున, అరుణ్ కుమార్, అనిల్ కుమార్, సురేశ్

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి జరిగిందన్న విషయం తెలుసుకొని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'అసలా ఆలోచన ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది?' అని పూర్తి వివరాలు ఆరా తీశారు. ఈ ఘటనకు సంబంధించి వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ బృందంతో ఆయన సుదీర్ఘంగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దుండగుల్ని విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు. 'అంబేడ్కర్ విగ్రహం జాతీయ సంపద. దానిపై ఎవరూ దాడి చేయకూడదు. అమానుషంగా ప్రవర్తించకూడదు. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. త్వరలోనే ఏపీకి కమిషన్ నుంచి బృందాన్ని పంపి పూర్వాపరాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించుకుంటామని తెలిపారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని వైఎస్సార్‌సీపీ బృందానికి హామీ ఇచ్చారు. ఆగస్టు 8న విజయవాడ నడిబొడ్డున వైఎస్ జగన్ నిర్మించిన అంబేడ్కర్ విగ్రహంపై దాడి జరిగిన విషయం విదితమే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి నేతృత్వంలో మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌లతో కూడిన బృందం బుధవారం ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో భేటీ అయింది. 'అంబేడ్కర్ విగ్రహానికి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలి. పోలీసుల నిర్లక్ష్యంపై విచారణ జరిపించాలి. వీలైనంత త్వరగా దుండగుల్ని పట్టుకొని భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలి' అనే మూడు డిమాండ్లతో వినతిపత్రం అందజేసింది. అనంతరం పార్టీ నేతలు మీడియాతో మాట్లాడారు.

వెటర్నరీ విద్యార్థుల మెరుపు ధర్నా

ఫైన్ల పేరుతో భారీ వసూళ్లపై కన్నెర్ర



మెరుపు ధర్నాకు దిగిన వెటర్నరీ విద్యార్థులు

తిరుపతి సిటీ: శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలో పశువైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు హాస్టల్‌లో బుధవారం రాత్రి మెరుపు ధర్నాకు దిగారు. వెటర్నరీ కళాశాల హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులతో అధికారులు విచిత్రంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న విషయానికి సైతం ఫైన్ల పేరుతో రూ.వేలల్లో అపరాధ రుసుం వసూలు చేస్తున్నారని వాపోయారు. మెస్‌లో ప్రతి రోజు నాసిరం భోజనం వడ్డిస్తున్నారని, మెస్ బిల్లులు మాత్రం నెలకు రూ.4 వేల నుంచి 5 వేలకు పైగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారని తెలిపారు. వార్డెన్లు విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఎదురు తిరిగి మాట్లాడిన విద్యార్థులపై అపరాధం వేసి మెస్ బిల్లులో కలుపుతున్నారని వాపోయారు. ఇంత జరుగుతున్నా వర్సిటీ అధికారులు వార్డెన్లను వెనకేసుకురావడం దారుణమన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943